శనివారం 10-8-2024


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 140

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎమ్) గా భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ సీనియర్ అధికారి **కె.పద్మజ** హైదరాబాద్ రైల్ నిలయంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. 1991 ఐఆర్‌టిఎస్ బ్యాచ్‌కు చెందిన పద్మజ ఎస్‌సిఆర్‌లో మొట్టమొదటి మహిళా పిసిసిఎమ్. 'ఇప్పుడంటే మహిళా అధికారులను అందరూ అంగీకరిస్తున్నారు కానీ, 30 ఏళ్ల క్రితం పురుష ఉద్యోగులు నా నుంచి ఆర్డర్స్ తీసుకోవడానికే ఇబ్బంది పడేవారు..' అంటూ నాటి విషయాలను చెబుతూనే, ఉద్యోగ జీవనంలో సవాళ్లను ఎదుర్కొన్న తీరు తెన్నులను 'సాక్షి'తో పంచుకున్నారు.



కె.పద్మజ

సవాళ్లే పట్టాలెక్కించేది

"సౌత్ సెంట్రల్ రైల్వేలో మొట్టమొదటి మహిళా ఆఫీసర్‌గా ఈ పోస్ట్‌లోకి రావడం చాలా సంతోషం అనిపించింది. ఇప్పుడంటే వర్క్‌ఫోర్స్‌లో చాలామంది అమ్మాయిలు వస్తున్నారు. కానీ, నేను జాయిన్ అయినప్పుడు ఒక్కదాన్నే ఉండేదాన్ని. కొత్తగా వర్క్‌లో చేరినప్పుడు ఒక తరహా స్ట్రెస్ ఉండేది. నన్ను నేను చాలా సమాధానపరుచుకునేదాన్ని. 'ఒక్కదాన్నే ఉన్నాను అని ఎందుకు అనుకోవాలి.. ఎవరో ఒకరు రూట్ వేస్తేనే ఆ తర్వాత వచ్చే మహిళలకు మార్గం సులువు అవుతుంది కదా' అనుకునేదాన్ని.

ఎదుర్కొన్న సవాళ్లు

మొదట్లో డివిజనల్ ఆఫీస్ మేనేజర్‌గా జాయిన్ అయినప్పుడు ఒక మహిళను అధికారిగా అంగీకరించడానికి సహోద్యోగులకే కష్టంగా ఉండేది. నేను మొదటిసారి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లినప్పుడు స్టేషన్ మాస్టర్‌కి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మొదట వాళ్లు నమ్మలేదు. ఆఫీసుకు ఫోన్ చేసి 'ఇక్కడెవరో లేడీ వచ్చారు. ఆవిడేమో నేను డివిజనల్ ఆఫీస్ మేనేజర్‌ని అంటోంది, ఏమిటిది?' అని అడిగారు. మా కొలీగ్ 'ఆవిడ కూడా నాలాగే ఆఫీసర్' అంటే అప్పుడు వాళ్లు అంగీకరించక తప్పలేదు. ఆ స్టేజ్ నుంచి ఇక్కడకు రావడానికి చాలా సవాళ్లు ఉన్నాయి. మొదట్లో గుర్తించిన మరో విషయం ఏంటంటే తోటి ఉద్యోగులు చాలామంది నా నుంచి ఆర్డర్స్ తీసుకోవడానికే ఇబ్బంది పడేవారు. దీంతో 'నేను ఎక్స్‌పర్ట్ అయితేనే ఈ అసమానతను తొలగించగలను' అనుకున్నాను. అందుకు, నా పనిని ఎప్పుడూ ముందు చేసినదానికన్నా బెటర్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చాను. పనిచేసే చోట రూల్స్ పరంగా అన్నీ క్లియర్‌గా ఉంటాయి. అయితే, మనతో ఉండే కొలీగ్స్, సీనియర్స్ విషయంలో వారి ప్రవర్తనలో తేడాలు కనిపిస్తుంటాయి. 'ఇంత సమర్థంగా చేస్తున్నా కూడా ఇంకా వివక్షతోనే చూస్తున్నారే..' అని అనిపించేది. ఇంటినుంచి బయటకు వచ్చినప్పుడు వీటన్నింటినీ ఎదుర్కోకతప్పదు అన్నట్టుగా ఉండేవి ఆ రోజులు. ఇప్పటి తరంలో ఈ ఆలోచన పూర్తిగా మారిపోయింది. అయితే, ఏదీ అంత సులువైనది కాదు, కష్టమైన జర్నీయే. కానీ, నిన్నటి కన్నా ఈ రోజు బెటర్‌గా మార్చుకుంటూ రావడమే నన్ను ఇలా ఒక ఉన్నత స్థానంలో మీ ముందుంచ గలిగింది.

కుటుంబ మద్దతు

ట్రెయిన్స్‌కు సంబంధించిన సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాలు, ప్రమాదాలు.. వంటి సమయాల్లో నైట్ డ్యూటీస్ కూడా తప్పనిసరి. నిరంతరాయంగా పని చేస్తూనే ఉండాలి. మా పని ఈ కొద్ది గంటలు మాత్రమే అన్నట్టు ఏమీ ఉండదు. 24/7 ఏ సమయంలోనైనా డ్యూటీలో ఉండాల్సిందే. మా పేరెంట్స్, కుటుంబ సభ్యులందరూ నా బాధ్యతలను, పని ఒత్తిడిని అర్థం చేసుకొని, పూర్తి మద్దతుని, సహకారాన్ని ఇవ్వడం వల్ల నేను నిశ్చింతగా నా పనులు చేసుకోగలిగాను.

ముఖ్యమైనవి వదులుకోవద్దు

పిల్లల చిన్నప్పుడు మాత్రం తీరిక దొరికేది కాదు. ఉద్యోగం, ఇల్లు, వేడుకలు.. వీటన్నింటిలో కొన్ని త్యాగాలు చేయక తప్పలేదు. వాటిని మనం అంగీకరించాల్సిందే. అయితే, ముఖ్యమైన వాటిని వదిలేదాన్ని కాదు. నాకు ఇద్దరు కూతుళ్లు. ఇప్పుడు వాళ్లు వర్కింగ్ ఉమెన్. డ్యూటీ చూసుకుంటూనే పిల్లల పేరెంట్ టీచర్ మీట్, స్పోర్ట్స్ మీట్, స్కూల్ ఈవెంట్స్.. తప్పనిసరి అనుకున్నవి ఏవీ మిస్ అయ్యేదాన్ని కాదు. ఆఫీస్ పని వల్ల ఇంట్లో ముఖ్యమైన వాటిని వదులుకున్నాను ... అనుకునే సందర్భాలు రాకూడదు అనుకునేదాన్ని. ఉద్యోగంలో చేరిన కొత్తలో ఊపిరి సలుపుకోనివ్వనంతగా పనులు చేస్తున్నాను అనే ఫీలింగ్ ఉండేది. అయితే, వర్క్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టిన తర్వాత అన్నీ సులువుగా బ్యాలన్స్ చేసుకోగలిగాను. మా నాన్నగారు ఐఎఎస్ ఆఫీసర్ కావడంతో తరచు బదిలీలు ఉండేవి. మా అమ్మానాన్నలు ఎంతో బిజీగా ఉండి కూడా మాతో ఎలా ఉండేవారో తెలుసు కాబట్టి, నేనే సరైన టైమ్ ప్లానింగ్ చేసుకోవాలి అనుకున్నాను. ఏదైనా పనికి గంట సమయం కుదరకపోతే అర గంటలోనైనా పూర్తి చేయాలి. ప్లానింగ్ మన చేతుల్లో ఉన్నప్పుడు దేనినీ వదులుకోవాల్సిన అవసరం లేదు. నాకు బుక్స్ చదవడం చాలా ఇష్టం. ఇప్పటికీ రోజూ కొంతసమయం బుక్స్‌కి కేటాయిస్తాను. అలాగే, మొక్కల పెంపకం పట్ల శ్రద్ధ తీసుకుంటాను.

పాజిటివ్ ఆలోచనలు మేలు..

ముందుగా మహిళ ఇతరుల మెదళ్ల నుంచి ఆలోచించడం మానేయాలి. వాళ్లేం అనుకుంటారో, వీళ్లేం అంటారో... అనే ఆలోచన మన జీవితాన్ని నరక మయం చేస్తుంది. కెరియర్ మొదట్లోనే మన కల పట్ల స్పష్టత ఉండాలి. ఎన్ని సమస్యలు వస్తున్నా మనకంటూ ఒక స్పష్టమైన దారిని ఎంచుకోవాలి. సగం జీవితం అయిపోయాకనో, పిల్లలు పెద్దయ్యాక చూద్దాంలే అనో అనుకోవద్దు. ముందుగా అన్ని రకాలుగా స్థిరత్వం ఉండేలా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలి. సమస్యలు వచ్చేదే మనల్ని ధైర్యంగా ఉంచడానికి అనుకోవాలి. మనకు ఏం కావాలో స్పష్టత ఉంటే బ్యాలెన్స్ చేసుకోవడం సులువు అవుతుంది" అంటూ సొంతంగా వేసుకున్న దారుల గురించి వివరించారు ఈ ఆఫీసర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో: నోముల రాజేష్‌రెడ్డి

హెల్దీ డైట్
హై ప్రొటీన్ ఆమ్లెట్ రోల్ అప్



కావలసినవి: పాలకూర– కప్పు; వెల్లుల్లి రేక – 1; శనగపిండి – టీ స్పూన్; కోడి గుడ్లు – 2; టొమాటో –1 (తరగాలి); ఉల్లిపాయ– 1 (తరగాలి); పచ్చిమిర్చి–1 (తరగాలి); కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్; చీజ్– పావు కప్పు; నీరు – పావు కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● పాలకూరను కడిగి నీరు పోయే వరకు ఆరనివ్వాలి. మిక్సీజార్‌లో పాలకూర, వెల్లుల్లి, శనగపిండి, నీరు, కొద్దిగా ఉప్పు వేసి గ్రైండ్ చేసి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో కోడిగుడ్ల సొన, టొమాటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, మిగిలిన ఉప్పు, చీజ్ వేసి బీటర్‌తో నురగ వచ్చే వరకు చిలకాలి ● పెనం వేడి చేసి నూనె వేసి కోడిగుడ్డు సొన మిశ్రమాన్ని పోయాలి. ఆమ్లెట్ ఒక మోస్తరుగా కాలిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి పెట్టుకున్న పాలకూర మిశ్రమాన్ని ఆమ్లెట్ మీద పోసి మూత పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. కాలిన తర్వాత తిరగేసి ఆమ్లెట్‌ను రోల్ చేయాలి. ఈ రోల్‌ను చిన్న ముక్కలు చేసి సర్వ్ చేయాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు: కేలరీలు– 250; ప్రొటీన్– 20 గ్రాములు; కార్బోహైడ్రేట్‌లు – 12 గ్రాములు; ఫ్యాట్ – 15 గ్రాములు; ఫైబర్ – 4 గ్రాములు; కొలెస్ట్రాల్– 240 మిల్లీగ్రాములు; సోడియం– 500 మిల్లీగ్రాములు; విటమిన్ ఏ– 40శాతం డీవీ; విటమిన్ సీ– 25 శాతం డీవీ; క్యాల్షియం– 15 శాతం డీవీ; ఐరన్– 14 శాతం డీవీ

గమనిక: డీవీ అంటే డైలీ వాల్యూ. ఒకరోజులో దేహానికి అందాల్సిన సంబంధిత పోషకంలో ఈ పదార్థం ద్వారా అందే విలువ ఎంతో తెలియచేసే విధానం.









లూయిూ @ 112
ఆరోగ్యమే ఆనందం

వందేళ్ల వనిత కాదామె. మరో పుష్కరకాలాన్ని కూడా చూసిన మహిళ. అత్యంత ఎక్కువ వయసున్న నగర నివాసిగా న్యూయార్క్ నగరం ఆమెను గుర్తించింది, గౌరవించింది. ఆమె పేరు లూయిూ జీన్ సిగ్నోర్.

లూయిూ జీన్ సిగ్నోర్ 1912లో న్యూయార్క్ నగరానికి సమీపంలోని హార్లెమ్‌లో పుట్టారు. నాలుగు దశాబ్దాల పాటు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీలో ఉద్యోగం చేశారు. ఇటలీ నుంచి వచ్చి అమెరికాలో స్థిర పడిన కుటుంబం వారిది. ఇటాలియన్ అమెరికన్ ఆమె. వార్ధక్యం తప్ప ఎటువంటి అనారోగ్యమూ లేకుండా ఆరోగ్యంగా జీవించడానికి కారణం ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడమేనంటారు లూయిూ. ఎవరి ఆరోగ్యం గురించి పట్టించుకోవాల్సింది వారే. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు పట్టించుకోవాలని ఎదురు చూడకూడదు. అలాగని ఒంటరిగా జీవించడంలో నిరుత్సాహ పడకూడదు. ఇందుకు లూయిూ జీన్ సిగ్నోరే ఉదాహరణ.

బాగా నిద్రపోతాను!

"ఇది నా దేహం. నా దేహానికి ఏం కావాలో నాకు తెలుసు. నా దేహం పట్ల నాకు తగినంత శ్రద్ధ ఉంది. నేనేమి తినాలో, ఎలా తినాలో మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. రుచికరమైన ఇటాలియన్ ఫుడ్‌ని ఇష్టంగా తింటాను. ఎంతసేపు నిద్రపోవాలనిపిస్తే అంత సమయం నిద్రపోతాను. అయితే ఆహారం ఎక్కువ మోతాదు తీసుకోను. మితంగా తింటాను. గుడ్లు, బ్రెడ్, జామ్, టీ ఇష్టం. కాఫీ ఇష్టంలేదు. అసలే తాగను. టీవీ చూడడం, కాలనీలో పిల్లలు ఆడుకుంటూ ఉంటే చూడడం ఇష్టం. నా మేనల్లుడు, పొరుగింటి వారి మధ్య 112వ పుట్టినరోజు జరుపుకున్నాను" అన్నారామె న్యూయార్క్ మీడియాతో మాట్లాడుతూ.

వందేళ్లుగా... సింగిల్‌గా!

తల్లిదండ్రుల సంరక్షణ నుంచి బయటకు వచ్చి సొంతంగా తనను తాను పోషించుకోవడం మొదలు పెట్టినప్పటి నుంచి ఆమె జీవితంలో వందేళ్లపాటు ఒంటరిగానే జీవించారు. పెళ్లి, పిల్లలు లేకపోవడం వల్లనే ఆమె ఇన్నేళ్లపాటు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలిగారని చమత్కారంగా అన్నప్పటికీ అందులో వాస్తవం ఉందంటున్నారు ఆరోగ్య, మానసిక నిపుణులు. ఇదే మాట ఆమెతో అంటే... 'ఎప్పుడైతే పెళ్లి చేసుకుంటారో అప్పుడే సమస్యల్లో పడతారు' అంటారు నవ్వుతూ.

చదువు



గ్రామస్థుల ఊరేగింపులో అభిలాష

ఒకప్పుడు ఆ ఊరి పేరు వినబడగానే 'వామ్మో' అనుకునేవారు. దొంగతనాలు, అక్రమ మద్యం వ్యాపారానికి పేరు మోసిన రాజస్థాన్‌లోని నయాబస్ గ్రామం ఇప్పుడు పూర్తిగా మారిపోయి ఆదర్శ గ్రామం అయింది. అమ్మాయిల చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి కారణం ఈ గ్రామానికి చెందిన మహిళలు ఐపీఎస్ నుంచి జడ్జీ వరకు ఉన్నత ఉద్యోగాలు ఎన్నో చేయడం. జడ్జీగా ఎంపికైన అభిలాష జెఫ్ విజయాన్ని ఊరు ఊరంతా సెలబ్రేట్ చేసుకుంది. ఇప్పుడు ఎంతో మంది అమ్మాయిలకు అభిలాష రోల్ మోడల్...

ఆ ఊరి పేరు ఐఏఎస్ ఫ్యాక్టరీ

స్త్రీ విద్యతో ఆ ఊరి పేరే మారింది!

ఒక ఇంట్లో పెద్ద ఉద్యోగం వస్తే... ఆ సంతోషం ఆ ఇంటికి మాత్రమే పరిమితమైపోతుంది. కానీ అభిలాష జెఫ్ విషయంలో మాత్రం అలా జరగలేదు. ఆమె జడ్జీగా ఎంపికైన సందర్భం ఊరంతటికీ పండగ అయింది. అభిలాషను వీధుల్లో ఊరేగిస్తూ డీజే, డ్యాన్స్‌లతో ఆమె విజయాన్ని గ్రామస్థులు సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ ఊరేగింపులో సంప్రదాయ రాజస్థానీ దుస్తులు ధరించిన మహిళలు ఎక్కువగా ఉన్నారు.

ఈ ఊరేగింపులో పాల్గొన్న సరితా మీనా ఇలా అంటుంది... 'మా అమ్మాయిని పెద్ద చదువులు చదివిస్తాను. ఏదో ఒకరోజు మా అమ్మాయి అభిలాషలాగే పెద్ద ఉద్యోగం చేస్తుంది' సరితా మీనాలాగే కలలు కన్న తల్లులు, ఎన్ని కష్టాలు వచ్చినా తమ కూతుళ్లను పెద్ద చదువులు చదివిస్తామని ప్రతిజ్ఞ చేసిన తల్లులు ఆ ఊరేగింపులో ఎంతోమంది ఉన్నారు. రాజస్థాన్‌లోని నీమ్ కా థాణా జిల్లాలోని నయాబస్ గ్రామంలోని యువతులకు ఆ సంతోషకరమైన రోజు ఒక మలుపు.

'అభిలాషలాంటి అమ్మాయిల వల్ల ఊరికి జరిగిన మేలు ఏమిటంటే ప్రతి ఒక్కరూ తమ కూతుళ్లను పెద్ద చదువులు చదివించాలనుకుంటారు. పది చాలు, పై చదువులు ఎందుకు అనే ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది' అంటుంది కర్ణిక అనే గృహిణి.

> చదువు అనేది వజ్రాయుధం, తిరుగులేని మహా ఉద్యమం అని మరోసారి నయాబస్ గ్రామం విషయంలో నిరూపణ అయింది. ఇల్లే ప్రపంచంగా మారిన ఎంతోమంది అమ్మాయిలు చదువుల తల్లి దయ వల్ల ప్రపంచాన్ని చూస్తున్నారు. ఉన్నత ఉద్యోగాల్లో వెలిగిపోతున్నారు.

అభిలాషకు ముందు అల్కా మీనాను కూడా ఇలాగే ఊరేగించారు. ఈ గ్రామానికి చెందిన అల్కా మీనా ఐపీఎస్ పంజాబ్‌లో డిఐజీగా విధులు నిర్వహిస్తోంది. అల్కా మీనా నుంచి అభిలాష వరకు ఎంతోమంది మహిళలు ఎన్నో అడ్డంకులను అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. విశేషం ఏమిటంటే నయాబస్‌ను ఇప్పుడు 'ఐఏఎస్ ఫ్యాక్టరీ' అని కూడా పిలుస్తున్నారు. ఈ ఊరి నుంచి ఐఏఎస్‌లాంటి ఉన్నత సర్వీసులకు ఎంపికైన వారు కూడా ఉన్నారు.

ఇప్పుడు గ్రామంలో ఎటు చూసినా అల్కా మీనా, అభిలాష లాంటి విజేతల పోస్టర్‌లు కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. కోచింగ్ సెంటర్‌ల వారు అంటించిన ఈ పోస్టర్‌లలో 'ఇలాంటి విజేతలు మీ ఇంట్లో కూడా ఉన్నారు' అని ఉంటుంది.

ఈ గ్రామంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు వారి ప్రపంచంలో మాత్రమే ఉండిపోకుండా ఎప్పుడూ ఊరితో టచ్‌లో ఉంటారు. ముఖ్యంగా అమ్మాయిల చదువుకు సంబంధించి చొరవ తీసుకుంటారు. ఒకప్పుడు ఈ ఊళ్లో ఒకే స్కూల్ ఉండేది. అమ్మాయిల సంఖ్య అంతంత మాత్రమే. ఇప్పుడు మాత్రం 'బాలికల పాఠశాల'తో కలిసి మూడు స్కూల్స్ ఉన్నాయి.

చదువు వల్ల నయాబస్ ఆదర్శగ్రామం కావడం ఒక కోణం అయితే, స్త్రీ సాధికారత మరో కోణం. చదువు వల్ల అమ్మాయిలు తమ హక్కుల గురించి తెలుసుకోవడం నుంచి ఆర్థిక భద్రత, ఉన్నత ఉద్యోగం వరకు ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పర్చుకుంటున్నారు. తమ కలలను నిజం చేసుకుంటున్నారు.



ఆటల్లోనూ...



ఉన్నత చదువు, ఉద్యోగాలలోనే కాదు ఆటల్లో రాణిస్తున్న వారు కూడా నయాబస్‌లో ఎంతోమంది ఉన్నారు. దీనికి ఉదాహరణ... సలోని మీనా. గత ఏడాది ఇండో-నేపాల్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఇరవై ఏళ్ల మీనా మూడోసారి స్వర్ణం గెలుచుకొని ఊళ్లో సంబరం నింపింది. రాబోయే ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ఆడాలనేది తన లక్ష్యం అని చెబుతుంది మీనా. భవిష్యత్‌కు సంబంధించి సలోని మీనాకు భారీ ప్రణాళికలు ఉన్నాయి. ఊరు అండ ఉంది. ఇంకేం కావాలి!

హాట్ డిబేట్



పెళ్లయిన అమ్మాయిలు కాలేజీ విద్యకు అనర్హులా?!

'పెళ్లయిందా? అయితే నువ్వు చదువుకు అర్హురాలివి కాదు' అనే డైలాగ్ వన్స్ అపాన్ ఏ టైమ్ కామన్ కావచ్చు. ఆ డైలాగ్‌ను ఈ జమానాలో ఊహించలేము. అయితే ఉత్తరాఖండ్‌లోని ఒక కాలేజీ పుణ్యమా అని ఈ కాలంలోనూ ఆ పాత డైలాగ్ వినాల్సి వచ్చింది. అల్మోరా (ఉత్తరాఖండ్)లో 19 సంవత్సరాల సిమ్రాన్ పెళ్లయిన తరువాత కాలేజీలోకి అడుగు పెట్టింది. 'పెళ్లయిన వారు క్లాస్ రూమ్‌లోకి అడుగుపెట్టడానికి వీలులేదు. రూల్స్ ఒప్పుకోవు' అన్నారు కాలేజీ వాళ్లు. కాలేజీ వారి వింత వైఖరిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అల్మోరాలోని ఆనంద్ సింగ్ గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజీ ఇప్పుడు చర్చోపచర్చలకు కేంద్రబిందువు అయింది. 'పెళ్లయివారు కాలేజీలో అడుగు పెట్టవద్దు అంటున్నారు. ఎందుకో తెలుసుకోవచ్చా?' అని అడిగితే కాలేజీ మహాశయులు చెప్పిన జవాబు...

'వివాహిత మహిళలు క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెడితే స్కూల్ వాతావరణం దెబ్బతింటుంది'

'అదెలాగో చెప్పండి మహాశయా' అని సోషల్ మీడియా వేదికగా చాలామంది ప్రశ్నిస్తున్నారు.

మనం శాస్త్ర,సాంకేతిక రంగాల్లో ఎంత ముందుకు వెళుతున్నా... వెనక్కి లాగే ప్రయత్నం చేసేవారు ఉంటారు అని చెప్పడానికి ఆల్మోరా కాలేజీ వారి అజ్ఞాన, అహంకారాలే పెద్ద సాక్ష్యం అని విమర్శిస్తున్నారు.

నియజ్ గంజ్‌కు చెందిన సిమ్రాన్ ఆనంద్ సింగ్ స్కూల్ అండ్ కాలేజీలో ఎనిమిదవ తరగతి నుంచి చదువుతోంది. క్లాసులకు హాజరు కావడానికి తమ కుమార్తెకు అనుమతి ఇవ్వాల్సిందిగా సిమ్రాన్ తల్లిదండ్రులు అదేపనిగా బతిమిలాడుతున్నప్పటికీ కాలేజీ వారు ససేమిరా అంటున్నారు.

ఈ సంఘటన గురించి మీడియా ప్రతినిధులు ప్రిన్సిపల్ విజయ పంత్‌ను వివరణ అడిగితే వారు ఇలా సెలవిచ్చారు...

'మా కాలేజీలో పెళ్లయిన స్టూడెంట్ క్లాసులకు హాజరు కావడం ఇదే మొదటిసారి. దీనికి స్కూల్ నిబంధనలు ఒప్పుకోవు. వివాహిత స్టూడెంట్స్ క్లాసులోకి వస్తే అది ఇతర విద్యార్థులపై ప్రభావం చూపుతుంది. అయినప్పటికీ ఉన్నతాధికారులు అంగీకరిస్తే క్లాసుకు హాజరు కావడానికి అనుమతిస్తాం అని సిమ్రాన్‌తో చెప్పాం'

అల్మోరా చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు సిమ్రాన్ బాధతో లేఖ రాసింది. ఆ లేఖలో...

'ఒకవైపు బేటీ బచావో, బేటీ పడావో స్కీమ్‌లు ఉన్నాయి. మరోవైపు నాలాంటి వారిని క్లాసురూమ్‌లోకి అడుగుపెట్టనివ్వడం లేదు. ఒకదానికొకటి పూర్తి విరుద్ధంగా ఉంది' అని రాసింది.

చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాత్రం 'పెళ్లయిన అమ్మాయిలు క్లాసులకు హాజరు కావడానికి అనర్హులు... లాంటి నిబంధనలేవీ లేవు' అంటున్నారు.

ఏది ఏమైనా ఈ వివాదాలు సమసి, సిమ్రాన్ త్వరలోనే క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టాలని ఆశిద్దాం.

యోగం

వెన్నునొప్పి నివారణకు


మానసిక ప్రశాంతతను, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆసనం చర్మం నిగనిగలకూ ఉపయోగపడుతుంది. రక్తప్రసరణను మెరుగు పరిచి శరీరం అంతా చురుకుగా మార్చేసే శక్తి పర్వతాసనానికి ఉంటుంది. ఈ యోగ భంగిమ పర్వతాన్ని పోలి ఉంటుంది కాబట్టి, దీనికా పేరు. పిరమిడ్ ఆసనం గానూ దీనిని పేర్కొంటారు.

వెన్నెముక సాగదీయడం కోసం అంటే గంటల సమయం కూర్చొని పనిచేసేవారు ముఖ్యంగా కంప్యూటర్ ఉద్యోగులకు ఈ ఆసనం వల్ల అనుకూలంగా ఉంటుంది. వెన్ను, భుజాలు, మెడలో నొప్పిని అనుభవించేవారు ఈ ఆసనాన్ని వేయవచ్చు. అలాగే, కడుపు ఉబ్బరం, అజీర్తి, శ్వాస సమస్యలు ఎదుర్కొనేవారు ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

ముందుగా ఇలా సిద్ధం చేయాలి... ఈ ఆసనం వేయడానికి ముందు కాళ్లు, చేతులు, నడుం భాగాన్ని స్ట్రెచ్ చేస్తూ కదలికలు చేయాలి. మూడు నాలుగు సార్లు ఇలా చేయడం వల్ల శరీరం అంతా వ్యాయామానికి సిద్ధం అన్నట్టుగా ఉంటుంది.

ఇలా చేయాలి... మ్యాట్ మీద బోర్లా పడుకొని, కాళ్లను, చేతి వేళ్లను భూమికి నొక్కిపడుతున్నట్టుగా ఉంచి, పిరుదుల భాగం పైకి ఎత్తాలి. ఈ భంగిమలోనే శరీరాన్ని సాగదీస్తున్నట్టుగా ఉంచి, ఐదు శ్వాసలు తీసుకొని, వదిలి తిరిగి యథాస్థానంలోకి రావాలి. ఇలా 5–6 సార్లు చేయాలి.

పనితీరులో మెరుగు... ఈ ఆసనం పొత్తికడుపు కండరాలను ఫిట్‌గా ఉంచుతుంది. వెన్నెముక కండరాలను బలోపేతం చేయడానికి, రక్తప్రసరణ, పనితీరును మెరుగుపరచడంలో ఈ ఆసనం సహాయపడుతుంది.



చర్మం నిగారింపు
అలసటను తొలగిస్తుంది. చర్మం ఫిట్‌గా, నిగారింపుతో ఉంటుంది. జుట్టు ఆరోగ్యం బాగవుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగువరుస్తుంది.



- జి.అనూషా రాకేష్,
యోగా ట్రైనర్

హెల్త్ టిప్

గుండెజబ్బులు రాకుండా...



గుండెజబ్బుల నివారణకు డాక్టర్లు, ఆహార నిపుణులు చేస్తున్న కొన్ని సూచనలు...

- బీపీ 120 / 80 దాటకూడదు.
- మొత్తం కొలెస్ట్రాల్ 150 కంటే తక్కువగా ఉండాలి.
- ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) 100 కంటే తక్కువగా ఉండాలి.
- హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) 40 కంటే ఎక్కువగా ఉండాలి.
- బీఎమ్ఐ (బాడీ మాస్ ఇండెక్స్) 23 కంటే తక్కువగా ఉండాలి.
- డయాబెటిస్ ఎప్పుడూ పూర్తి నియంత్రణలో ఉండాలి.
- పొగ, మద్యం అలవాట్లు పూర్తిగా వదిలేయాలి.
- రోజూ 30 – 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- కూరగాయలు, ఆకుకూరలు, తాజాపండ్లతో సమతులాహారం తీసుకోవాలి.
- ఆహారాన్ని తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు తీసుకోవాలి.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50 సంపుటి: 17; సంచిక: 140
శనివారం 10-8-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



సిసోడియాకు బెయిల్

లిక్కర్ కేసులో విచారణ ఖైదీగా ఉన్న ఆప్ నేత మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టులో బెయిల్ దొరికింది.

వివరాలు 6లో ▸



చినికి చినికి గాలివానగా..

సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ పేరు విషయమై రాజ్యసభలో రాజుకున్న రగడ నాటకీయ మలుపులు తిరిగి రాజకీయ దుమారంగా మారింది.

వివరాలు 6లో ▸



అమన్ కంచు పట్టు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఆరో పతకం లభించింది. రెజ్లింగ్ పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్య పతకం సాధించాడు. శుక్రవారం జరిగిన కాంస్య పతక బౌట్‌లో అమన్ 13–5 పాయింట్ల తేడాతో డారియన్ క్రూజ్ (ప్యూర్టోరికో)పై గెలు పొందాడు. ఈ క్రమంలో భారత్ తరపున ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన పిన్న వయస్కుడిగా అమన్ (21 ఏళ్ల 24 రోజులు) గుర్తింపు పొందాడు. గతంలో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు (21 ఏళ్ల 44 రోజులు) పేరిట ఈ రికార్డు ఉంది.

16 లో



'ఫ్యూచర్ స్టేట్'గా తెలంగాణ

నినాదాన్ని ఖరారు చేస్తున్నామన్న సీఎం

'ఏఐ యూనికార్న్' కంపెనీల సీఈఓలతో భేటీ

'ఆమ్‌జెన్' రీసెర్చ్ సెంటర్‌తో 3 వేల ఉద్యోగాలు

'ఆరమ్ ఈక్విటీ' రూ. 3,350 కోట్ల పెట్టుబడి

'ఐటీ సర్వ్ అలయెన్స్' సమావేశంలో పాల్గొన్న రేవంత్, శ్రీధర్‌బాబు

- వివరాలు 14లో



సాగు ఢమాల్

రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం | గతేడాది ఇదే సమయానికి దాదాపు కోటి ఎకరాల్లో పంటలు

- ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 84.59 లక్షల ఎకరాలకే పరిమితం
- 15.30 లక్షల ఎకరాల మేర తగ్గిన సాగు
- ఈ వానాకాలంలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా.. కానీ ఇప్పటి వరకు 25.58 లక్షల ఎకరాల్లోనే నాట్లు
- పత్తిదీ అదే దారి.. 2.67 లక్షల ఎకరాలు తగ్గిన వైనం
- రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు లేకపోవడం.. చెరువులు నిండకపోవడమే కారణం!
- రైతుభరోసా ఇవ్వకపోవడం, రుణమాఫీకి ముందు పంట రుణాలు ఇవ్వకపోవడం ప్రభావం చూపిందంటున్న రైతు సంఘాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం పంటల సాగు గణనీయంగా పడిపోయింది. రాష్ట్రమంతా వర్షాలు పూర్తి స్థాయిలో పడకపోవడం, చెరువులు, కుంటలు నిండకపోవడం, ఇటీవలి కాలం వరకు జలాశయాల్లో తగినంత నీరు లేకపోవడం..తదితర కారణాలతో పంటల సాగు విస్తీర్ణం భారీగా పడిపోయిందని వ్యవసాయశాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత ఏడాది వానాకాలంలో ఇదే సమయానికి సాగైన పంటలతో పోలిస్తే, ఈసారి ఏకంగా 15.30 లక్షల ఎకరాల మేరకు సాగు తగ్గిపోయింది. ఈ వానాకాలం సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగు జరుగుతుందని పంటల ప్రణాళికలో వ్యవసాయశాఖ అంచనా వేసింది. అత్యధికంగా 66 లక్షల ఎకరాల్లో వరి, 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని పేర్కొంది. కానీ ఆశించిన స్థాయిలో సాగు జరగక పోవడం ఆందోళన కలిగిస్తోంది. రైతుభరోసా కింద

మిగతా 2వ పేజీలో ▶

15,131 చెరువులు ఖాళీ

రాష్ట్రంలో 34,716 చెరువులు, కుంటలున్నాయి. అందులో 3,247 చెరువులు ఇటీవలి వర్షాలతో అలుగు పోస్తున్నాయి. 6,735 చెరువులు నిండుగా నీటితో కళకళలాడుతున్నాయి. 3,438 చెరువుల్లో 50 నుంచి 75% నీటి నిల్వలున్నాయి. 6,165 చెరువుల్లో మాత్రం 25 నుంచి 50% మాత్రమే నీరు చేరింది. 15,131 చెరువుల్లో నీటి నిల్వలు ఇంకా 25% లోపలే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 61.34 శాతం చెరువుల్లో 50% కంటే తక్కువగానే నీటినిల్వలున్నాయి.



'మత్తు' చిత్తుకు ద్విముఖ వ్యూహం

డ్రగ్స్, గంజాయి సప్లై చైన్ కట్టడి..

యువతలో అవగాహనకు చర్యలు..

గత నెల రోజులుగా పదవీబాధ్యతలు ఎంతో సంతృప్తినిచ్చాయి

'సాక్షి ' ప్రత్యేక ఇంటర్వ్యూలో డీజీపీ జితేందర్

- వివరాలు 11లో

ప్రాణాలు తీస్తున్న వీధికుక్కలు

- రోజురోజుకు చిన్నారులపై పెరిగిపోతున్న దాడి ఘటనలు.. ఇబ్రహీంపట్నంలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి కన్నుమూత
- నార్సింగి పరిధిలో దివ్యాంగ బాలుడిపై వీధి కుక్క దాడి.. వరంగల్ ఎంజీఎంలో శిశువు మృతదేహాన్ని పీక్కుతిన్న శునకం



11 లో

క్లుప్తంగా...


సుప్రీంకోర్టులో కవిత బెయిల్ పిటిషన్

సోమవారం విచారించనున్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కుంభకోణంలో ఆరోపణలపై అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత తరఫు న్యాయ వాది మోహిత్‌రావు గురువారం క్రిమినల్ ఎస్ఎల్‌పీ దాఖలు చేయగా శుక్రవారం రిజిస్ట్రీ వెరిఫై చేసింది. అనంతరం సోమవారం కేసుల విచారణ జాబితాలో చేర్చింది. ఈడీ, సీబీఐ కేసుల్లోనూ బెయిల్ కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందుకు కవిత పిటిషన్ రానుంది.

తెలంగాణకు 300 ఎలక్ట్రిక్ బస్సులు



భూపతి రాజు

సాక్షి, న్యూఢిల్లీ: ఫేమ్ ఇండియా పథకం రెండో దశలో భాగంగా తెలంగాణకు 300 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేశామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తెలిపారు. 2019 నుంచి ఈ ఏడాది ఆగస్టు 6 వరకు తెలంగాణకు ఒక్క ఎలక్ట్రిక్ బస్సును కూడా ఇవ్వలేదని శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఫేమ్ రెండో దశలో దేశ వ్యాప్తంగా మొత్తం 6,862 ఎలక్ట్రిక్ బస్సులను వివిధ రాష్ట్రాలకు అందించాల్సి ఉండగా, 4,901 బస్సులను అందించామన్నారు.

గుమ్మడికాయ దొంగ మాదిరే కేటీఆర్ తీరు

మంత్రి కొండా సురేఖ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా మాజీ మంత్రి కేటీ రామారావు తీరుందని మంత్రి కొండా సురేఖ ఎద్దేవా చేశారు. గతంలో కేటీఆర్ అమెరికా పర్యటన ఎందుకు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో పెట్టుబడులు అంటూ వివిధ కంపెనీలతో చేసుకున్న ఎంవోయూలన్నీ కూడా బోగస్సేనని ఆరోపించారు. శుక్రవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా లక్షల కోట్లు దోచుకుందని, కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, మిషన్ భగీరథ అన్నీ కుంభ కోణాలేనని ఆమె ఆరోపించారు. రాష్ట్రం బాగుపడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన సాగుతోందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు పనిగట్టుకుని రేవంత్ తమ్ముడిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ నేతలవి బోగస్ మాటలు

టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌లోని బావా బామ్మర్దులు బోగస్ మాటలు చెప్పి ప్రజలను నమ్మించాలని చూస్తున్నారని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి బృందం అమెరికాలో పర్యటిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ మాత్రం కోడి గుడ్డు మీద ఈకలు పీకి నట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసలు పుట్టని కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకుని వందల కోట్ల రూపాయల పెట్టు బడులు వచ్చాయని, వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పింది ఎవ రని ఆయన ప్రశ్నించారు.

ఇదండీ బాట



గొట్టిముక్కల ఎగువన రెండు జలాశయాలు

గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా నిర్మించండి

- ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో తెలంగాణ విజ్ఞప్తి
- సమ్మక్కసాగర్ నుంచే నీటి తరలింపు.. ముంపుపై ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించాలి
- రాష్ట్రం వాటా 50 శాతానికి పెంచాలి.. రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునే చాన్స్ ఇవ్వాలని స్పష్టీకరణ
- వాటా పెంపు మినహా మిగతా అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ఎన్‌డబ్ల్యూడీఏ



సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా గొట్టిముక్కలకు ఎగువన లోయ తరహాలో ఉన్న ప్రాంతాల్లో రెండు జలాశయాలను నిర్మించాలని జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)ను తెలంగాణ కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా తరలించే 148 టీఎంసీల్లో తెలంగాణకు 45 టీఎంసీలను కేటాయించారని.. కానీ ఆ నీటితో ప్రతిపాదించిన 5.30 లక్షల ఎకరాల ఆయకట్టులో ఇప్పటికే 3 లక్షల ఎకరాలకు ఎస్సారెస్పీ–2 ద్వారా నీళ్లు అందుతున్నాయని వివరించింది. అందువల్ల ఈ 45 టీఎంసీల నీటిని స్థానిక అవసరాల ఆధారంగా రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునేలా వీలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ 45 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి రెండు జలాశయాలను నిర్మించాలని కోరింది. గోదావరి–కావేరి అనుసంధానంపై శుక్రవారం జలసౌధలో తెలంగాణతో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం నిర్వహించింది. ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్, సీఈ దేవేందర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, రాష్ట్రం తరఫున నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) అనిల్‌కుమార్ పాల్గొన్నారు. భేటీలో రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. అనుసంధానం ప్రాజెక్టుపై రాష్ట్రానికి ఉన్న అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాలకు సాగునీటి సరఫరా కోసం 250 టీఎంసీలు అవసరమని చెప్పారు. అందువల్ల ప్రాజెక్టు ద్వారా తరలించే నీటిలో 50 శాతాన్ని తెలంగాణకు కేటాయించాలని కోరారు.

రాష్ట్రం చేసిన విజ్ఞప్తులు, డిమాండ్లు ఇవీ..

- నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా నీటి తరలింపు కోసం ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని మా అధ్యయనంలో తేలింది. సమ్మక్క బరాజ్ నుంచే నీళ్లను తరలించాలి. రాష్ట్ర అవసరాల కోసం సమ్మక్క బరాజ్‌లో 83 మీటర్ల వరకు నిల్వలను సంరక్షిస్తూ ఆపై నిల్వలను మాత్రమే తరలించాలి. తెలంగాణకు సీతమ్మసాగర్ ప్రాజెక్టు కింద 70 టీఎంసీలు, సమ్మక్క ప్రాజెక్టు కింద 50 టీఎంసీలు, దేవాదుల కింద 38 టీఎంసీలు కలిపి మొత్తం 158 టీఎంసీల అవసరాలు ఉన్నాయి. వాటిని సంరక్షించాలి. సీతమ్మ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తికి అవసరమైన కనీస నిల్వలను కాపాడాలి.
- సమ్మక్క బరాజ్‌లో 87 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేస్తే ఛత్తీస్‌గఢ్‌లో జరిగే ముంపు విషయంలో ఆ రాష్ట్రాన్ని ఒప్పించే బాధ్యతను ఎన్‌డబ్ల్యూడీఏ తీసుకోవాలి. ఛత్తీస్‌గఢ్ వాడుకోకపోవడంతో మిగిలే 148 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలించనున్న నేపథ్యంలో.. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించి నిరభ్యంతర పత్రం తీసుకోవాలి. ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై ఆ తర్వాతే సంతకాలు చేస్తాం.
- అనుసంధానం ప్రాజెక్టులో కాల్వలు, సొరంగాల కోసం సేకరించాల్సిన భూముల్లో రెండు పంటలు పండే ఆయకట్టు భూములున్నాయి. రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రం నిర్మించనున్న కాల్వల వ్యవస్థనే అనుసంధానం ప్రాజెక్టు అవసరాలకూ వాడుకోవాలి.
- అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నీటిని నాగార్జునసాగర్‌కు ఎత్తిపోసి.. అక్కడి నుంచి కావేరికి తరలించాలని ప్రతిపాదించారు. అయితే కీలకమైన కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు వచ్చే వరకు సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకోరాదు. సాగర్ నిర్వహణ ప్రొటోకాల్‌తోపాటు ఏపీ, తెలంగాణలకు నీటి కేటాయింపులపై స్పష్టత వచ్చాకే ఈ విషయంలో ముందుకు వెళ్లాలి.

50 శాతం వాటా మినహా మిగతావి ఓకే: ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్ సింగ్

అనుసంధానం ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో తెలంగాణకు 50 శాతం కేటాయించాలనే డిమాండ్ విషయంలో పట్టువీడాలని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్ సింగ్ కోరారు. రెండు కొత్త జలాశయాల నిర్మాణం, సమ్మక్క బరాజ్ నుంచే నీటి తరలింపు, ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి తీసుకోవడం తదితర అంశాలన్నింటి పట్ల సానుకూలంగా ఉన్నామని తెలిపారు. తదుపరి చర్చల్లో ఈ అంశాలపై మరింత పురోగతి సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పెద్ద మనసుతో ముందుకొచ్చి ఎంఓయూ చేసుకోవాలని కోరారు.

గౌరవెల్లి కాల్వల పనులకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు–ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ (ఐఎఫ్ఎఫ్‌సీ) ప్రాజెక్టులోని ప్యాకేజీ–7లో భాగంగా గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీళ్లను తరలించే కాల్వల నిర్మాణం కోసం రూ.431.30 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. హుస్నాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధిలోని 1,06,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ఈ పనులు చేపట్టనున్నారు. భూసేకరణలో పురోగతితో సంబంధం లేకుండా మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది.

సాగు ఢమాల్

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం, రుణమాఫీకి ముందు పంట రుణాలు ఇవ్వకపోవడం వంటి కారణాలు కూడా సాగు తగ్గడానికి కారణాలుగా రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే కొందరు రైతులు భూముల్ని కౌలుకు ఇవ్వకుండా వదిలేశారన్న చర్చ కూడా జరుగుతోంది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం చేస్తే, తమకు రైతు భరోసా రాదని కొందరు రైతులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

8.79 లక్షల ఎకరాల మేర తగ్గిన వరి

గతేడాది వానాకాలం సీజన్ ఇదే సమయానికి అన్ని పంటలు కలిపి 99.89 లక్షల (దాదాపు కోటి) ఎకరాల్లో సాగయ్యాయి. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 84.59 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే సాగు విస్తీర్ణం ఏకంగా 15.30 లక్షల ఎకరాల్లో విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వరి, పత్తి సాగు గణనీయంగా పడిపోయింది. గతేడాది వానాకాలంలో ఇదే సమయానికి 34.37 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 25.58 లక్షల ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. అంటే గతేడాదితో పోలిస్తే 8.79 లక్షల ఎకరాలు తగ్గింది. దీనిని బట్టి చూస్తే పంటల ప్రణాళిక ప్రకారం ఈ సీజన్‌లో 66 లక్షల ఎకరాల్లో సాగు సాధ్యమయ్యేలా కన్పించడం లేదు. వరికి రూ.500 బోనస్ కేవలం సన్నాలకే ఇస్తామని ప్రభుత్వం చెప్పడం, ఆ వరి రకాల పేర్లను మొన్న మొన్నటి వరకు బహిరంగపరచకపోవడం తదితర కారణాలు ఏమైనా రైతులను గందరగోళపరిచాయా అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

పత్తి సాగూ తగ్గింది..

పత్తి విషయానికొస్తే.. గతేడాది ఇదే సమయానికి 44.32 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈసారి కేవలం 41.65 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే 2.67 లక్షల ఎకరాల మేర విస్తీర్ణం తగ్గిందన్న మాట. వాస్తవానికి పత్తి సాగును 60 లక్షల ఎకరాలకు పెంచాలని, వీలైతే 70 లక్షల ఎకరాలకు పెంచినా మంచిదేనన్న అభిప్రాయంతో వ్యవసాయ శాఖ ఉంది. ఆ మేరకు ప్రణాళికలు వేసుకుంది. కానీ కీలకమైన సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంలో విఫలమైంది. అనేకమంది రైతులు విత్తనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక గతేడాదితో పోలిస్తే మొక్కజొన్న సాగు 93,635 ఎకరాల్లో, కంది 35,176 ఎకరాల్లో, సోయాబీన్ 72,744 ఎకరాల్లో తగ్గింది.

వనపర్తి జిల్లాలో 20.59 శాతమే సాగు

రాష్ట్రంలో అత్యంత తక్కువగా వనపర్తి జిల్లాలో 20.59 శాతమే పంటలు సాగయ్యాయి. సూర్యాపేట జిల్లాలో 32.02 శాతం, ములుగు జిల్లాలో 32.57 శాతం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 41.67 శాతం, రంగారెడ్డి జిల్లాలో 44.89 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయని వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో అత్యంత ఎక్కువగా పంటల సాగు నమోదు కావడం గమనార్హం. ఆ జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5,62,098 ఎకరాలు కాగా, 5,63,481 ఎకరాల్లో సాగైంది.

జిల్లాల వారీగా వరి, పత్తి సాగు ఇలా..

రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వరి నాట్లు ఊపందుకోలేదు. నల్లగొండ జిల్లాలో గతేడాది ఇదే సమయానికి 2.54 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా, ఇప్పుడు కేవలం 79,085 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. సూర్యాపేట జిల్లాలో గతేడాది ఇదే సమయానికి 1.87 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా, 97,087 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో గతేడాది 2.21 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా, ఇప్పుడు కేవలం 1.50 లక్షల ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. మెదక్ జిల్లాలో గతేడాది 2.49 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా, ఇప్పుడు కేవలం 1.22 లక్షల ఎకరాల్లోనే పడ్డాయి. కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగాం, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో నాట్లు గణనీయంగా తగ్గాయి. ఇక పత్తి నల్లగొండ జిల్లాలో గతేడాది ఇదే సమయానికి 5.86 లక్షల ఎకరాల్లో సాగైతే, ఈ ఏడాది ఇప్పటివరకు 5.22 లక్షల ఎకరాలకే పరిమితమైంది.

వర్షాల కోసం చూస్తున్నా..



నాకు నాలుగున్నర ఎకరాల సొంత పొలం ఉంది. ఏటా మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుంటా. నాలుగున్నర ఎకరాల్లో మెట్ట పంటలు వేసి మిగతా 20 ఎకరాల్లో వరి సాగు చేస్తా. అయితే ముసురు వర్షాల కారణంగా ఇప్పటివరకు మూడెకరాల్లోనే వరి నాట్లు వేశా. మిగిలిన 17 ఎకరాల సాగుపై ఎటూ తోచడం లేదు. ప్రస్తుతానికైతే మరో పదెకరాల వరకు నారుమడి సిద్ధం చేసుకున్నా. కానీ ఇదే పరిస్థితి ఆగస్టు నెలాఖరు వరకు ఉంటే వేసిన మూడెకరాల వరి కూడా పండదు. అందుకే భారీ వర్షాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం.

– మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా

బ్రిటిష్ పాలన తరహాలో బీజేపీ పాలన: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: బ్రిటిష్ పాలకుల తరహాలోనే బీజేపీ దేశాన్ని పాలిస్తోందని, కులం, మతం, వర్గాల వారీగా దేశాన్ని విభజించేందుకు చిచ్చు పెడుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేది కాంగ్రెస్ పార్టీనేనని చెప్పారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గాంధీ కుటుంబం లేకుండా చేయాలని ప్రధాని మోదీ చూస్తే ప్రజలు రాహుల్‌గాంధీని ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాలో కూర్చోబెట్టారని తెలిపారు.

కులగణన చేపట్టండి లేదా కుర్చీలైనా దిగండి: జాజుల

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులగణనైనా చేపట్టండి లేదా కుర్చీలైనా దిగండి అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీసీల డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం చేపట్టిన ధర్నాకు జాజుల హాజరై మాట్లాడారు. బీజేపీ పదేళ్లుగా బీసీలను విస్మరించినందుకే సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక పోయిందన్నారు. కులగణన అంశంతో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్‌కు అనూహ్య రీతిలో మెజారిటీ సీట్లు వచ్చాయన్నారు. బీసీలను విస్మరిస్తే కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీసీ కులాల లెక్క లు సవరించి వారికి జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని పార్లమెంట్‌లో పోరాడుతున్నట్లు ఎంపీ మల్లు రవి తెలిపారు.

జలాశయాల్లో పూడికతీత

టీజీఎండీసీ ద్వారా టెండర్లు

- పూడికతీత పనులకు ప్రభుత్వం ఖర్చు చేయదు.. పైగా పన్నులు, జీఎస్టీ, రాయల్టీ, సెస్ రూపంలో ఆదాయం
- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో సూత్రప్రాయ నిర్ణయాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు తుమ్మల, జూపల్లి

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్, మహారాష్ట్రల తరహా రాష్ట్రంలోని జలాశయాల్లో పూడిక తొలగించనున్నారు. ఇందుకోసం భారీ యంత్రాలతో తవ్వకాలు (మెకానికల్ డ్రెడ్జింగ్) జరిపే పనులను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ విధానంలో పూడికతీతకు ప్రభుత్వం ఎలాంటి ఖర్చు చేయదు. పైగా ప్రభుత్వానికే ఆదాయం వస్తుంది. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలో టెండర్లు ఆహ్వానించి అత్యధిక ధర కోట్ చేసిన బిడ్డర్‌కు పూడికతీత పనులు అప్పగించే అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించింది. బిడ్డర్ పన్నులు, సెస్, జీఎస్టీ, రాయల్టీని పనులు దక్కించుకున్న వారు చెల్లించాల్సి ఉంటుంది. తవ్విన మట్టి, ఇసుకను బిడ్డర్ విక్రయించుకోవచ్చు. అయితే ఈ మోడల్ అమలుపై తుది నిర్ణయం తీసుకోలేదు. జలాశయాల్లో పూడిక తొలగింపుపై కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జాతీయ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి ఉత్తమ్ నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. అనేక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంది.

- రాష్ట్రంలో మొత్తం 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ జలాశయాలున్నాయి. సగానికి పైగా జలాశయాలు 25 ఏళ్లకు పైబడినవే కావడంతో భారీగా పూడిక పేరుకుపోయింది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టులపై అధ్యయనం జరపగా, పూడికతో అవి 35 టీఎంసీల (16శాతం) నిల్వ సామర్థ్యం కోల్పోయినట్టు తేలింది.
- పూడికతో ఏటా ప్రపంచవ్యాప్తంగా రిజర్వాయర్లు 0–5 శాతం వరకు నిల్వ సామర్థ్యాన్ని నష్టపోతున్నాయి.
- పీఎం కిసాన్ సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన కొత్త జలాశయం నిర్మించడానికి రూ.162 కోట్లు కావాలి.
- జలాశయాల్లో పూడిక పెరగడంతో నిల్వ సామర్థ్యాన్ని నష్టపోతున్నాయి. వాటి రక్షణపై ప్రభావం చూపడంతోపాటు ఆయకట్టుకు సాగునీరు, తాగునీటి సరఫరాలో లోటు ఏర్పడుతోంది. పర్యావరణ సమస్యలూ తలెత్తుతున్నాయి.
- జలాశయాలు, డ్యామ్‌లు, ఆనకట్టలు, బరాజ్‌లు, నదులు, కాల్వల్లో పూడికతీత పనులకు పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిన అవసరముండదు. కేంద్రం మినహాయింపు కల్పించింది. పూడికతీత ద్వారా వాటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలి.
- నీటిపారుదల, గనుల శాఖలు సమావేశమై ఒక నిర్ణయం తీసుకోవాలి. ఈనెల 14న సమగ్ర నివేదిక సమర్పించాలి. పూడికతీత చేపట్టిన రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలి.
- సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పూడికతీత జరగాలి. వాటి రక్షణ విషయంలో రాజీ పడరాదు.
- పూడికతీతలో సారవంతమైన మట్టిని వెలికితీస్తే రైతాంగానికి ఉచితంగా సరఫరా చేయాలి. రవాణా చార్జీలు రైతులే భరించాలి.
- పూడికతీతతో వెలికితీసే ఇసుకను ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి వాడాలి. మట్టిని ఎప్పటికప్పుడు ఇతర చోట్లకు తరలించాలి.

కవితకు బెయిల్ వస్తుందని ఆశిస్తున్నాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. న్యాయవాదులతో సంప్రదింపుల కోసమే ఢిల్లీకి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం విధానం కేసులో జైలులో ఉన్న ఎమ్మెల్సీ, తన సోదరి కవితకు కూడా కొద్ది వారాల్లో బెయిల్ వస్తుందని ఆశిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ లభించిన నేపథ్యంలో ఈ కేసులో ఇతరులకు కూడా బెయిల్ వచ్చే అవకాశాలున్నాయన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో కేటీఆర్ మాట్లాడుతూ, 'రాజకీయంగా కొట్లాడాల్సిన సందర్భంలో ఈ తరహా కేసులు తప్పవని అనుకుంటున్నాం. 11వేల మంది ఉండాల్సిన జైలులో 30 వేల మంది ఉన్నారు. జైలులో కవిత ఇబ్బందులు పడుతున్నారు. ఆమెతోపాటు మరో ఇద్దరు ఖైదీలు కూడా ఉన్నారు. కవిత 11 కిలోల మేర బరువు కోల్పోయింది. బీపీ వచ్చి రోజుకు రెండు మాత్రలు వేసుకుంటోంది'అని అన్నారు.

న్యాయవాదులతో సంప్రదింపుల కోసమే..: 'న్యాయవాదులతో సంప్రదింపుల కోసం ఢిల్లీ వెళితే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ బురద చల్లుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఢిల్లీలో మూడు కేసులపై సుప్రీంకోర్టులో కొట్లాడుతోంది. అందులో ఒకటి ఎమ్మెల్సీ కవితది కాగా మరొకటి పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించినది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్య నారాయణకు సంబంధించిన కేసు కూడా ఉంది'అని కేటీఆర్ అన్నారు. కాగా, 15 రోజులకు ముందు సోదరుడు ఏర్పాటు చేసిన కంపెనీతో ఒప్పందం చేసుకునేందుకు సీఎం రేవంత్ అమెరికాకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన విమర్శించారు.

భూముల కోసం బెదిరిస్తున్నారు

కేటీఆర్‌ను కలిసిన కొడంగల్ రైతులు

సాక్షి, హైదరాబాద్: ఫార్మా కంపెనీల కోసం భూములు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని కొడంగల్ నియోజకవర్గ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల రైతులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావును కలసి తాము పడు తున్న ఇబ్బందులను వివరించి అండగా నిలవాలని కోరారు. హకీంపేట్, పోలెపల్లి, లకచర్ల గ్రామంలో మూడు వేల ఎకరాల భూమిని రైతుల నుంచి లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలతో కాలుష్యం పెరుగుతుందని, తమకు ఈ ఫ్యాక్టరీలు వద్దని రైతులు చెబుతున్నా బెదిరింపులు ఆగడం లేదన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే తమ భూములను అప్పనంగా తమ వద్ద నుంచి లాక్కునేందుకు కుట్రలు జరుగుతున్నా యని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన తమకు జీవనాధారమైన భూమిని లాక్కుంటే తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై ఏఐసీసీ మార్గనిర్దేశం

వచ్చే వారం తెలంగాణ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతో ఖర్గే భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు పచ్చజెండా ఊపుతూ ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పు అమలు అంశంపై చర్చించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వచ్చే వారం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, ఆయా రాష్ట్రాల సీనియర్ దళిత నేతలతో భేటీ నిర్వహించనున్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా ముఖ్యనేతలకు ఏఐసీసీ సమాచారం పంపినట్లు తెలుస్తోంది. వాస్తవానికి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎస్సీ వర్గీకరణ అంశానికి మద్దతిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేయగా, అనంతరం హైదరాబాద్‌లోనే జరిగిన కాంగ్రెస్ ప్రచార సభల్లో పాల్గొన్న మల్లికార్జున ఖర్గే సైతం వర్గీకరణకు మద్దతుగా మాట్లాడారు. ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ సైతం వర్గీకరణకు మద్దతుగా ప్రకటనలు చేసింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు తెలంగాణ తరఫున వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను నియమించారు. వాదనల సమయంలో న్యాయవాదులతో చర్చలకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ఎమ్మెల్యేల బృందాన్ని ఢిల్లీకి సైతం పంపారు. ఈ నెల ఒకటిన సుప్రీం ధర్మాసనం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించిన అనంతరం దీనిపై అసెంబ్లీలో హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లకూ దీన్ని వర్తింప చేస్తామని, ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామన్నారు. అయితే కాంగ్రెస్ పాలిత మిగతా రాష్ట్రాల్లో సమస్యలు నెలకొన్న నేపథ్యంలో సుప్రీం తీర్పు అమలు అంశంపై ఆయా రాష్ట్రాల నేతలకు ఖర్గే మార్గనిర్దేశం చేయనున్నారు.

బాణం గురిపెట్టి.. బండి నడిపి

మంత్రి పొంగులేటి పర్యటన




బాణం గురిపెట్టిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: టెన్నిస్ ఆడి.. బాణం గురిపెట్టి.. కాస్త దూరం నడిచి.. మరికొంత దూరం ట్రాక్టర్ నడిపి.. ఇలా వినూత్నంగా సాగింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన. శుక్రవారం తన పర్యటనలో భాగంగా మంత్రి.. కలెక్టరేట్‌లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. చాతకొండ బీట్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మొక్కలు నాటారు. ఆ తర్వాత పాల్వంచలో మున్సిపల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ రూ.50 లక్షలతో తీర్చిదిద్దిన సింథటిక్ టెన్నిస్ కోర్టు లను ప్రారంభించారు. అక్కడ కాసేపు టెన్నిస్ ఆడి.. పక్కనే ఆర్చరీ శిక్షణ పొందుతున్న క్రీడాకారుల నుంచి బాణం తీసుకుని గురిపెట్టి పరిశీలించారు. ఇక జూలూరుపాడు మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ, ఏన్కూరు లింక్ కెనాల్ పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కొంత దూరం కాలి నడకన వెళ్లి.. తర్వాత ట్రాక్టర్‌ను నడిపారు.

రుణమాఫీ కాని రైతులతో ఉద్యమం

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



శంకరపట్నం (మానకొండూర్): రుణమాఫీ కాని రైతులతో కలసి కరీంనగర్ జిల్లానుంచే రైతు ఉద్య మం ప్రారంభిస్తామని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతు రచ్చబండ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి వద్ద రుణమాఫీ కాని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేస్తామని గతంలో వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్, తుక్కుగూడలో జరిగిన సభల్లో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రకటించారని, కానీ ఇప్పుడు 567 జీవో తీసుకువచ్చి రేషన్ కార్డు లింకుపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన రైతులకు రుణమాఫీ చేయకుండా ఆంక్షలతో మోసం చేశా రన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను గవర్నర్‌కు అందిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే వినోద్‌కు 'సికాస' హెచ్చరిక

బెల్లంపల్లి రూరల్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే తన పద్ధతులు మార్చుకుని ప్రజా సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సింగరేణి అధికారులు విద్యుత్ కనెక్షన్లను తొలగించి, నీటి సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు అల్లాడుతుండగా.. ఎమ్మెల్యే వినోద్ మాత్రం మంత్రి పదవి వేటలో సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి, రెవెన్యూ అధికారులు వెంటనే ప్రజలకు ఇళ్ల పట్టాలు, ఇంటి నంబర్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సింగరేణి కరెంటు తొలగిస్తే మంద మర్రి జీఎం మనోహర్, ఎమ్మెల్యే వినోద్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ప్రధాని మోదీతో మంద కృష్ణ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ భేటీ అయ్యారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మోదీని కలిసిన మందకృష్ణ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. దాదాపు అరగంటపాటు మోదీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాట ఇచ్చి ఆ మాట నిలబెట్టుకోవడంలో మోదీ వంద శాతం విజయం సాధించారన్నారు. రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలయ్యేలా చూడాలని కోరారు. కొందరు వర్గీకరణ విషయంపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నారని, కాబట్టి ఏపీ, తెలంగాణలో సమస్య ఉత్పన్నం కాకుండా అమలు జరిగేలా చూడాలని విన్నవించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక వ్యక్తి మోదీ మాత్రమేనని మంద కృష్ణ కొనియాడారు.



మంద కృష్ణను ఆలింగనం చేసుకున్న ప్రధాని మోదీ

- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల కల్పన, సానుకూల బదిలీలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) సంఘం విజ్ఞప్తిచేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు 400 మందిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. పిల్లల చదువులు, ఇళ్లలో పెద్దవారి ఆరోగ్య తదితర సమస్యలను ఎదుర్కొంటూ ఇప్పటివరకు నివాసమున్న ప్రాంతాలకు దాదాపు 200 కి.మీ. దూరంగా పలువురు బదిలీ అయ్యారని వెల్లడించింది.

సీనియారిటీ జాబితాలు పంపండి

- కలెక్టర్లకు సీసీఎల్‌ఏ సర్క్యులర్
- జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకోసం సీనియారిటీ జాబితాలు పంపాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయం కలెక్టర్లను కోరింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు సీసీఎల్‌ఏ సర్క్యులర్ జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించింది. ఈ ఫార్మాట్ ప్రకారం వివరాలు పంపాలని సర్క్యులర్‌లో సూచించింది. ఈ సీనియారిటీ జాబితాలో గతంలో వీఆర్‌ఏలుగా పనిచేస్తూ రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా కొనసాగుతున్న వారిని కూడా చేర్చనున్నట్టు సమాచారం.

అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించండి: టీజీటీఏ వినతి

జూనియర్ అసిస్టెంట్లతో పాటు మిగిలిన స్థాయిల్లో కూడా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్‌ను కలసిన టీజీటీఏ ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. సీనియర్ అసిస్టెంట్ల నుంచి నాయబ్ తహసీల్దార్లుగా, నాయబ్ తహసీల్దార్ల నుంచి తహసీల్దార్లుగా, తహసీల్దార్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని వారు వినతిపత్రంలో కోరారు. సీసీఎల్‌ఏను కలసిన వారిలో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్ తదితరులున్నారు.

సాధన సక్రమంగా జరిగి ఆత్మజ్ఞానం కలగాలంటే
సాధనా క్షేత్రమైన ఈ శరీరం ఆరోగ్యంగా ఉండాలి.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 10 ఆగస్టు 2024

దారికొచ్చిన ఎన్డీయే సర్కారు!

అలవాటైన పద్ధతిలో వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఎన్డీయే ప్రభుత్వానికి కాసేపటికే తత్వం బోధపడినట్టుంది. విపక్షాల నుంచి ప్రతిఘటన ఎదురుకావటంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపటానికి అంగీకరించింది. కారణమేదైనా అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు జేపీసీకి లేదా సెలెక్ట్ కమిటీకి పంపటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక సంప్రదాయం. కానీ ఎన్డీయే అధికారంలోకి వచ్చాక కేవలం రెండు సందర్భాల్లో మాత్రమే పాటించింది. పదేళ్లనాడు గద్దెనెక్కగానే అంతకు కొన్ని నెలలముందు అమల్లోకొచ్చిన భూసేకరణ చట్టం పీకనొక్కుతూ ఆదరా బాదరాగా ఆర్డినెన్స్ తీసుకురావటం ఎవరూ మరిచిపోరు. విపక్షాలు అభ్యంతరం చెబుతున్నా ఆనాడు చెవికెక్కలేదు. ఆర్డినెన్స్ మురిగిపోయిన రెండుసార్లూ దానికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ తిరిగి ఆర్డినెన్సులు తీసుకొచ్చారు. రాజ్యసభలో గండం గడిచేలా లేదని గ్రహించాక ఇక దాని జోలికి పోరాదని నిర్ణయించుకున్నారు. అటుపై సాగు చట్టాల విషయంలోనూ రైతులనుంచి ఇలాంటి పరాభవమే ఎదురయ్యాక వాటినీ ఉపసంహరించుకున్నారు. ఐపీసీ, సాక్ష్యాధారాల చట్టం, సీఆర్‌పీసీ స్థానంలో వచ్చిన కొత్త చట్టాల తాలూకు బిల్లులపై కూడా సంబంధిత వర్గాలను సరిగా సంప్రదించలేదు. ఎన్డీయే ఏలుబడి మొదలయ్యాక చోటుచేసుకున్న వేర్వేరు ఉదంతాల పర్యవసానంగా ముస్లిం సమాజంలో ఒక రకమైన అభద్రతాభావం ఏర్పడిన నేపథ్యంలో ఈ వివాదాస్పద చర్యకు కేంద్రం ఎందుకు సిద్ధపడిందో తెలియదు. బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని ఎన్డీయే భాగస్వామ్య పక్షం జేడీ(యూ) నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అంటున్నారు. ఇది పారదర్శకత తీసుకొస్తుందని కూడా ఆయన సెలవిచ్చారు. మంచిదే. మరి ఆ వర్గంతో సంప్రదింపులు జరిగిందెక్కడ? ముస్లిం సమాజానికున్న అభ్యంతరాల సంగతలా వుంచి రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు సైతం ఇది ఎసరు పెడుతోంది. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం భూమి రాష్ట్రాల జాబితాలోనిది. వక్ఫ్ ఆస్తిపై కేంద్ర పెత్తనాన్ని అనుమతించటంద్వారా దాన్ని కాస్తా తాజా బిల్లు నీరుగారుస్తోంది. కనుక ముస్లిం సమాజంతో మాత్రమేకాదు...రాష్ట్రాలతో కూడా సంప్రదించాల్సిన అవసరం లేదా? హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీలకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లు తెచ్చారని లోక్‌సభలో విపక్షాలు చేసిన విమర్శలు కాదని చెప్పటానికి ప్రభుత్వం దగ్గర జవాబు లేదు. తన చర్య వెనక సదుద్దేశం ఉందనుకున్నప్పుడూ, బిల్లుపై ఉన్నవన్నీ అపోహలే అని భావించినప్పుడూ తగిన సమయం తీసుకుని సంబంధిత వర్గాలతో చర్చించటానికేమైంది? ఒకవేళ వచ్చే అసెంబ్లీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకునే హడావిడిగా బిల్లు తీసుకొచ్చి వుంటే అంతకన్నా తెలివితక్కువతనం ఉండదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఆ మాదిరి ఎత్తుగడలను జనం ఏవగించుకున్నారని బీజేపీకి అర్థమయ్యే వుండాలి.

సవరణ బిల్లు ద్వారా తీసుకొచ్చిన 44 సవరణల పర్యవసానంగా వక్ఫ్ బోర్డుల అధికారాలకు కత్తెరపడుతుందని, ప్రభుత్వ నియంత్రణ పెరుగుతుందని కనబడుతూనేవుంది. అరుదైన సందర్భాల్లో తప్ప కలెక్టర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటారని ఎవరూ అనుకోరు. ఫలానా ప్రార్థనాస్థలం శతాబ్దాలక్రితం తమదేనంటూ ఆందోళనలు చేయటం, దానికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతుండటం అక్కడక్కడ కనబడుతూనేవుంది. ఇంతకాలం వక్ఫ్ ట్రిబ్యునళ్లకు ఉండే అధికారం కాస్తా కలెక్టర్లకు ఇవ్వాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. బోర్డుల్లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించటం, ఆస్తిని విరాళంగా ఇవ్వటంపై ఆంక్షలు సంశయం కలిగించేవే. మతపరమైన, ధార్మికపరమైన కార్యకలాపాల నిర్వహణ కోసం వచ్చిన ఆస్తుల్ని పర్యవేక్షించటానికి ఏర్పడిన బోర్డుల్లో వేరే మత విశ్వాసాలున్నవారిని నియమించటం ఏరకంగా చూసినా సరికాదన్న ఇంగిత జ్ఞానం ఉండొద్దా? అసలు ఒకసారి బోర్డు దేన్నయినా వక్ఫ్ ఆస్తిగా ప్రకటిస్తే దాన్ని మార్చటం అసాధ్యమన్న ప్రచారం కూడా తప్పు. ఫలానా ఆస్తి బోర్డుదనుకుంటే సంబంధిత వర్గాలకు నోటీసులిచ్చి వారి వాదనలు పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలని ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 40 చెబుతోంది. అటు తర్వాత వక్ఫ్ ట్రిబ్యునల్‌దే తుది నిర్ణయం. పైగా విరాళమిచ్చిన దాత కచ్చితంగా ఇస్లాంను పాటించే వ్యక్తే అయివుండాలని, దానంగా వచ్చే ఆస్తి కుటుంబవారసత్వ ఆస్తి కాకూడదని చట్టం నిర్దేశిస్తోంది. ఇప్పటికే ఇన్ని కట్టుదిట్టమైన నిబంధనలుండగా అందుకు భిన్నంగా ప్రచారం చేయటం సబబేనా? ఈ పరిస్థితుల్లో బిల్లు చట్టమైతే వక్ఫ్ ఆస్తుల చుట్టూ వివాదాలు ముసురుకుంటాయనుకునే అవకాశం లేదా?

సంకీర్ణంలోని జేడీ(యూ), ఎల్జేపీలు బిల్లుకు మద్దతు పలకగా సభలో టీడీపీ సంకటస్థితిలో పడిన వైనం స్పష్టంగా కనబడింది. ఆ బిల్లుకు మద్దతిస్తుందట...కానీ జేపీసీకి 'పంపితే' వ్యతిరేకించబోదట! ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పుట్టుకొచ్చిన బాబు రెండు కళ్ల సిద్ధాంతం ఇంకా సజీవంగా ఉందన్నమాట! టీడీపీది చిత్రమైన వాదన. అలా పంపనట్టయితే వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించబోమని చెప్పడానికి నోరెందుకు రాలేదు? ఒకపక్క బిల్లు చట్టమైతే పారదర్శకత ఏర్పడుతుందన్న ప్రభుత్వ వాదనను సమర్థిస్తూనే తమ సెక్యులర్ వేషానికి భంగం కలగకుండా ఆడిన ఈ డ్రామా రక్తి కట్టలేదు. జాతీయ మీడియా దీన్ని గమనించింది. మొత్తానికి సవరణ బిల్లు జేపీసీకి వెళ్లటం శుభ పరిణామం. ఎన్డీయే సర్కారు ఈ సంప్రదాయాన్ని ముమ్ముందు కూడా పాటించటం ఉత్తమం.

చేలకు డబ్బులు కాయాలి!

విశ్లేషణ



దేవిందర్ శర్మ

ప్రపంచంలోని 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయ ఉత్పత్తిదారుకు సబ్సిడీ మద్దతును రూపొందించినట్లు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తాజా ప్రపంచ విశ్లేషణ చూపిస్తోంది. భారతదేశం విషయానికి వస్తే మాత్రం, రైతులు తమ నష్టాలను పూడ్చుకోవడానికి తగిన బడ్జెట్ మద్దతు లేకుండా ఉన్నారు. 2000 సంవత్సరం నుండి భారతీయ రైతులు ఏటా నష్టాలను చవిచూస్తూనే ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. కాబట్టి, మన వ్యవసాయ రంగ విధానాలపై పునరాలోచన అవసరం. సమాజంలోని ఇతర వర్గాలతో ఆదాయ సమానత్వాన్ని తీసుకురావాలంటే వ్యవసాయ రంగంలో జీవనోపాధి సమస్యను పరిష్కరించి, రైతులు ఆదాయాన్ని పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న ముఖ్యమైన పాత్రను నొక్కి చెప్పడం ద్వారానే గత 25 సంవత్సరాలుగా, దాదాపు ప్రతి ఆర్థిక మంత్రీ తన బడ్జెట్ సమర్పణను ప్రారంభిస్తూ వస్తున్నారు. 'కిసాన్ కీ ఆజాదీ' నుండి దేశ ఆర్థిక వ్యవస్థ జీవనాధారం వరకు, బడ్జెట్ ప్రతిపాదనల దృష్టిని ఎత్తిపట్టడానికి అనేక విశేషణాలను ఉపయోగిస్తూ వచ్చారు. వ్యవసాయ ఆదాయాన్ని పెంచడం గురించి అరుణ్ జైట్లీ మాట్లాడారు. ప్రభుత్వ ఐదు ప్రాధాన్యాలలో దాన్ని అగ్రస్థానంలో ఉంచారు. నిర్మలా సీతారామన్ కూడా వ్యవసాయానికి తగిన గుర్తింపును కల్పించారు. ఆమె పేర్కొన్న తొమ్మిది ప్రాధాన్యాలలో వ్యవసాయ ఆదాయ పెంపుదల అగ్రస్థానంలో ఉంది.

దాదాపు ప్రతి బడ్జెట్‌లోనూ ఇలా వ్యవసాయానికి ఊతమివ్వడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే మార్పు వచ్చి ఉండాలి. అయితే దీనిపై నిశితంగా దృష్టి సారించినప్పటికీ ఒక్కసారి కూడా వ్యవసాయం పునరుద్ధరణ మార్గం పట్టినట్లు కనిపించలేదు. ఎందుకంటే అధిక ధరలు లభిస్తాయనీ, రైతుల ఆదాయం పెరుగుతుందనే ఆశాభావంతో పంటల ఉత్పాదకత పెంపుదల గురించి అంతర్లీనంగా ఉద్ఘాటిస్తున్నప్పటికీ దేశంలో వ్యవసాయ కష్టాలు మరింత పెరిగాయి. విజయవంతమైన హరిత విప్లవం తర్వాత కూడా వ్యవసాయ కుటుంబానికి నెలవారీ సగటు ఆదాయం దాదాపు రూ. 10,218 గానే ఉంటున్నప్పుడు, బడ్జెట్‌లో ఇంత మద్దతు ఉన్నప్పటికీ వ్యవసాయంలో తీవ్రమైన సంక్షోభాన్ని కొట్టిపారేయలేము.

వాస్తవాలు ఎలా ఉన్నాయో చూద్దాం. కర్ణాటకలో, అధికారిక అంచనా ప్రకారం గత 15 నెలల్లో 1,182 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మహారాష్ట్రలో ఈ సంవత్సరం జనవరి–జూన్ మధ్య 1,267 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు, విదర్భలోని ఒక్క అమరావతి డివిజన్‌లోనే 557 కేసులు నమోదయ్యాయి.

రైతుల ఆత్మహత్యలు కొత్త విషయం కాదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా సంకలనం గత 27 ఏళ్లలో రైతుల ఆత్మహత్యల సంఖ్యను చూపిస్తోంది. ఈ కాలం వ్యవసాయానికి సంబంధించి 25 సంవత్సరాల బడ్జెట్ హామీలకు సమానంగా ఉంది. 1995–2014 మధ్య కాలంలో 2,96,438 మంది సాగుదారులు తీవ్రాతితీవ్రమైన ఆత్మహత్యా సదృశ చర్యలకు పాల్పడ్డారు. 2014 నుండి 2022 వరకు 1,00,474 మంది రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. సరళంగా చెప్పాలంటే, వ్యవసాయాన్ని మలుపు తిప్పుతామని వార్షిక బడ్జెట్‌లు వాగ్దానం చేస్తూ ఉన్న సమయంలోనే 1995–2022 మధ్య దాదాపు నాలుగు లక్షల మంది రైతులు తమ జీవితాలను ముగించారు. అంటే బడ్జెట్ కేటాయింపులకు, కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభానికి మధ్య అసమతుల్యత అత్యంత స్పష్టంగా ఉంది.

తెలంగాణ ఇప్పుడు వ్యవసాయ రుణమాఫీ రెండో దశను పూర్తి



చండీగఢ్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌లో తన వరి పంటపై విశ్రాంతి తీసుకుంటున్న ఒక రైతు (ఫైల్ ఫొటో)

చేసుకుంది. ఇది 6.4 లక్షల మంది రైతులకు రూ. 6,198 కోట్ల బకాయి రుణాలను మాఫీ చేసింది. అప్పుల్లో ఉన్న సాగుదారుల్లో ప్రతి ఒక్కరికి రూ. 1.5 లక్షల మాఫీ లభిస్తుంది. మొదటి దశలో 11.34 లక్షల మంది రైతులకు రూ. 6,190 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ నెల 15న ప్రారంభం కానున్న మూడో దశలో 17.75 లక్షల మంది రైతులకు రూ. 12,224 కోట్ల రుణమాఫీ అందనుంది. రాష్ట్రంలో మొత్తం 35.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తున్నారన్నమాట. అయితే దీనర్థం పెరుగుతున్న వ్యవసాయ రుణాలు ఇతర రాష్ట్రాల్లో సమస్యాత్మకం కావని కాదు.

ప్రపంచంలోని 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయ ఉత్పత్తిదారుకు సబ్సిడీ మద్దతును రూపొందించినట్లు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తాజా ప్రపంచ విశ్లేషణ చూపిస్తోంది. భారతదేశం విషయానికి వస్తే, రైతులు తమ నష్టాలను పూడ్చుకోవడానికి తగిన బడ్జెట్ మద్దతు లేకుండా ఉన్నారు. 2000 సంవత్సరం నుండి భారతీయ రైతులు ఏటా నష్టాలను చవిచూస్తూనే ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న ఇన్ని నష్టాల నుండి మరే ఇతర రంగం అయినా బయటపడుతుందా?

మనం ఈ విశ్లేషణా పద్ధతిని తప్పుబట్టినప్పటికీ, ఉత్పాదకతకు, ఉత్పత్తిని పెంచడం కోసం సాంకేతికతకు మద్దతు ఇవ్వడం లేదా ఇతర పథకాలకు డబ్బును నింపడం వల్ల రైతుల ఆదాయం పెరగదు అనేది వాస్తవం. ఇది ఎక్కడా జరగలేదు. ఓఈసీడీ అధ్యయనమే ఇందుకు నిదర్శనం.

దీనినే నేను 'వయా బటిండా' విధానం అని పిలుస్తాను. ఇన్‌పుట్ సప్లయర్‌లు లేదా టెక్నాలజీ ప్రదాతల ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి బదులుగా, ప్రత్యక్ష ప్రయత్నం ఎందుకు చేయలేరు? ఇలాంటి పరోక్ష ప్రయత్నం గతంలో పని చేయలేదు. భవిష్యత్తులో కూడా పని చేయదు. రైతులు అట్టడుగు స్థానంలో ఉన్న సమయంలోనే ఇన్‌పుట్ సప్లయర్‌లు లాభాల్లో ఎలా దూసుకు పోతున్నారో అనేక అధ్యయనాలు చూపించాయి. సప్లయ్ చెయిన్ల విషయంలో కూడా అంతిమ లాభాలలో పెంపకందారుల వాటా దాదాపు 5–10 శాతం లేదా అంతకంటే తక్కువగానే ఉంటోంది. 2021లో స్ట్రాబెర్రీలను, రాస్‌బెర్రీలను మార్కెటింగ్ చేయడం ద్వారా రిటైల్ లాభాలు 27 పెన్నీల వరకు పెరిగాయని, కానీ రైతుల వాటా 3.5 పెన్నీలు మాత్రమే అని బ్రిటన్‌లో ఒక అధ్యయనం తెలిపింది. వినియోగదారులు ఆధారపడిన ఆరు రోజువారీ అవసరాలకు గానూ, రిటైల్ లాభంలో కేవలం 1 శాతం మాత్రమే రైతులకు లభిస్తుందని ఇంతకు ముందు అధ్యయనాలు చూపించాయి. అందువల్ల, తాజా బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా, ప్రాథమిక ఉత్పత్తిదారు అయిన రైతు వాటాకు హామీ ఇచ్చినప్పుడు మాత్రమే సరఫరా గొలుసులను బలోపేతం చేయడం అనేది దోహదకారిగా ఉంటుంది.

దేశంలోని దాదాపు సగం జనాభా వ్యవసాయ రంగంలో నిమగ్నమై ఉంటున్నప్పుడు, వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో కేవలం 3.15 శాతం మాత్రమే కేటాయిస్తే, అసాధారణంగా ఏమీ ఆశించలేం. ఈ సంవత్సరం వ్యవసాయ బడ్జెట్ రూ. 1.52 లక్షల కోట్లు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు దాదాపు రూ. 26,000 కోట్లు పెరిగి, ముందుగా సూచించినట్లుగా ప్రణాళికేతర వ్యయాన్ని కవర్ చేస్తుంది. వ్యవసాయం కోసం బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ పథకానికి రూ. 60,000 కోట్లు కేటాయించారు, ఇది భూమిని కలిగి ఉన్న ప్రతి రైతుకు నెలవారీ రూ. 500లను అందిస్తుంది, ఇక మిగిలింది వ్యవసాయానికి రూ. 92,000 కోట్లు. గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం కేవలం రూ. 3,268గా ఉందని 2022–23 గృహ వినియోగ వ్యయం మనకు చెప్పడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వ్యవసాయం లాభసాటిగా లేకపోతే, గ్రామీణ వ్యయం ఇప్పటికీ తక్కువగానే ఉంటుంది.

కాబట్టి, వ్యవసాయంపై పునరాలోచన అవసరం. సమాజంలోని ఇతర వర్గాలతో ఆదాయ సమానత్వాన్ని తీసుకురావడానికి మొదట జీవనోపాధి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతుల ఆదాయం, సంక్షేమం కోసం జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలనేది నా సూచన. ఈ కమిషన్ నిర్దిష్ట కాల వ్యవధిలో వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి నిర్దిష్ట మార్గాలతో ముందుకు రావాలి. కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన విధానాన్ని నిర్ధారించడం ద్వారా దీన్ని ప్రారంభించాలి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రభుత్వమే దోచేస్తే!



ప్రీమియంపై ఎన్డీయే ప్రభుత్వం వసూలు చేస్తున్న 18 శాతం జీఎస్టీ వల్ల జీవిత, ఆరోగ్య బీమాలన్నవి శ్రీమంతులు మాత్రమే అనుభవించగల సౌకర్యాలు అయ్యాయి. సాధారణ పౌరులను దోపిడీ చేయటానికి, అణచివేయటానికి వెనుకాడని ఈ ప్రభుత్వంపై పార్లమెంటులోనే కాదు, పార్లమెంటు బయటా పోరాటం జరగవలసి ఉంది.

– చంద్రిమా భట్టాచార్య, తృణమూల్ ఎమ్మెల్యే

మనుషులంతా ఒక్కటే!



నాకు చాలామంది అద్భుతమైన ఇరానీ స్నేహితులు ఉన్నారు. మా పొరుగున ఉన్న ఇరానీయులు కూడా మాతో చాలా ఉదారంగా ఉంటారు. నాకు చిన్నప్పటి నుంచి తెలిసిన ఇరాకీ స్నేహితులు కూడా ఉన్నారు. ఎక్కడైనా మనుషులు మనుషులే! రాజకీయాలను బట్టి మనం వారిని చూస్తే, వారూ మనల్ని అలానే చూస్తారు.

– తారా దేశ్‌పాండే, కంటెంట్ క్రియేటర్

నింద తగునా?!



జాత్యహంకార వ్యక్తులను 'వలస వ్యతిరేకులు' అని పిలవటం మానేయండి. వారు వైట్ అమెరికన్, కెనడియన్, ఆస్ట్రేలియన్, న్యూజిల్యాండ్, ఫ్రెంచ్, ఇటాలియన్ వలసలపై ఎప్పుడైనా దాడి చేశారా? లేదు కదా!

– అహ్మద్ సెవెహ్లీ, వ్యంగ్య వ్యాఖ్యాత

అంతవరకు రానివ్వకండి!



చరిత్రలో ఒక్కసారి కూడా ప్రజలపై సాయుధ బలగాలు, పోలీసులు ప్రయోగించిన హింస సవ్యమైన ఫలితాలను ఇవ్వలేదు. అయినప్పటికీ దేశాలు తమ ప్రజలను గొర్రెలుగానే భావిస్తున్నాయి. తాము కోల్పోయేది ఏమీ లేదనే స్థితికి చేరుకున్నప్పుడు రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తారు. ఇదొక హెచ్చరిక.

– ఋతుపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

భాషకు ప్రత్యామ్నాయం



టోక్యో 1964 ఒలింపిక్ హోస్ట్‌గా ఎంపికైనప్పుడు చిన్న అడ్డంకి వచ్చింది. భాష! బయటి వారికి జపనీస్ భాష అర్థం కాలేదు. అంతర్జాతీయ సందర్శకులతో మాట కలపటానికి జపాన్ ఆనాడు చేసిన యత్నం... ఒలింపిక్స్‌లో పదాలు లేని చిహ్నాల సృష్టికి దారితీసింది. అవే... పిక్టోగ్రామ్స్. ఈవెంట్‌ల బొమ్మలు.

– సుశాన్ నైనన్, క్రీడా వ్యాఖ్యాత

ఇన్‌బాక్స్

ఆధునిక ఘనాపాఠి

మనమందరం గర్వించదగిన గొప్ప పాత్రికేయులు తుర్లపాటి కుటుంబరావు. 1946లో 14వ ఏట జర్నలిజంలోకి ప్రవేశించిన అరుదైన వ్యక్తి. ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు శిష్యుడిగా దినపత్రికలో సహాయ సంపాదకుడిగా జర్నలిస్ట్ జీవితం ప్రారంభించి నిజాయితీగా, నిక్కచ్చిగా పలు వ్యాసాలు, వార్తలు రాశారు. ముఖ్యంగా 'వార్తల్లోని వ్యక్తి' అనే శీర్షికను వివిధ పత్రికలలో 50 ఏళ్ళపాటు రాసి రికార్డు సృష్టించారు. 1951లో ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 'ప్రజా పత్రిక'లో చేరి తదుపరి ఆయనకు కార్యదర్శిగా పనిచేశారు. ప్రముఖులైన గాంధీజీ, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, బీఆర్ అంబేడ్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ; అనేకమంది రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి దేశ దశాదిశ నిర్దేశాలను పేర్కొన్న అనుభవజ్ఞులు.



తుర్లపాటి కుటుంబరావు

ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మొరార్జీ దేశాయ్, బాబూ జగ్జీవన్ రాం వంటివారి ఆంగ్ల ఉపన్యాసాలను తనదైన శైలిలో అనువదించి ప్రజలకు అర్థమయ్యేరీతిలో చెప్పారు. 18 వేలకు పైగా ఉపన్యాసాలను ఇచ్చి మెప్పించిన ఏకైక వ్యక్తి. గిన్నిస్‌బుక్ వారి ప్రత్యేక ప్రశంసలు అందుకుకొన్నారు. 'ఉపన్యాస కేసరి', 'దశసహస్ర సభాకేసరి' అనే బిరుదులతో పాటు ఆంధ్ర యూనివర్సిటీ నుండి 'కళాప్రపూర్ణ'నూ అందుకొన్నారు. 'ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్' అవార్డు, తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్' అవార్డు పొందిన ప్రతిభాశాలి. దేశం 'పద్మశ్రీ'తో ఆయన్ని అలంకరించింది.

ఆయనకు సినీరంగం అంటే ఎంతో ఇష్టం. ఎక్కడ ఏ సినిమా ఫంక్షన్ జరిగినా సభాధ్యక్షులుగా ఆయనే ఉండేవారు. సభను ఆద్యంతం తన చతురోక్తులతో జనరంజకం చేసేవారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ స్థాపించి రాష్ట్రంలో ప్రతి ఏటా సినీరంగ ప్రతిభావంతులకు అవార్డులిచ్చి సత్కరించేవారు. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబరుగా, నంది అవార్డుల కమిటీ సభ్యులుగా, కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా వివిధ పదవులు అలంకరించి అభివృద్ధి బాటలు వేసిన దార్శనికుడు. 'మహానాయకులు', 'జాతి నిర్మాతలు', '1857 విప్లవ వీరులు', 'నా కలం–నా గళం' వంటి మంచి పుస్తకాలను మనకు అందించిన గొప్ప రచయిత. అటువంటి ప్రతిభాశాలి కాంస్య విగ్రహాన్ని కనీసం ఆయన సొంత ఊరు విజయవాడలోనైనా ఏర్పాటు చేస్తే ముందు తరాలకు స్ఫూర్తిమంతంగా ఉంటుంది.

– అంబటి మధుమోహనకృష్ణ
ప్రెసిడెంట్, ఎ.పి. ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, విజయవాడ

(నేడు 'పద్మశ్రీ' తుర్లపాటి కుటుంబరావు జయంతి)

నిజమైన విజేతవు నీవే బంగారం!

అభిప్రాయం



కృష్ణారావు చొప్పరపు

క్రీడలే జీవితంగా భావించేవారు తమ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కోరుకొంటారు. పతకం కోసం అహరహం శ్రమిస్తూ సంవత్సరాల తరబడి సాధన చేస్తూ ఉంటారు. అయితే... గెలుపు, ఓటమితో సంబంధం లేని ఓ సాంకేతిక కారణంతో స్వర్ణపతకం చేజారితే... కనీసం రజత పతకమైనా దక్కకుంటే అంతకుమించిన విషాదం మరొకటి ఉండదు. ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్ మహిళల కుస్తీ 50 కిలోల విభాగంలో భారత మల్లయోధురాలు వినేశ్ పోగట్‌కు అదే పరిస్థితి ఎదురయ్యింది. వంద గ్రాముల అదనపు బరువు కొండంత దురదృష్టాన్ని, గుండెబరువును మిగిల్చింది.

ఒలింపిక్స్‌లో పతకం మినహా ప్రపంచ కుస్తీలోని అన్ని రకాల పోటీలలో పతకాలు సాధించిన ఘనత వినేశ్‌కు ఉంది. 49 కిలోలు, 50 కిలోలు, 53 కిలోల విభాగాలలో పాల్గొంటూ చెప్పుకోదగ్గ విజయాలు, ఎన్నో పతకాలు సాధించిన ఘనత ఉంది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ప్రపంచ పోటీలలో సైతం స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన వినేశ్‌కు ఒలింపిక్స్ పతకం మాత్రం గత పుష్కరకాలంగా అందని ద్రాక్షలా ఉంటూ వచ్చింది.

2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొంటూ గాయంతో వైదొలిగిన వినేశ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మాత్రం స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయింది. ఇక 2024 ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభానికి కొద్దిమాసాల ముందు వినేశ్ న్యాయం కోసం ముందుగా రోడ్లు, ఆ తరువాత న్యాయస్థానాల మెట్లు ఎక్కి పోరాడాల్సి వచ్చింది.

అంతర్జాతీయ కుస్తీ పోటీలలో పాల్గొంటూ, దేశానికి పతకాలతో ఖ్యాతి తెస్తున్న ఏడుగురు మహిళా వస్తాదులపై బీజేపీ మాజీ ఎంపీ, జాతీయ కుస్తీ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్, ఆయన పరివారం లైంగిక వేధింపులకు పాల్పడటానికి నిరసనగా భజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ లాంటి దిగ్గజ వస్తాదులతో కలసి వినేశ్ గొప్ప పోరాటమే చేసింది. చివరకు ఢిల్లీ పోలీసుల కాఠిన్యాన్ని రుచి చూడాల్సి వచ్చింది. న్యాయస్థానాల జోక్యంతో బ్రిజ్ భూషణ్ అధ్యక్షపదవిని వీడక తప్పలేదు.

మొక్కవోని దీక్షతో, మోకాలి శస్త్ర చికిత్సను సైతం భరించి, పోరాడి ప్యారిస్ ఒలింపిక్స్ 50 కిలోల విభాగంలో పాల్గొనటానికి అర్హత సంపాదించింది. 53 కిలోల విభాగంలో తనకు అవకాశం లేకపోడంతో యాభై కిలోల విభాగంలో పాల్గొనటం కోసం బరువు తగ్గించుకొని మరీ ప్యారిస్‌లో అడుగుపెట్టింది. మహిళా కుస్తీ 50 కిలోల విభాగం పోటీల తొలిరోజున 50 కిలోల బరువుతోనే జపాన్, ఉక్రెయిన్, క్యూబా



బరిలో వినేశ్ పోగట్

బాక్సర్లను చిత్తు చేయడం ద్వారా ఫైనల్లో అడుగుపెట్టింది. వినేశ్ ఫైనల్స్ చేరడంతో బంగారు పతకం ఖాయమనే శతకోటి భారత క్రీడాభిమానులు ఆశపడ్డారు. కానీ జరిగింది వేరు. అంతర్జాతీయ కుస్తీ సమాఖ్య నిబంధనల ప్రకారం పోటీలు జరిగే ప్రతి రోజూ వివిధ విభాగాలలో పోటీకి దిగే వస్తాదుల బరువును చూసిన తరువాతే పోటీకి అనుమతిస్తారు. అయితే...పోటీల తొలిరోజున 50 కిలోల బరువున్న వినేశ్... స్వర్ణపతకం కోసం పోటీపడే రోజున మాత్రం 100 గ్రాముల బరువు అదనంగా ఉండడంతో అనర్హత వేటు వేశారు. బరువును నియంత్రించుకోడం కోసం ఫైనల్‌కు ముందురోజు రాత్రి వినేశ్, ఆమె శిక్షకులు చేయని ప్రయత్నం అంటూ ఏమీలేదు. తెల్లవార్లూ నడకతో, సైక్లింగ్ చేస్తూ, విపరీతమైన వేడితో ఉండే ఆవిరి గదిలో వినేశ్ గడిపింది. చివరకు బరువు తగ్గించుకోవటం కోసం శిరోజాలను సైతం కత్తిరించుకొన్నా ప్రయోజనం లేకపోయింది. వంద గ్రాముల అదనపు బరువు కారణంగా బంగారు పతకం కోసం పోటీ పడే అవకాశాన్ని కోల్పోడంతో పాటు... కనీసం రజత పతకానికి సైతం నోచుకోలేకపోయింది. అదనపు బరువు నిబంధన కారణంగా వినేశ్‌కు బంగారు పతకం పోరులో పాల్గొనే అవకాశాన్ని నిరాకరించడం గుండెకోతను మిగిల్చింది. వినేశ్‌తో పాటు కోట్లాది క్రీడాభిమానులు, యావత్ భారతజాతి తల్లడిల్లిపోయింది.

అదనంగా ఉన్న 100 గ్రాముల బరువే తనకు ఒలింపిక్స్ పతకం సాధించే అవకాశం లేకుండా చేయటాన్ని జీర్ణించుకోలేని వినేశ్ అర్ధంతరంగా రిటైర్మెంట్ ప్రకటించింది. వినేశ్‌కు న్యాయం చేయాలంటూ అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘానికి భారత కుస్తీ సమాఖ్య అప్పీలు చేసింది. ఫైనల్ బరిలో దిగకుండానే సర్వం కోల్పోయిన వినేశ్‌కు కనీసం రజత పతకమైనా ఇవ్వాలంటూ మొరపెట్టుకొన్నారు. రజత పతకాలు ఇద్దరికీ ఇచ్చినా ఇబ్బంది రాదని అంటున్నారు. వినేశ్‌కు ప్రధాని, కేంద్ర క్రీడామంత్రి; భారత ఒలింపిక్స్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో పాటు పలువురు క్రీడాదిగ్గజాలు, సింధు లాంటి ఒలింపియన్లు అండగా నిలిచారు.


ప్రతిభకు, బరువుకు సంబంధం ఏంటని పలువురు నిపుణులు, ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. 100 గ్రాముల అదనపు బరువుతో ప్రత్యర్థికి జరిగే నష్టమేంటని నిలదీస్తున్నారు. హార్మోనుల అసమతౌల్యత వల్ల మహిళల బరువు తరచూ మారిపోతూ ఉంటుందని, ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని మినహాయింపు ఇవ్వాలంటూ సూచిస్తున్నారు.

భారత ఒలింపిక్స్ సంఘం మొరను అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం ఆలకించినా... ఆలకించకున్నా, కనీసం రజత పతకం ఇచ్చినా, ఇవ్వకున్నా... నిజమైన విజేతగా కోట్లాది మంది క్రీడాభిమానుల గుండెల్లో వినేశ్ పోగట్ నిలిచిపోతుంది.

వ్యాసకర్త సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్
మొబైల్: 84668 64969

దేవుడికొక దెప్పిపొడుపు

చాలామంది భక్తులు దేవుడిని తమ ప్రభువుగానూ, తమను దేవుడి దాసానుదాసులుగానూ భావించుకొని ఎంతో వినయ విధేయతలతో ఆయనను కొలుస్తారు. కొందరు భక్తులు మాత్రం (కనీసం అప్పుడప్పుడు) దేవుడు తమ బాల్యమిత్రుడో, సమ ఉజ్జీయో, బంటో అయినట్టు భావించి, 'ఎడవబ్బ సొమ్మని కులుకుతూ కూర్చొంటివి?' అన్నంతలేసి మాటలంటారు. ఎగతాళి చేస్తారు. ఎకసక్కెం చేస్తారు. 'ఏరా! ఒరే!' అంటారు. ఈ రోజులలో అయితే ఇతర భక్తులు ఊరుకోరని కొంత వెనకాడుతున్నారు గానీ, పూర్వం కొందరు మహా మహా భక్తులే తమ రచనలలో దేవుడినే దెప్పి పొడిచిన సందర్భాలు ఎన్నెన్నో కనిపిస్తాయి. ఎవరి దాకానో ఏమిటి, ఆది శంకరాచార్యులే అప్పుడప్పుడూ అలాంటి వ్యాజ స్తుతులు చేసేవారు.



జ్యోతిర్మయం

'ఏమయ్యా, సాంబశివా! ఆకాశంలో ఒకే ఒక్క సూర్యుడున్నాడు. ఆయన సామర్థ్యం చూసి అయినా నువ్వు నేర్చుకోవచ్చు గదా? భూనభోంతరాళమంతా వ్యాపించి ఉన్న దట్టమైన, గాఢమైన చిక్కని చీకటిని పాపం ఆయన ఒక్కడే పటాపంచలు చేసేస్తున్నాడు. చేసి, ప్రాణికోటిలో ప్రతి జీవికీ కళ్ళ ఎదుట కనిపిస్తున్నాడు. **ఏకః వారిజ బాంధవః క్షితి నభోవ్యాప్తం తమో మండలం/ భిత్వా, లోచన గోచరః అపి.** అదే నువ్వున్నావు. కావడానికి కోటి సూర్యుల కాంతి కలవాడివి. **త్వం కోటి సూర్య ప్రభః** కానీ కొంచెం నా కంటికి సాక్షాత్కరించవయ్యా అంటే ససేమిరా కనబడవేమి? **వేద్యం కిం న భవసి, అహో?** అదేమంటే, 'నీ అజ్ఞాన తమస్సు వల్ల నేను కనిపించడం లేదు' అంటావు. అసలు అల్పుడిని నేనెంత? ఆ అల్పుడి అల్పమైన అజ్ఞానాంధకారం ఎంత? భూమ్యాకాశాలు వ్యాపించి ఉన్న అంధకారం ముందు, నా తమోంధకారం ఎంత? కోటి సూర్యుల కాంతి వాడివి నీకది అడ్డమా? నువ్వు తలచుకొంటే దాన్ని అర క్షణంలో ధ్వంసం చేయగలవు. కనుక నెపాలూ, సాకులూ మాని నా కళ్ళకు కనిపించవయ్యా, పుణ్యం ఉంటుందని 'శివానందలహరి'లో అంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.1.47 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** చిత్త రా.3.17 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.9.37 నుండి 11.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.43 నుండి 7.25 వరకు, **అమృతఘడియలు:** రా.8.12 నుండి 9.57 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలో
94.57 శాతం పాస్

- ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్
- ఉత్తీర్ణుల్లో బాలికలే ఎక్కువ.. 12 నుంచి కౌన్సెలింగ్
- రాష్ట్రంలో మొత్తం 42,192 పీజీ సీట్లు
- ఈ ఏడాది మరో 2 వేలు అదనంగా వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎనిమిది విశ్వవిద్యాలయాలు, వాటి పరిధిలోని పోస్టు–గ్రాడ్యుయేట్ కాలేజీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీపీగేట్) ఫలితాలను శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. సెట్‌లో 94.57 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించినట్టు ఆయన వెల్లడించారు. మొత్తం 45 కోర్సులకు సంబంధించిన ఈ సెట్‌ను గత నెల 6 నుంచి 16వ తేదీ వరకూ నిర్వహించారు. 73,342 మంది పరీక్షకు దరఖాస్తు చేస్తే, 64,765 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 61,246 మంది (94.57 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పీజీ సెట్ పరీక్ష రాసిన వారు, అర్హత సాధించిన వారిలో బాలికలే ఎక్కువగా ఉన్నారు. బాలురు 21,757 మంది పరీక్ష రాస్తే, 20,569 మంది పాసయ్యారు. బాలికలు 43,008 మంది రాస్తే 40,677 మంది పాసయ్యారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రొఫెసర్ మహమూద్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

12 నుంచి కౌన్సెలింగ్: ఉమ్మడి ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 12 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు సెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. విద్యార్థులు సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ కోసం అప్‌లోడ్ చేయాలని సూచించారు. కాలేజీల్లో చేరేటప్పుడు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 42,192 పీజీ సీట్లున్నాయని, ఈ సంవత్సరం మరో 2 వేల సీట్లు అదనంగా వచ్చే వీలుందని తెలిపారు. 278 కాలేజీలు కౌన్సెలింగ్ పరిధిలోకి వస్తాయని వెల్లడించారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్

తేదీ	వివరాలు
12.8.24 నుంచి 21.8.24	రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్
26.8.24	డేటా కరెక్షన్
27.8.24 నుంచి 30.8.24	వెబ్ ఆప్షన్లు
4.9.24	సీట్ల కేటాయింపు
9.9.24	సీట్లు వచ్చిన వాళ్ళు రిపోర్టింగ్
15.9.24	రెండో దశ కౌన్సెలింగ్ మొదలు

కొన్ని ప్రధాన బ్రాంచీల్లో టాపర్స్ వివరాలు

బ్రాంచీ	టాపర్	మార్కులు	జిల్లా
ఎంఏ ఎకనామిక్స్	తూడూరి సుమంత్	86	జగిత్యాల
ఎంఏ హిస్టరీ	బుస్సా రమ్య	76	సూర్యాపేట
ఎంఈడీ	కర్నాటి కావ్య	65	నల్లగొండ
ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్	బండి ప్రణీత	71	నల్లగొండ
ఎంకాం	కొండా తేజసాయి	78	హనుమకొండ

శ్రీచైతన్యలో ఐఐటీ, ఎన్‌ఐటీ విద్యాసంస్థల ఫ్యాకల్టీ

సాక్షి, హైదరాబాద్: గురుకుల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి 213 మంది నిపుణులను తమ విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీగా ఎంపిక చేసినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ గురుకుల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా దేశం నుంచి అత్యుత్తమ విద్యావేత్తలను ఎంపిక చేసినందుకు గర్వపడుతున్నామని చెప్పారు. ఈ కొత్త ఫ్యాకల్టీ సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ద్వారా జేఈఈ, నీట్ అండ్ ఐఏఎస్ అకాడమీ వంటి ప్రముఖ పరీక్షల్లో ఉత్తమ విద్యా శిక్షణను అందించేందుకు సిద్ధం చేశామన్నారు.

'మనూ'లో యూజీకి 12 నుంచి దరఖాస్తులు

మనూ డీఓఏ డైరెక్టర్ వనజ వెల్లడి



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మనూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం.వనజ శుక్రవారం తెలిపారు. జీయూఈటీలో హాజరుకాని ఇంటర్మీడియట్/12వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా నేరుగా మనూ అడ్మిషన్ పోర్టల్ లింక్ ద్వారా ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీఏలో ప్రవేశాలు (ఆనర్స్/పరిశోధన) హైదరాబాద్ క్యాంపస్‌లో, లక్నో క్యాంపస్, మనూ మోడల్ స్కూల్ క్యాంపస్ హైదరాబాద్ (ఈవినింగ్ కాలేజ్), వారణాసి క్యాంపస్, భోపాల్ క్యాంపస్, దర్భంగా క్యాంపస్‌లలో అందుబాటులో ఉండగా, బీఏ జేఎంసీ (ఆనర్స్/రీసెర్చ్), బీకామ్ (ఆనర్స్/రీసెర్చ్) బీఎస్సీ (ఆనర్స్/పరిశోధన), బ్యాచ్‌లర్ ఆఫ్ ఒకేషన్ (ఎంఐటీ/ఎంఎల్‌టీ/ఈటీటీ) హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. సీయూఈటీలో హాజరైన అభ్యర్థులకు ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తును సమర్పించేటప్పుడు విద్యార్థులు వారి మొబైల్ నంబర్, ఈ–మెయిల్‌ను నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి, అడ్మిషన్ పోర్టల్ లింక్‌పై క్లిక్ చేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23120600 (ఎక్స్‌టెన్షన్ 1801)ని సంప్రదించాలన్నారు.

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం... యువతి ప్రాణం తీసింది

- ప్రేమ వేధింపులు తాళలేక బలవన్మరణం
- భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య
- బీఫార్మసీ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని



తేజస్విని (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ప్రేమ వేధింపులు తాళలేక బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు కూతురు తేజస్విని(20) నర్సాపూర్ సమీపంలోని న్యూ ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన గువ్వ శ్రీహరి ఐదు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తేజస్వినికి పరిచయమయ్యాడు. అప్పటినుంచి ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోకపోతే మీ కుటుంబ సభ్యులను చంపేస్తానని యువతిని బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి గురువారం రాత్రి ఇంటి నాలుగో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి తేజస్విని మృతి చెందింది. పోలీసులు యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం తేజస్విని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు జిన్నారం సీఐ సుధీర్ కుమార్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

పెన్షన్ డబ్బుల కోసం కన్న తల్లినే చంపేసి..

మద్యానికి బానిసై ఘాతుకం... మెదక్ జిల్లా నిజాంపేటలో దారుణం




దుర్గవ్వ మృతదేహం

నిజాంపేట (మెదక్): పెన్షన్ డబ్బుల కోసం కన్న తల్లిని ఉరి వేసి హత్య చేసిన దారుణ ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఏడవ వార్డులో ఉంటున్న చలిమెటి దుర్గవ్వ(70) కుమారుడు రామచంద్రం బీడీ కార్మికుడిగా పనిచేస్తూ భార్యతో కలిసి తల్లి వద్దే ఉంటున్నాడు. రామచంద్రం మద్యానికి బానిసై నిత్యం తాగుతుండేవాడు. గురువారం అర్ధరాత్రి తాగి ఇంటికొచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దది కావడంతో మద్యం మత్తులో రామచంద్రం తల్లిని ఇంట్లో చున్నితో ఉరి వేసి హత్య చేశాడు. మృతురాలి కూతురు నాగుల విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

సీట్ల పెంపుపై | సర్కార్‌దే తుది నిర్ణయం

ఇంజనీరింగ్ కాలేజీలకు తేల్చిచెప్పిన హైకోర్టు

- ప్రభుత్వం అనుమతి లేకుండా సీట్ల పెంపు కుదరదని స్పష్టీకరణ
- సీట్ల పెంపు, కోర్సుల విలీనంపై పలు కాలేజీలు వేసిన పిటిషన్ల కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రారంభించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం నిరభ్యంతర పత్రం జారీ చేయకుండా కొత్త కోర్సులు, సీట్ల పెంపు సాధ్యం కాదని తేల్చిచెప్పింది. కొత్త కోర్సులపై అంతిమ నిర్ణయం తమదేనన్న ప్రభుత్వ వాదనతో ఏకీభవించింది. ఈ మేరకు శుక్రవారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బీటెక్, బీఈ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచీల సీట్ల పెంపునకు, కొన్ని కోర్సులను ఇతర కోర్సుల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో 28 పిటిషన్లు వేశాయి. నూతన కోర్సులకు జేఎన్‌టీయూహెచ్, ఏఐసీటీఈ అనుమతి ఇచ్చినా ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదని పిటిషన్లలో పేర్కొన్నాయి. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు డి.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డి, ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఎస్.రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఎవరి వాదన ఏమిటంటే..

'ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి వస్తుందనే ప్రభుత్వం కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వట్లేదు. రీయింబర్స్‌మెంట్ ఇబ్బందులు లేకుండా ప్రస్తుతమున్న పాత కోర్సులను కొత్త కోర్సులుగా మార్చుకొనేందుకు కూడా నిరాకరిస్తోంది. జేఎన్‌టీయూహెచ్, ఏఐసీటీఈ నివేదికలతో సీట్ల పెంపు, కోర్సుల విలీనంపై దరఖాస్తు చేసుకున్నా కారణమేదీ చెప్పకుండానే ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి నిరాకరించారు' అని పిటిషనర్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. మరోవైపు ఈ వాదనతో ప్రభుత్వ న్యాయవాది రాహుల్‌రెడ్డి విభేదించారు. 'పిటిషన్లు వేసిన కాలేజీలకు జేఎన్‌టీయూహెచ్ షరతులతో ఎన్ఓసీ జారీ చేసింది. ఇది ఏఐసీటీఈకి దరఖాస్తు చేసుకోవడానికే వీలు కల్పిస్తుంది. అధ్యాపకులు, మౌలికసదుపాయాలు, ప్రభుత్వం ఆమోదం విశ్వవిద్యాలయ నిబంధనల మేరకు ఉంటుంది. సీట్ల పెంపు లాంటిది ఒక్క రీయింబర్స్‌మెంట్‌కే పరిమితం కాదు. విద్యార్థుల పెంపు వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల కింద అనుమతిస్తే విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద విద్యార్థులకు భారంగా మారుతుంది. ఇప్పటికే కొన్ని కాలేజీల్లోని కోర్సుల్లో 120 మంది విద్యార్థులున్నారు. ఇంకా పెంచాలని కోరడం సరికాదు. ఆ పిటిషన్లను కొట్టివేయాలి' అని రాహుల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి విద్యాచట్టంలోని సెక్షన్ 20 ప్రకారం సీట్ల పెంపు, కోర్సుల విలీనంపై ప్రభుత్వానికే అధికారాలుంటాయని స్పష్టం చేశారు. కాలేజీల మధ్య అనారోగ్య పోటీని రూపుమాపడానికి తగిన నిర్ణయం తీసుకొనే అధికారం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి ఉందని.. అందువల్ల ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని తీర్పు చెప్పారు.

డెంగీతో విద్యార్థి మృతి

సిద్దిపేట జిల్లాలో ఘటన



బన్నీ (ఫైల్)

గజ్వేల్ రూరల్: డెంగి జ్వరంతో సిద్దిపేట జిల్లాలో ఓ విద్యార్థి మృతి చెందాడు. జిల్లాలోని గజ్వేల్ మున్సిపాలిటీలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)కి చెందిన శివలింగు స్వామి–కవిత దంపతులకు చెందిన బన్నీ (13) స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. రెండురోజుల క్రితం జ్వరం రావడంతో రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇదిలా ఉంటే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పారిశుద్ధ్యం లోపించడంతో విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

- ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు జీవో 46 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. హామీ అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ జీవో 46 అభ్యర్థులు కేటీఆర్‌ను కలిశారు. బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాకేశ్‌రెడ్డితో కలిసి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కేటీఆర్‌కు వివరించారు.



అరచేతిలో అపార సౌర శక్తి

బుల్లి సౌర ఫలకం!

వెంట్రుక కన్నా 100 రెట్లు పలుచన	సెల్ ఫోన్‌ను ఇట్టే చార్జ్ చేసుకోవచ్చు

ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టుల ఆవిష్కారం


ఒకవైపు ఇంధన అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరుల ఉత్పత్తి అంతులేని కాలుష్యానికి, గ్లోబల్ వార్మింగ్ పెనుభూతానికి కారకంగా మారుతోంది. సౌర విద్యుత్ సమర్థ ప్రత్యామ్నాయంగా కన్పిస్తున్నా దాని తయారీకి భారీ ఫలకాలు, విశాలమైన స్థలం వంటివెన్నో కావాలి. ఈ సమస్యలకు కూడా చెక్ పెడుతూ, సౌర విద్యుదుత్పత్తిని అత్యంత సులభతరం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎక్కడికక్కడ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోగలిగే అతి సూక్ష్మ సౌర ప్యానళ్లు త్వరలో రాబోతున్నాయి. వెంట్రుక మందంలో కేవలం వందో వంతు మాత్రమే ఉండే ఈ బుల్లి సౌర ప్యానళ్లను ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సైంటిస్టులు తాజాగా అభివృద్ధి చేశారు. వీటిని ప్రయాణాల్లో వీపుకు తగిలించుకునే బ్యాక్‌ప్యాక్‌పై, సెల్ ఫోన్ వెనక, కార్ రూఫ్ మీద... ఇలా ఎక్కడైనా సులువుగా అమర్చుకోవచ్చు! అంతేకాదు, ప్రస్తుత సౌర ఫలకాల కంటే రెట్టింపు సౌర విద్యుదుత్పాక సామర్థ్యం ఈ బుల్లి ఫలకాల సొంతం!!

ఎలా పని చేస్తుంది?

ఈ బుల్లి ప్యానళ్లలో సోలార్ కోటింగ్‌ను పెరోవ్‌స్కైట్స్‌గా పిలిచే పదార్థంతో తయారు చేస్తారు. ప్రస్తుత సిలికాన్ ఆధారిత సౌర ప్యానళ్లతో పోలిస్తే ఇది సూర్యరశ్మిని మరింత మెరుగ్గా ఒడిసిపడుతుంది. పైగా ప్రస్తుత ప్యానళ్లు అవి ఒడిసిపడుతున్న సూర్యరశ్మిలో 22 శాతాన్ని మాత్రమే ఇంధనంగా మార్చగలుగుతున్నాయి. ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టులు రూపొందించిన బుల్లి ప్యానళ్లు 27 శాతం సామర్థ్యంతో పని చేస్తాయి. దీన్ని మున్ముందు 45 శాతం దాకా పెంచుకోవచ్చని వాళ్లు బల్లగుద్ది చెబుతున్నారు. ''తొలిసారి రూపొందించినప్పుడు వీటి కన్వర్షన్ సామర్థ్యం 6 శాతమే. ఐదేళ్లలోనే దాన్ని 27 శాతానికి పెంచగలిగాం'' అని వివరించారు. ''ఎలా చూసుకున్నా సౌర విద్యుదుత్పత్తి రంగంలోనే ఇది అతి కీలకమైన ముందడుగు. ఎందుకంటే సిలికాన్ ఆధారిత ప్యానళ్లను బిగించేందుకు ప్రత్యేక సౌర క్షేత్రాలు తప్పనిసరి. అందుకు పంట పొలాలను వాడుతుండటం ప్రపంచవ్యాప్తంగా రైతుల ఆందోళనలు తదితరాలకు దారి తీస్తోంది. కానీ పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లకు ఆ అవసరమే ఉండదు. సిలికాన్ ప్యానళ్లతో పోలిస్తే వీటిని ఎక్కడంటే అక్కడ అతి సులువుగా బిగించుకోవచ్చు. కారుచౌకగా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ఎలాంటి ఉపరితలం మీదైనా ఇవి సులువుగా ఒదిగిపోతాయి. చివరికి ప్లాస్టిక్, కాగితంపై కూడా!'' అని పరిశోధనలో పాలుపంచుకున్న ఆక్స్‌ఫర్డ్ సైంటిస్టు జుంక్ వాంగ్ వివరించారు. ''పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లలో కేవలం ఒక మైక్రాన్ మందం కోటింగ్ ఉంటుంది. ప్రస్తుత సౌర ప్యానళ్లలో వాడుతున్న సిలికాన్ కోటింగ్‌తో పోలిస్తే ఇది ఏకంగా 150 రెట్లు పలుచన'' అని చెప్పారు.

ఆ సమస్యనూ అధిగమిస్తే...

సంప్రదాయ సిలికాన్ సౌర ప్యానళ్లతో పోలిస్తే బుల్లి ప్యానళ్లలో ఒక పెద్ద సమస్య లేకపోలేదు. అదే... స్థిరత్వం! పెరోవ్‌స్కైట్స్ ప్యానళ్లు ప్రయోగశాల పరిస్థితుల్లోనే కరిగిపోతున్నాయి. లేదా కొద్ది రోజుల్లోనే విరిగిపోతున్నాయి. అయితే ఇది సమస్యేమీ కాదని వాంగ్ అన్నారు. ''వాటి జీవితకాలాన్ని పెంచేందుకు జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వస్తున్నాయి'' అని వివరించారు.



పెరోవ్‌స్కైట్‌తో తయారైన బుల్లి సౌర ప్యానల్‌ను పరిశీలిస్తున్న ఆక్స్‌ఫర్డ్ పరిశోధక బృంద సభ్యుడు షుయ్‌ఫెంగ్ హూ

ఆకాశమే హద్దు...!

ప్రపంచవ్యాప్తంగా సౌర ప్యానళ్ల ఏర్పాటు ఒక్క గత ఏడాదిలోనే ఏకంగా 80 శాతం పెరిగినట్టు స్వచ్ఛ ఇంధన గణాంకాలు, విశ్లేషణలో పేరున్న వుడ్ మెకెంజీ సంస్థ వెల్లడించింది. వాటి ఏర్పాటుకు వెచ్చించాల్సిన ఖర్చు భారీగా తగ్గుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా సౌర విద్యుత్ అతి చౌకైన ఇంధన వనరుగా మారిపోతోంది. అంతేగాక గత 19 ఏళ్లుగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విద్యుత్ వనరుగా నిలుస్తూ వస్తోంది. ''ఈ పరిస్థితుల్లో మేం రూపొందించిన బుల్లి సౌర ప్యానళ్లు గనక ఒక్కసారి సక్సెసైతే వీటి వాణిజ్య విలువ ఆకాశాన్నంటుతుంది. అప్పుడిక ప్రపంచ ఇంధన రంగ ముఖచిత్రమే మారిపోవడం ఖాయం'' అని పరిశోధక బృందం సారథి హెన్రీ స్నెయిత్ ధీమాగా చెబుతున్నారు!

– సాక్షి, నేషనల్ డెస్క్

నీట్-పీజీ పరీక్ష వాయిదా వేయలేం: సుప్రీం



న్యూఢిల్లీ: నీట్-పీజీ-2024 పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం ఐదుగురు విద్యార్థుల కోసం రెండు లక్షల మంది విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయలేమని తేల్చిచెప్పింది. నీట్-పీజీ పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తోసిపుచ్చింది. ఈ నెల 11న జరగాల్సిన ఈ పరీక్ష కోసం ఇప్పటికే పరీక్ష కేంద్రాలు కేటాయించారని, ఈ తరుణంలో వాయిదా వేయడం సరైంది కాదని పేర్కొంది. విద్యార్థులు సులువుగా పరీక్ష కేంద్రాలకు చేరుకొనేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని, వారికి అనుకూలమైన ప్రాంతాల్లో ఎగ్జామ్ సెంటర్లు కేటాయించారని ధర్మాసనం వెల్లడించింది. చీటికీమాటికీ కోర్టులను ఆశ్రయించి, పరీక్షలను వాయిదా వేయాలని కోరడం తగదని పిటిషనర్ల తరఫు న్యాయవాది సంజయ్ హెగ్డేకు సూచించింది.


కశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరలో ఎన్నికలు

సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడి



జమ్మూ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం కృతనిశ్చయంతో ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ శుక్రవారం స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను పక్కదోవ పట్టించేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా అడ్డుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన అన్ని రాజకీయ పార్టీలూ అసెంబ్లీ ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలంటూ గట్టిగా కోరుతున్నాయన్నారు.

సిసోడియాకు బెయిల్



- దర్యాప్తును సాగదీస్తూ నిందితుడిని ఎంతోకాలం జైల్లో ఉంచలేమన్న సుప్రీం
- శుక్రవారం తిహార్ జైలు నుంచి విడుదల
- 17 నెలలుగా జైలులో విచారణ ఖైదీగా గడిపిన మాజీ ఉప ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్య కుంభకోణం కేసులో 17 నెలల క్రితం అరెస్టయి తిహార్ జైలులో విచారణ ఖైదీగా గడుపుతున్న ఆప్ నేత, నాటి ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఎట్టకేలకు సుప్రీంకోర్టులో బెయిల్ దొరికింది. సుదీర్ఘకాలంపాటు కేసు దర్యాప్తును సాగదీసి విచారణ ఖైదీకుండే హక్కులను కాలరాయలేమని శుక్రవారం బెయిల్ ఉత్తర్వులిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం సిసోడియాకు బెయిల్‌ను మంజూరుచేస్తూ 38 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ పిటిషన్‌పై ఆగస్ట్ ఆరో తేదీన వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్‌చేసి ఆగస్ట్ 9వ తేదీన వెలువరించింది.

వైకుంఠపాళి ఆడించారు..

''బెయిల్ అనేది నియమం. బెయిల్‌ను తిరస్కరించి విచారణ ఖైదీగా జైలుకు పరిమితం చేయడం అనేది ఒక మినహాయింపు'' మాత్రమే అనే సూత్రాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు జ్ఞప్తికి తెచ్చుకోవాల్సిన సమయమిది. బెయిల్ విషయంలో విచారణ కోర్టులు, హైకోర్టులు సేఫ్ గేమ్ ఆడుతున్నాయి. మనీశ్‌పై సీబీఐ, ఈడీలు దర్యాప్తు పూర్తిచేసి జూలై 3 కల్లా చార్జ్‌షీట్లు సమర్పిస్తాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గతంలో హామీ ఇచ్చారు. కానీ అది జరగలేదు. సిసోడియాను ట్రయల్ కోర్టుకు, అక్కడి నుంచి హైకోర్టుకు, తర్వాత సుప్రీంకోర్టుకు, మళ్లీ ట్రయల్ కోర్టుకు తిప్పుతూ ఆయనతో వైకుంఠపాళి ఆట ఆడించారు. బెయిల్ అనివార్యమైన కేసుల్లోనూ బెయిల్ తిరస్కరించడంతో సంబంధిత పిటిషన్లు సుప్రీంకోర్టుకు వెల్లువలా వస్తున్నాయి. సమాజంతో మమేకమైన సిసోడియా లాంటి వ్యక్తులను శిక్ష ఖరారు కాకుండానే సుదీర్ఘ కాలం నిర్బంధించి ఉంచకూడదు. స్వేచ్ఛగా, వేగవంతమైన విచారణను కోరడం నిందితుడికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. అయితే కేసు విచారణ నత్తనడకన సాగడానికే సిసోడియానే కారణమన్న కిందికోర్టు అభిప్రాయం వాస్తవదూరంగా ఉంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో సిసోడియాకు బెయిల్‌ను తిరస్కరిస్తూ మే 21వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. ''రూ.10 లక్షల వ్యక్తిగత బాండ్‌తోపాటు అదే మొత్తానికి మరో రెండు షూరిటీలను సమర్పించాలి. పాస్ట్‌పోర్ట్‌ను ప్రత్యేక ట్రయల్ కోర్టులో ఇచ్చేయాలి. సాక్ష్యాధారాలను ధ్వంసం చేయకూడదు. సాక్షులను ప్రభావితం చేయకూడదు. దర్యాప్తు అధికారి ఎదుట ప్రతి సోమ, గురు వారాల్లో ఉదయం 10–11 గంటల మధ్య హాజరు కావాలి'' అని కోర్టు షరతులు విధించింది.

తొలుత సీబీఐ.. ఆ తర్వాత ఈడీ

డిప్యూటీ సీఎంగా ఉన్న సిసోడియాను మద్యం కేసులో 2023 ఫిబ్రవరి 26వ తేదీన సీబీఐ అరెస్ట్‌చేసింది. తర్వాత రెండు రోజులకే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 9న మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదుచేసి ఈడీ సైతం జ్యుడీషియల్ కస్టడీలో ఉండగానే ఆయనను అరెస్ట్‌చేసింది.

అంబేడ్కర్‌కు రుణపడ్డా: సిసోడియా

తీర్పు నేపథ్యంలో శుక్రవారం తీహార్ జైలు నుంచి సిసోడియా విడుదలయ్యారు. పెద్దసంఖ్యలో జైలు వద్దకొచ్చిన ఆప్ కార్యకర్తలు ఆయనపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. '' నిరంకుశ కేంద్రప్రభుత్వ చెంప చెళ్లు మనిపించేందుకు రాజ్యాంగ అధికారాలను వినియోగించిన కోర్టుకు నా కృతజ్ఞతలు. శక్తివంతమైన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వల్లే బెయిల్ పొందగలిగా. ఈ బెయిల్ ఉత్తర్వు చూశాక జీవితాంతం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు రుణపడిపోయా. ఈ అనైతిక యుద్ధానికి రాజ్యాంగబద్ధంగా తార్కిక ముగింపు పలికాం. ఏదో ఒక రోజు ఈ చెడు సంస్కృతి అంతమవుతుంది. అప్పుడు బెయిల్‌పై కేజ్రీవాల్ కూడా విడుదల అవుతారు'' అని సిసోడియా అన్నారు.

ఆప్ హర్షం

సిసోడియాకు బెయిల్‌పై ఆప్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. '' సత్యమేవ జయతే. ఢిల్లీలో విద్యా విప్లవానికి నాంది పలికిన సిసోడియాకు ఇది గొప్ప విజయం. ఇది విద్యా విజయం, విద్యా ర్థుల విజయం'' అని ఢిల్లీ మహిళా మంత్రి అతిశి వ్యాఖ్యానించారు.

హరియాణా స్కూళ్లలో ఇకపై 'జై హింద్'



చండీగఢ్: హరియాణాలోని పాఠశాలల్లో ఇకపై 'జై హింద్' నినాదం వినిపించనుంది. విద్యార్థులు 'గుడ్ మార్నింగ్'ను వదిలేసి 'జై హింద్' అని పలకరించుకోవాలంటూ హరి యాణా ప్రభుత్వం జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశిస్తూ గురువారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆగస్ట్ 15వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అందులో పేర్కొంది. స్వాతంత్ర్య పోరాటం సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'జై హింద్' నినాదాన్ని తీసుకువచ్చారని, స్వాతంత్ర్యానంతరం ఇదే నినాదాన్ని భద్రతా బలగాలు సెల్యూట్‌గా తీసుకున్నాయని సర్క్యులర్ గుర్తు చేసింది.

వక్ఫ్ బిల్లుపై పార్లమెంటరీ సంఘం

సభ్యుల్లో విజయసాయిరెడ్డి, అసద్, డీకే అరుణ, లావు

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) బిల్లు–2024ను క్షుణ్నంగా పరిశీలించి, మార్పు చేర్పులపై సిఫార్సులు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటుకు పార్లమెంటు శుక్రవారం ఆమోదం తెలిపింది. లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది కలిపి 31 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి వి.విజయసాయిరెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), డి.కె.అరుణ (బీజేపీ), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), లావు శ్రీకృష్ణదేవరాయలు (టీడీపీ) ఉన్నారు. కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల తొలి వారంలో సమర్పించనుంది.

పార్లమెంట్ నిరవధిక వాయిదా


పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాలు 12వ తేదీ దాకా జరగాల్సి ఉండగా ముందే వాయిదా వేశారు.

బుద్ధదేవ్‌కు అంతిమ వీడ్కోలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు దిగ్గజం బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం వీడ్కోలు పలికారు. కోల్‌కతాలో సీపీఎం ప్రధాన కార్యాలయంలో బుద్ధదేవ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పార్టీలకు అతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. లాల్ సలామ్ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. సాయంత్రం బుద్ధదేవ్ పార్థివ దేహాన్ని ఆయన కోరిక ప్రకారమే ఎన్‌ఆర్ఎస్ ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం తన ఇంట్లో కన్ను మూసిన సంగతి తెలిసిందే.

చినికి చినికి గాలివానగా...

జయ వర్సెస్ ధన్‌ఖడ్!





మీ గొంతులో వ్యంగ్యం ధ్వనిస్తోంది

- ధన్‌ఖడ్ సంబోధనపై జయ అభ్యంతరం
- స్కూలు పిల్లల్లా చూస్తున్నారని ఆక్షేపణ
- ఆమె తీరుపై తీవ్రంగా ఆగ్రహించిన ధన్‌ఖడ్
- సెలబ్రిటీలైతే నిబంధనలకు అతీతులా?
- పేరు ప్రఖ్యాతులున్నది మీకు మాత్రమేనా?
- చైర్‌కే ఉద్దేశాలు ఆపాదిస్తున్నారంటూ ధ్వజం
- జయకు మద్దతుగా విపక్షాల వాకౌట్

ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానం!

న్యూఢిల్లీ: పేరులో ఏముందంటారు. కానీ పేరు పెను వివాదానికి దారి తీయగలదని, అంతకుమించి రాజకీయ సంక్షోభానికీ కారణం కాగలదని రాజ్యసభ సాక్షిగా రుజువైంది. సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ పేరు విషయమై శుక్రవారం రాజ్యసభలో రాజుకున్న రగడ నాటకీయ మలుపులు తిరిగి చివరికి రాజకీయ దుమారంగా మారింది. ఏకంగా రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తొలగించాలంటూ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్ష ఇండియా కూటమి నిర్ణయించుకునే దాకా వెళ్లింది! దాంతో విపక్ష సభ్యులకు, ఆయనకు మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న విభేదాలు కీలక మలుపు తిరిగాయి.

వేడెక్కిన రాజ్యసభ

జయాబచ్చన్ 'పేరు' అంశం శుక్రవారం రాజ్యసభను అమాంతం వేడెక్కించింది. విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై గత వారం బీజేపీ సభ్యుడు ఘన్‌శ్యాం తివారీ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేయడంతో రగడకు బీజం పడింది. ఇది ముగిసిపోయిన అంశమని ధన్‌ఖడ్ బదులివ్వడంతో విపక్ష ఎంపీలంతా గొడవకు దిగారు. దీనిపై జయ మాట్లాడతాననడంతో ధన్‌ఖడ్ అనుమతించారు. 'జయా అమితాబ్ బచ్చన్! మాట్లాడండి' అన్నారు. ఆయన తన పేరును పిలిచిన తీరులో వ్యంగ్యం ధ్వనిస్తోందంటూ జయ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''నేను నటిని. హావభావాలను ఇట్టే అర్థం చేసుకోగలను. మీ మాటతీరు ఏమాత్రం అంగీకార యోగ్యంగా లేదు. మీరు సభాధ్యక్ష స్థానంలో ఉండొచ్చు గాక. కానీ మీరు మా తోటి సభ్యులు మాత్రమే'' అన్నారు. దాంతో ధన్‌ఖడ్ తీవ్రంగా ఆగ్రహించారు. 'ఇక చాలు' అంటూ మధ్యలోనే కల్పించుకున్నారు. ''మీకు గొప్ప పేరుండొచ్చు. కానీ నటీనటులు దర్శకుడు చెప్పినట్టు చేయాల్సిందే. సభాధ్యక్ష స్థానం నుంచి నేను చూసేది మీకు కన్పించకపోవచ్చు. నా మాటతీరునే తప్పుబడతారా? నేనేం చేయాలో మీరు నిర్దేశించలేరు'' అంటూ ఆక్షేపించారు. ఇందుకు విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలపడంతో ధన్‌ఖడ్ మరింతగా మండిపడ్డారు. ''మీరు సెలబ్రిటీ అయినా, మరెవరైనా సరే! నథింగ్ డూయింగ్. నిబంధనలను అర్థం చేసుకోవాల్సిందే. సభా మర్యాదలు పాటించి తీరాల్సిందే'' అని బచ్చన్‌కు స్పష్టం చేశారు. విపక్ష ఎంపీలంతా తీవ్ర అభ్యంతరం తెలిపినా, మూకుమ్మడిగా నినాదాలకు దిగినా లెక్కచేయలేదు. ఈ అంశంపై మాట్లాడేందుకు ఎవరికీ అనుమతివ్వబోనని స్పష్టం చేశారు. ''పేరు ప్రఖ్యాతులు మీకే ఉంటాయనుకోకండి. మనమంతా ఇక్కడికొచ్చేది మన బాధ్యతలు సరిగా నిర్వర్తించి పేరు సంపాదించేందుకే. పేరు ప్రఖ్యాతులకు తగ్గట్టుగా నడుచుకోవాలి'' అంటూ క్లాసు తీసుకున్నారు. ''సీనియర్ సభ్యులైనంత మాత్రాన సభాపతి స్థానాన్ని అవమానించేందుకు సభాపతి మాటతీరుకు ఉద్దేశాలు ఆపాదించేందుకు ఎవరికీ హక్కు లేదు. పరిస్థితిని బట్టి ప్రతిస్పందించాల్సి వచ్చింది. నా సొంత స్క్రిప్టునే అనుసరిస్తాను తప్ప ఎవరో చెప్పినట్టు నడుచుకునే ప్రసక్తే లేదు'' అంటూ కుండబద్దలు కొట్టారు. విపక్ష సభ్యుల వ్యాఖ్యలేవీ రికార్డుల్లోకి వెళ్లబోవని స్పష్టం చేశారు. జయ పేరుపై రాజ్యసభలో ఆమెకు, ధన్‌ఖడ్‌కు సంవాదం జరగడం వారం రోజుల్లో ఇది మూడోసారి.

మేం స్కూలు పిల్లలమా?: జయ

ధన్‌ఖడ్ తీరుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నట్టు విపక్ష సభ్యులు ప్రకటించారు. దాంతో ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ''మీరు దేశం మొత్తాన్నీ అస్థిరపరిచే ప్రయత్నంలో ఉన్నారని నాకు బాగా తెలుసు. సభలో గందరగోళం సృష్టించడమే మీ ఉద్దేశం. అందుకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించబోను. మీరంతా మీ బాధ్యతల నుంచి పారిపోతున్నారు'' అంటూ ఆక్షేపించారు. ''రాజ్యాంగాన్ని పణంగా పెట్టయినా ఖర్గే తన మాట నెగ్గించుకోవాలనుకుంటున్నారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే'' అంటూ తప్పుబట్టారు. అనంతరం సోనియాగాంధీ తదితరులతో కలిసి జయాబచ్చన్ సభ నుంచి వాకౌట్ చేశారు. సభా ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ''క్రమశిక్షణలో పెట్టేందుకు మేమేమీ స్కూలు పిల్లలం కాదు. ధన్‌ఖడ్ మాటతీరుతో చాలా కలత చెందాను. అధికార పక్ష సభ్యులు నిండు సభలో మా పట్ల అమర్యాదకరమైన మాటలు వాడుతున్నారు'' అని ఆరోపించారు.

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ అభిశంసనకు తీర్మానం ప్రవేశపెట్టాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఈ మేరకు నోటీస్‌పై 87 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసినట్టు సమాచారం. ''నోటీసు ఎప్పుడివ్వాలో త్వరలో నిర్ణయిస్తాం. ఇది తీర్మానం దాకా వెళ్లకపోయినా, చైర్మన్‌గా ధన్‌ఖడ్ అనుసరిస్తున్న ఏకపక్ష పోకడలను దేశ ప్రజల ముందు ఎత్తి చూపడమే మా ఉద్దేశం'' అని విపక్షాలు స్పష్టం చేశాయి.

87 మంది ఎంపీల సంతకాలు

ముందస్తు నోటీసు తప్పనిసరి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బి) ప్రకారం ఉపరాష్ట్రపతిని తొలగించాలని కోరుతూ మహాభిశంసన తీర్మానం ప్రవేశపెట్టవచ్చు. మెజారిటీ సభ్యుల మద్దతు లభిస్తే తీర్మానం నెగ్గి ఆయన పదవీచ్యుతుడవుతారు. అయితే మహాభిశంసన కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టబోతున్నామంటూ కనీసం 14 రోజుల ముందస్తు నోటీసివ్వడం తప్పనిసరి.

ఎన్నికలవేళ హసీనా తిరిగొస్తారు: సాజీబ్



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆపద్ధర్మ ప్రభుత్వం నిర్ణయించినప్పుడు బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగొస్తారని ఆమె కుమారుడు సాజీబ్ వాజెద్ జాయ్ వెల్లడించారు. '' బంగ్లా మధ్యంతర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన మరుక్షణమే ఆమె భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్తారు' అని వాజెద్ అన్నారు. ప్రస్తుతం హసీనా న్యూఢిల్లీలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమె బ్రిటన్‌లో ఆశ్రయం పొందాలని యోచిస్తున్నట్లు భారత మీడియా కథనాలు ప్రచురించింది. అయితే బ్రిటన్ హోం శాఖ దీనిపై స్పందించడానికి నిరాకరించింది. బంగ్లాదేశ్ గురించి బ్రిటన్ విదేశాంగ మంత్రితో మాట్లాడానని, ఆయన ఎలాంటి వివరాలను పంచుకోలేదని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గురువారం చెప్పారు. ఈ నేపథ్యంలో వాజెద్ మీడియాతో మాట్లాడారు. అనివార్య పరిస్థితుల్లో తాను రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్లు వాజెద్ ప్రకటించారు.

బ్రెజిల్‌లో కూలిన విమానం

62 మంది మృత్యువాత..!

సావో పాలో: బ్రెజిల్‌లోని సావో పాలో రాష్ట్రంలో శుక్రవారం విమానం కుప్పకూలిన ఘటనలో అందులోని మొత్తం 62 మంది ప్రయాణికులు చనిపోయారు. సావో పాలో అంతర్జాతీయ విమానం వైపు వెళ్తున్న ఆ విమానం విన్హెడో నగరంలోని జనసమ్మర్దం ఉన్న ప్రాంతంపై కూలింది. విమానం శిథిలాల నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను టీవీలు ప్రసారం చేశాయి. ఓ విమానం నిట్టనిలువునా గిరికీలు తిరుగుతూ కూలడాన్ని, ఆ వెంటనే ఆ ప్రాంతంలో మంటలు ఎగసిపడటాన్ని చూపించాయి. ఘటనలో విమానంలో ఉన్న 58 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్లు బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా పేర్కొన్నారు. మృతులకు సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఫైర్ సిబ్బందితోపాటు మిలటరీ పోలీసులు, పౌర రక్షణ అధికారులు విన్హెడోని ఘటనా ప్రాంతంలో రక్షణ, సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.



విమాన శకలాల నుంచి ఎగిసిపడుతున్న మంటలు

హిజాబ్ సర్క్యులర్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: తాము ధరించే దుస్తులను ఎంచుకొనే స్వేచ్ఛ విద్యార్థినులకు ఉండాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి దుస్తులు ధరించాలో వారు నిర్ణయించుకోవచ్చని ఉద్ఘాటించింది. తమ విద్యా సంస్థ ప్రాంగణంలో విద్యార్థినులు హిజాబ్, బుర్ఖా, టోపీ, నఖాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ముంబైలోని ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠీ కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌పై న్యాయస్థానం స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. కాలేజీ సర్క్యులర్‌ను సమర్థిస్తూ బాంబే హైకోర్టు జూన్ 26న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జైనాబ్ అబ్దుల్ ఖయ్యూంతోపాటు మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠీ కాలేజీని నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కాలేజీ క్యాంపస్‌లో బొట్టుబిళ్ల, తిలకం ధరించడం కూడా నిషేధిస్తారా? అని ప్రశ్నించింది. హిజాబ్, బుర్ఖా వంటివి ధరించకుండా ఆంక్షలు విధిస్తే విద్యార్థినుల సాధికారత ఎలా సాధ్యమని నిలదీసింది.



'క్రీమీ లేయర్'పై బీజేపీ ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ క్రీమీ లేయర్‌కు రిజర్వేషన్ల ఫలాలు వర్తింపజేయకూడదని, క్రీమీ లేయర్‌ను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై బీజేపీ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. వారంతా శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై అభ్యంతరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాదటిని అమలు చేయొద్దంటూ వినతి పత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎవరికీ నష్టం జరగదని మోదీ హామీ ఇచ్చినట్టు అనంతరం వారు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, సాధికారతకు తాము కట్టుబడి ఉన్నామని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

గ్రామాల్లో మరో 2 కోట్ల ఇళ్లు

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్(పీఎంఏవై–జీ) పథకం కింద గ్రామాల్లో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. 2024–25 నుంచి 2028–29కాలానికి గ్రామాల్లో పీఎం ఆవాస్ యోజన అమలుపై గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–పట్టణ(పీఎంఏవై–యూ) పథకం కింద రూ.2.30 లక్షల కోట్ల సాయం అందించనున్నారు. ఉద్యానరంగంలో చీడపీడలు తగ్గించడం, మెరుగైన విత్తనాలను సృష్టించడం, పూలు, పండ్ల దిగుబడి పెంచడమే లక్ష్యంగా క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్(సీపీపీ)కి కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఉద్యానరంగంలో విప్లవాత్మక మార్పుల కోసం రూ.1,765.67 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఆ 'క్రీమీలేయర్' రాజ్యాంగంలో లేదు

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలుకు ఆస్కారం లేదని కేంద్రం వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల అమలు విషయంలో క్రీమీలేయర్ నిబంధన లేదని స్పష్టంచేసింది. తాజాగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో దీనిపై భేటీలో విస్తృతంగా చర్చ జరిగిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

సాక్షి
హైదరాబాద్

శనివారం । 10 । ఆగస్టు । 2024



డ్యాష్ క్యామ్‌లకు డిమాండ్
డ్యాష్ క్యామ్స్‌గా పిలిచే డ్యాష్ బోర్డు కెమెరాలకు డిమాండ్ పెరిగింది. నగరంలో వీటి వినియోగం ఇటీవల 30 శాతం పెరిగినట్లు కార్ డెకార్స్ వ్యాపారులు చెబుతున్నారు. -8లో



బస్సుల్లో బంగారం చోరీ
బస్సు ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ఆట కట్టించారు రాచకొండ పోలీసులు. రూ.1.26 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం పడవచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.

పోరాటాలతోనే సామాజిక న్యాయం

సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోరాటాల ద్వారానే సామాజిక న్యాయాన్ని సాధించుకోవాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివాసీలపై బ్రిటిష్ కాలం నుంచి నిర్బంధం కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో 'ఆదివాసీ హక్కులు–ప్రైవేటీకరణ–సంఘీభావ ఉద్యమాలు' అంశంపై జరిగిన అఖిల భారత సదస్సులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఆదివాసీల స్థావరాలపై కొనసాగుతున్న మారణ హోమంపై ప్రతి ఒక్కరూ స్పందించాలని తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. డ్రోన్‌లకు బాంబులను అమర్చి మానవులను చంపే అధికారం ఏ చట్టం ఇచ్చిందని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. దేశంలోని ఆదివాసీలు తమ అస్తిత్వం కోసం పోరాడుతున్నారని గుర్తు చేశారు. ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి మాట్లాడుతూ.. బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు లాంటి విప్లవ వీరుల వారసత్వాన్ని నేటి ఆదివాసీలు కొనసాగిస్తున్నారన్నారు. సదస్సులో పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, కల్పనా కన్నబీరన్, ప్రొఫెసర్ సరోజ్ గిరి తదితరులు ప్రసంగించారు.

యువతితో షీటీమ్ వాహన డ్రైవర్ అసభ్య ప్రవర్తన

కేసు నమోదు చేసిన పోలీసులు

మూసాపేట: మహిళలకు రక్షణ కల్పించే షీటీమ్ వృత్తిలో ఉంటూ.. ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఏఆర్ కానిస్టేబుల్, షీ టీమ్ డ్రైవర్‌పై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లో ఉంటున్న 36 ఏళ్ల నర్సింగ్ బాలానగర్ షీటీమ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి వివేకానందనగర్‌లోని బంధువు ఇంటికి దశదిన కర్మ కోసం నర్సింగ్ వెళ్లాడు. సెల్లార్‌లో మద్యం తాగుతూ అక్కడి బాత్‌రూంను ఉపయోగించుకున్నాడు. సెల్లార్‌లోనే ఇద్దరు యువతులు కిరాయికి ఉంటున్నారు. బాత్‌రూమ్ వాసన వస్తోందని సర్ఫ్ నీళ్లు చల్లడంతో నర్సింగ్ ఆ యువతులతో వాదనకు దిగాడు. మద్యం మత్తులో యువతిని చెంపపై కొట్టి, భుజంపై చేయి వేసి నెట్టి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖైరతాబాద్‌కు ఉపఎన్నికలొస్తే మనదే గెలుపు: కేటీఆర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తుందని, బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ నేతలతో శుక్రవారం ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ నియోజకవర్గానికి తప్పనిసరిగా ఉప ఎన్నిక వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకోసం కార్యకర్తలు సమాయత్తం కావాలని సూచించారు. కార్యక్రమంలో మన్నె గోవర్ధన్‌రెడ్డి, జెజ్జొల్ల రాజు ముదిరాజ్, కొమ్ము విజయ్‌కుమార్, విజయ్‌కృష్ణ, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నాంపల్లి: నగరాన్ని స్వచ్ఛమైన ఆకుపచ్చ నగరంగా మార్చాలన్న ధ్యేయంతో ముందుకెళ్తున్నామని, ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో కలిసి ఆమె కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగరంలో ఈ ఏడాది 50 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 13 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యూబీడీ అడిషనల్ కమిషనర్ సునంద, యూబీడీ మేనేజర్ శ్రీనివాస్, మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్ సీహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.









ఆదివాసీ.. దరువేసీ..

ఆదివాసీల సంప్రదాయ వాద్యాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కొమ్ముబూర, డప్పుల దరువులు, ఆటాపాటలతో బంజారాహిల్స్‌లోని కొమురంభీం ఆదివాసీ భవనం వద్ద సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గిరిజన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అమితంగా అలరించాయి.

శుద్ధికి సిద్ధం

రూ.65.06 కోట్లతో నాలుగు ఎస్టీపీల నిర్మాణం

జంట జలాశయాలపై మురుగునీటి శుద్ధి కేంద్రాలు
- ఇప్పటికే టెండర్లను ఆహ్వానించిన జలమండలి
- తొమ్మిది నెలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్ చరిత్ర సృష్టించేందుకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే మూసీ నదిపై మురుగు నీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణ పనులు చేపట్టగా.. తాజాగా జంట జలాశయాలపై సైతం నాలుగు ఎస్టీపీలను నిర్మించేందుకు జలమండలి సిద్ధమైంది. మహా నగరానికి తాగునీటిని అందించే జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లోకి మురుగునీరు చేరకుండా పకడ్బందీ చర్యలు చేపడుతోంది. రెండు జలాశయాలు పూర్తిగా మురికికూపంగా మారకముందే మురుగును శుద్ధి చేసి వాటిలో వదిలేందుకు చర్యలు చేపట్టింది. రూ. 65.06 కోట్ల అంచనా వ్యయంతో రోజువారీగా సుమారు 20 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యంతో నాలుగు ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే పాలనా పరమైన అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించింది. తొమ్మిది నెలల కాలపరిమితిలో పనులు పూర్తయ్యేలా చర్యలకు ఉపక్రమించింది.

ఎగువ ప్రాంతాల్లో..
జంట జలాశయాల ఎగువ ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీలను నిర్మించనున్నారు. ఉస్మాన్‌సాగర్ ఎగువన బుల్కాపూర్ నాలా సమీపంలో జన్వాడ వద్ద నాలుగు ఎంఎల్‌డీ సామర్థ్యంతో, హిమాయత్‌నగర్ వద్ద ఐదు ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీలను నిర్మించనున్నారు. హిమాయత్‌సాగర్ ఎగువన నాగిరెడ్డి గూడ వద్ద ఐదు ఎంఎల్‌డీ సామర్థ్యంతో, కాముని నాలా సంగమం వద్ద ఆరు ఎంఎల్‌డీ ఎస్టీపీలను నిర్మించనున్నారు.

ఇప్పటికే..
మహానగర పరిధిలో ఇప్పటికే సుమారు 48 శాతానికి పైగా మురుగు నీటి శుద్ధి ప్రక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 1950 ఎంఎల్‌డీ మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. 25 పాత ఎస్టీపీల ద్వారా ప్రతిరోజూ 772 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కొనసాగుతుండగా, మిగిలిన 878 ఎంఎల్‌డీ మురుగు నీటిని శుభ్రం చేసేందుకు 31 ఎస్టీపీల నిర్మాణ పనులు చేపట్టగా అందులో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఎస్టీపీల ద్వారా కూడా మురుగు నీటి శుద్ధి కొనసాగుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద 39 మురుగునీటి శుద్ధి కేంద్రాలు మంజూరు చేసింది. అవి అందుబాటులోకి వస్తే.. 972 ఎంఎల్‌డీల మురుగును శుద్ధి చేసేందుకు మార్గం సుగమమవుతుంది.

మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు ఇలా..

జలాశయం	ప్రాంతం	వ్యయం (రూ. కోట్లలో)	మురుగుశుద్ధి సామర్థ్యం
ఉస్మాన్‌సాగర్	జన్వాడ	13.88	4 ఎంఎల్‌డీ
ఉస్మాన్‌సాగర్	హిమాయతనగర్	17.17	5 ఎంఎల్‌డీ
హిమాయత్‌సాగర్	నాగిరెడ్డి గూడ	16.67	5 ఎంఎల్‌డీ
హిమాయత్‌సాగర్	కాముని నాలా	17.34	6 ఎంఎల్‌డీ



ఫ్లై ఓవర్ @ రేతిబౌలి

పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా..
- మెహిదీపట్నం– గచ్చిబౌలి వైపు..
- పాత పనుల బదులు కొత్త ప్రతిపాదన

సాక్షి, సిటీబ్యూరో: నానల్‌నగర్, రేతిబౌలి జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఇక్కట్లను తప్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించతలపెట్టిన రెండు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ పనులు కార్యరూపం దాల్చక పోవడంతో ప్రస్తుతం వాటి స్థానంలో ఒక ఫ్లై ఓవర్ నిర్మించాలనే యోచనలో ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఉంది. ఇందుకోసం సాధ్యాసాధ్యాలు, అంచనా వ్యయం, సమగ్ర ప్రాజెక్టు నివేదిక కోసం జీహెచ్ఎంసీ కన్సల్టెంట్ సంస్థను ఎంపిక చేయనుంది. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ)లో భాగంగా 2017లో దాదాపు రూ.170 కోట్ల అంచనా వ్యయంతో రెండు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ పనులకు అప్పటి ప్రభుత్వం టెండర్లను ఆమోదించింది. మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనదారుల సదుపాయార్థం నానల్‌నగర్ టి జంక్షన్ దగ్గర 470 మీటర్ల పొడవున మూడు లేన్లతో వన్‌వే అండర్‌పాస్, ఒక ఫ్లై ఓవర్, అత్తాపూర్ జంక్షన్ నుంచి మెహిదీపట్నం వైపు దాదాపు కిలోమీటర్ పొడవున మరో ఫ్లై ఓవర్ నిర్మించాల్సి ఉండగా.. పనులు ముందుకు కదలలేదు. అండర్‌పాస్ పనుల కోసం అక్కడ భూగర్భంలో ఉన్న యుటిలిటీస్ షిఫ్టింగ్ కష్టసాధ్యంగా మారడంతో ఆ పనితో పాటు ఫ్లై ఓవర్ల పనులు ముందుకు సాగలేదు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా రెండో వరుసలో నిర్మించాలనుకున్నారు. ఆ పనులతో మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లేవారికి ఎంతో సదుపాయం కలుగుతుందని భావించారు.

ట్రాఫిక్ రద్దీతో..
నానల్‌నగర్, రేతిబౌలి జంక్షన్ల దగ్గర ట్రాఫిక్ రద్దీ తీరని సమస్యగా మిగలడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు తిరిగి ఆ జంక్షన్లపై దృష్టి సారించారు. గతంలో ప్రతిపాదించిన అండర్‌పాస్ దాదాపుగా అసాధ్యమనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అక్కడ నగరానికి తాగునీరు అందించే మంజీరా పైప్‌లైన్ ఉండటం తదితర కారణాలతో ఆ ఆలోచన విరమించుకొని దాని స్థానంలో మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లేవారి కోసం పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగానే ఒక ఫ్లై ఓవర్‌ను నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలు, సమగ్ర నివేదికకు కన్సల్టెంట్‌ను నియమించనున్నారు. ఈ ఫ్లై ఓవర్ టోలిచౌకి ఫ్లై ఓవర్‌కు ముందుగా ముగియనున్నట్లు సమాచారం. నగరంలోని నాంపల్లి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల నుంచి మెహిదీపట్నం మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లే వారికి ఇది సదుపాయంగా ఉండనుంది. ఈ ఫ్లై ఓవర్ వన్‌వేనా లేక టూవేగా నిర్మించాలా అనేది కన్సల్టెంట్ నివేదికలో తెలియనుంది.

కూకట్‌పల్లి వై జంక్షన్ సైతం..
కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యకు సైతం చెక్ పెట్టేందుకు సైతం ఫ్లై ఓవర్ నిర్మాణానికి కన్సల్టెంట్ సేవలు పొందనున్నారు. ఆ సమస్య పరిష్కారం కోసం దాదాపు పదేళ్ల క్రితం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రెండు ఫ్లై ఓవర్లు నిర్మించాలనుకున్నారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో మూసాపేట నుంచి డా.బీఆర్ అంబేడ్కర్ మెట్రో స్టేషన్ (బాలానగర్) వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి కన్సల్టెంట్‌ను నియమించనున్నారు.

కారుతో ఢీకొట్టి.. తుపాకీతో కాల్చి..

రౌడీ షీటర్ దారుణ హత్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్



రియాజుద్దీన్ (ఫైల్)

పహాడీషరీఫ్: బైక్‌పై వెళ్తున్న రౌడీషీటర్‌ను గుర్తు తెలియని దుండగులు కారుతో ఢీ కొట్టి.. కళ్లలో కారం చల్లి.. తుపాకీతో కాల్చి.. కత్తులతో నరికి చంపిన దారుణ ఘటన బాలాపూర్ పీఎస్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ షరీఫ్‌నగర్‌లో నివాసం ఉండే రియాజుద్దీన్ అలియాస్ మెంటర్ రియాజ్ (45) లలితాబాగ్ రక్షాపురంలో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి రాయల్ కాలనీలో జరిగిన ఓ విందుకు హాజరై.. స్నేహితుడు నజీర్‌తో కలిసి బాలాపూర్‌లోని వైన్స్‌లో మద్యం తాగారు. అనంతరం రాత్రి 10.30 గంటలకు నజీర్ ఇంటికి వెళ్లగా, రియాజ్ తన బైక్‌పై షరీఫ్‌నగర్‌కు బయల్దేరాడు. ఆర్సీఐ రోడ్డులో 'మంచి' స్కూల్ వద్దకు రాగానే ముందస్తు పథకంలో భాగంగా వెనక నుంచి కారులో వచ్చిన దుండగులు బైక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో రియాజ్ కింద పడిపోగా.. కళ్లలో కారం చల్లి, తుపాకీతో ఛాతీలో ఒక రౌండ్ కాల్పులు జరిపారు. అయినప్పటికీ కొన ఊపిరితో ఉన్నాడని భావించి కత్తులతో తల, ఛాతీ భాగాల్లో ఇష్టానుసారంగా పొడిచారు. వచ్చిన కారులోనే పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత వాహనదారుల ద్వారా సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా.. రక్తపు మడుగులో పడి ఉన్న రియాజ్ అప్పటికే మృతి చెందాడు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు భూపతి, గురువారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్యకు వినియోగించిన బుల్లెట్ షెల్‌తో పాటు ఐరన్ రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంతో శాంపిల్స్ సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పాత కక్షల కారణంగానే హత్య జరిగి ఉంటుందని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని సీపీ తెలిపారు. రియాజ్‌తో పాటు మద్యం తాగిన నజీర్ ఇచ్చిన పక్కా సమాచారంతోనే నిందితులు వెంబడించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రూ.3,16,795.55 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా 2024–25 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక రూ.3,16,795.55 కోట్లతో ఖరారైంది. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బ్యాంక్ అధికారులతో కలిసి వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు రూ.65,736.57 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2,51,058.98 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలు, గ్రౌండింగ్‌ను సమీక్షించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విద్యా రుణాలు రూ.1,108.88 కోట్లు లక్ష్యం కాగా రూ.30.38 కోట్లు మాత్రమే అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు తక్షణమే నిరుపేదలకు విద్యా రుణాలు అందించాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్‌లో ప్రాధాన్యత రంగం లక్ష్యం రూ.65,736.59 కోట్లు కాగా జూన్ 2024 నాటికి రూ.40,610.60 కోట్లు సాధించినట్లు తెలిపారు. ప్రాధాన్యేతర రంగం లక్ష్యం రూ. 2,51,059.04 కోట్లు లక్ష్యం కాగా రూ.1,02,943.66 కోట్ల లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు రూ.59,758.43 కోట్ల రుణాలు లక్ష్యం కాగా ఈ ఏడాది జూన్ నాటికి రూ. 32,878.25 కోట్ల లక్ష్యం సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాంకులు నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రుణాలను అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, నాబార్డ్ డీడీఎం పి.హర్ష రఘురాం, ఎల్డీఎం జీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



2024-25 వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ అనుదీప్, బ్యాంకర్లు

పీర్జాదిగూడ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

కాంగ్రెస్ ఖాతాలో మరో నగర పాలక సంస్థ


మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిందని కీసర ఆర్డీఓ, ప్రొసీడింగ్ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తన పదవిని కోల్పోయారని ఆయన తెలిపారు. శుక్రవారం క్యాంప్‌లో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లు బస్సులో నేరుగా 10.30 గంటలకు పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. గేటు వద్దనే అధికారులు కార్పొరేటర్ల పేర్లు చదివి వారిని మాత్రమే లోపలకు అనుమతించారు. కార్పొరేటర్లు నేరుగా కౌన్సిల్ సమావేశం హాల్‌లోకి వెళ్లి కూర్చున్నారు. ప్రొసీడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. పీర్జాదిగూడలో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది కార్పొరేటర్లు ఓటేశారు. మేయర్‌తో పాటు మరో నలుగురు కార్పొరేటర్లు గైర్హాజరు కావడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లయింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర జంగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్, బోడుప్పల్ నగర పాలక సంస్థలను కాంగ్రెస్ ఇప్పటికే హస్తగతం చేసుకుందని గుర్తు చేశారు.



కాంగ్రెస్ కార్పొరేటర్లతో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తదితరులు

గొంతు మార్చి.. ఏమార్చి!

మ్యాట్రిమోనిలో నకిలీ ప్రొఫైల్స్‌తో మోసం
- ఇద్దరిని అరెస్టు చేసిన రాచకొండ సైబర్ కాప్స్



సాక్షి, సిటీబ్యూరో: వాయిస్ ఛేంజ్ ఫీచర్ సాంకేతికతతో అమ్మాయిల గొంతులాగా మాట్లాడుతూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరస్తులను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన కోమలి సూర్య ప్రకాశ్, శెట్టి సతీష్‌లు ఇంటర్నెట్ నుంచి అమ్మాయిల ఫొటోలను డౌన్‌లోడ్ చేసి నకిలీ పేరు, ఇతరత్రా వివరాలతో మ్యాట్రిమోనీ సైట్లలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నకిలీ ప్రొఫైల్స్‌ను మ్యాట్రిమోనిలో అబ్బాయిలకు పంపించేవారు. తీయని మాటలతో వాట్సాప్ చాట్‌లు, ఫోన్లు మాట్లాడుతుండేవారు. కొద్ది రోజుల తర్వాత పెళ్లి ప్రస్తావన తీసుకొస్తుంటారు. బాధితుల కుటుంబ వివరాలు, ఫొటోలను వాట్సాప్ ద్వారా సేకరించేవారు. తల్లిదండ్రులకు అనారోగ్యం, చదువుల ఫీజులు, వ్యాపారంలో నష్టాలు అంటూ రకరకాల కారణాలు చెప్పి డబ్బులు వసూలు చేసేవారు. ఈ క్రమంలో రూ.13.27 లక్షలు మోసపోయిన బాధితులు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం ఇద్దరు నిందితులు సూర్య ప్రకాశ్, సతీష్‌లను అరెస్టు చేశారు. ఇప్పటివరకు ఈ నిందితులు రామగుండం ఎన్టీపీసీ, సైబరాబాద్, రాచకొండ సైబర్ క్రైమ్ ఠాణాల పరిధిలోని పలువురు బాధితుల నుంచి ఇదే తరహాలో రూ.33.68 లక్షలు మోసం చేశారు.

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం.. తీవ్ర ట్రాఫిక్ జామ్

రాజేంద్రనగర్: కారుకు మరమ్మతులు చేస్తుండగా.. వెనక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ ఘటనతో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వెళ్తున్న కారు ఫిష్ బిల్డింగ్ వద్దకు రాగానే మరమ్మతుకు గురైంది. దీంతో కారు యజమాని మెకానిక్‌ను రప్పించి మరమ్మతులు చేయిస్తున్నాడు. ఈ సమయంలో శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వెళ్తున్న ఇన్నోవా కారు వెనుక నుంచి వచ్చి మరమ్మతులకు గురైన కారును బలంగా ఢీకొంది. ఇన్నోవా కారు బలంగా ఢీకొట్టడంతో మరమ్మతులకు గురైన కారు ఎక్స్‌ప్రెస్‌వే ప్రహరీకి అతుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారు మెకానిక్‌తో పాటు వాహన యజమాని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం సంభవించడంతో పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలను నిలిపివేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఎస్సై భానుమతి తెలిపారు.



పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాద దృశ్యం



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

బస్సుల్లో బంగారం చోరీ

ప్రయాణికుల బ్యాగుల్లోంచి ఆభరణాల దొంగతనం

- టీ, టిఫిన్ కోసం బస్సు ఆగితే లోపలికి ఎక్కి చోరీ
- అంతర్రాష్ట్ర నిందితుడు సోనూ ఠాకూర్ అరెస్టు
- రూ.1.26 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: బస్సులలో ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. రూ.1.26 కోట్ల విలువైన 1,832 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని..కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఆయా వివరాలను యాదాద్రి- భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్ చంద్రతో కలిసి కమిషనర్ సుధీర్‌బాబు శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు.

బస్సు ఆపితే అంతే..

ముంబైకు చెందిన ఏడీ జ్యూవెలరీస్ సంస్థ సేల్స్ మేనేజర్ గత నెల 26న ముంబై నుంచి ఏపీకి 2.1 కిలోల బరువైన వివిధ రకాల బంగారు ఆభరణాలను డెలివరీ చేసేందుకు ఉద్యోగి పురోహిత్ భరత్ కుమార్‌కు ఇచ్చాడు. అతను ముంబై శివారు ప్రాంతమైన చునాభట్టి వద్ద ఆరెంజ్ ట్రావెల్స్ (ఏపీ02 ఏ9687) బస్సు ఎక్కాడు. ఈ బస్సు మర్నాడు ఉదయం 9:30 గంటలకు చౌటుప్పల్‌లోని ధర్మోజిగూడెంకు చేరుకుంది. అక్కడ అల్పాహారం కోసం డ్రైవర్ బస్సు ఆపాడు. దీంతో భరత్ కుమార్ ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను బస్‌లో పెట్టి, టీ తాగేందుకు బస్ దిగాడు. 20 నిమిషాల తర్వాత మళ్లీ బస్సు ఎక్కి పరిశీలించగా బ్యాగ్ కనిపించలేదు. దీంతో వెంటనే ఈ విషయాన్ని సంస్థకు తెలియజేయగా..సేల్స్ మేనేజర్ శ్రీకునాల్ కొఠారీ చౌటుప్పల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో గాలించారు. సాంకేతిక ఆధారాలు సేకరించి చౌటుప్పల్‌లోని మల్కాపూర్‌లో నిందితుడు మధ్యప్రదేశ్‌కు చెందిన సోని ఠాకూర్‌ను పట్టుకున్నారు. రూ.1.26 కోట్ల విలువ చేసే 1,832 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు అలీ ఖాన్, అస్లాంలు పరారీలో ఉన్నారు. ముంబై నుంచి వచ్చే బస్సుల్నే ఈ ముఠా టార్గెట్ చేసి..బస్సులు ఆపగానే చోరీలకు పాల్పడుతోందని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన గూడ్స్ ఆటో

ఇద్దరికి గాయాలు



మైలార్‌దేవ్‌పల్లి: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును గూడ్స్ ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన వెంకయ్య తన అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటోలో డ్రైవర్ లింగయ్యతో కలిసి శుక్రవారం గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు వచ్చారు. ఇక్కడి నుండి కూరగాయలు తీసుకొని తిరుగు ప్రయాణంలో పల్లెచెరువు వద్ద ఆగి ఉన్న రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీకొట్టారు. దీంతో బస్సు అద్దాలు, గూడ్స్ ఆటో ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా..ఆటో యజమాని వెంకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానిక హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ జంగోజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో 502 దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ గోడును విన్నవించుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ, రెవెన్యూపరమైన సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మొత్తం 502 దరఖాస్తులు అందాయి. వీటిలో ఒక్క రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించినవే 112 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

బెయిల్ పిటిషన్ తిరస్కరణ

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు ఎదురుదెబ్బ తగులుతూనే ఉన్నది. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం నాంపల్లి కోర్టు మరోసారి తిరస్కరించింది. నిందితుల తరుపు న్యాయవాది ఉమా మహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. నాంపల్లి 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య వాదనలు విన్నాక బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు.

'డ్యాష్ క్యామ్'లకు డిమాండ్

తేలికపాటి, భారీ వాహనాలకు డ్యాష్ బోర్డుల వద్ద కెమెరాల ఫిక్సింగ్

- ఇటీవల వీటిని ఎక్కువగా వినియోగిస్తున్న యజమానులు
- కొన్ని ప్రమాదాల్లో కీలక ఆధారాలుగా మారుతున్న ఈ ఫీడ్
- పార్కింగ్ మోడ్‌లో పని చేసేవీ బిగించుకోవాలి: నిపుణులు

2016 ఫిబ్రవరి 21.... కుషాయిగూడలోని పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డు...ఏపీ 29 జీటీ 6615 లారీ వల్ల జరిగిన ప్రమాదంలో నల్లగొండ జిల్లా చీకటిమామిడికి చెందిన భూపతి మధుసూదనరావు చనిపోయారు. అది ప్రమాదం కాదంటూ లారీ డ్రైవర్ నెత్తి నోరు బాదుకున్నారు. ఘటనాస్థలికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను అధ్యయనం చేసిన పోలీసులు..మధుసూదనరావు ఆత్మహత్య చేసుకున్నట్లు తేల్చారు.

–సాక్షి, సిటీబ్యూరో





కుషాయిగూడ ఘటన దృశ్యాలు(ఫైల్)

ఈ ఉదంతం చోటు చేసుకున్న చోట సీసీ కెమెరాలు లేకపోతే..! 'ఆనవాయితీ' ప్రకారం లారీ డ్రైవర్ కేసు విచారణను ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇలాంటి వాటితో పాటు డ్రైవర్లకు ఎదురయ్యే ఎన్నో సమస్యలకు పరిష్కారంగా అందుబాటులోకి వచ్చినవే డ్యాష్ క్యామ్స్‌గా పిలిచే డ్యాష్ బోర్డు కెమెరాలు. నగరంలో వీటి వినియోగం ఇటీవల కాలంలో 30 శాతం పెరిగినట్లు కార్ డెకార్స్ వ్యాపారులు చెబుతున్నారు.

ఉదంతాలతో పాటు మోసాలు ఎన్నో...

కుషాయిగూడలో జరిగిన మధుసూదన్ రావు తరహా ఉదంతాలతో పాటు ప్రమాదాల పేరుతో కొందరు చేసే మోసాలు అనునిత్యం చోటు చేసుకుంటున్నాయి. తమ వారిని ఉద్దేశపూర్వకంగా వాహనాలకు ఎదురుగా, పక్కన నుంచి సమీపంలోకి పంపించే వాళ్లు ఉన్నారు. ఇలా వెళ్లిన వాళ్లను ఆ వాహనాలు తాకితే చాలు తక్షణం కింద పడిపోతారు. అక్కడే ఉండే వారి సంబంధీకులు యాక్సిడెంట్ అంటూ హడావుడి చేస్తారు. మరికొన్ని ముఠాలైతే నిర్మానుష్య, రద్దీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాలను ఆపుతున్నారు. ఫలానా చోట యాక్సిడెంట్ చేసి, పట్టించుకోకుండా వచ్చేస్తున్నావంటూ డ్రైవర్లను మోసం చేస్తున్నారు. ఈ రెండు తరహాలకు చెందిన వారి ప్రధాన ఉద్దేశం..బెదిరించి డబ్బు గుంజడమే.

హైఎండ్ వాహనాలకు ఇన్‌బుల్ట్‌గా...

కీలక సందర్భాల్లో వినియోగించడంతో పాటు ఇలాంటి వారికి చెక్ చెప్పడానికి ఉద్దేశించినవే డ్యాష్ క్యామ్‌లు. ఇటీవల అనేక హైఎండ్ వాహనాల్లో నలు వైపులా దృశ్యాలను రికార్డు చేయడానికి ఉద్దేశించిన కెమెరాలు ఇన్‌బుల్ట్‌గానే వస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం ఖరీదు చేసిన వాటితో పాటు పాత మోడల్స్‌కు చెందిన, సాధారణ వాహనాలను మాత్రం కేవలం వెనుక వైపు మాత్రమే కెమెరా ఉంటోంది. కొన్నింటిలో అసలు కెమెరానే ఉండట్లేదు. దీనివల్ల జరుగుతున్న నష్టాన్ని పరిగణలోకి తీసుకున్న అనేక కంపెనీలు ఈ డ్యాష్ క్యామ్‌లు అందుబాటులోకి తీసుకువచ్చాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు... ఏది పెద్ద వాహనమైతే దాని చోదకుడిదే తప్పు అన్నట్లు నమోదు చేసే 'ఆనవాయితీ' ఏళ్లుగా కొనసాగుతోంది. దీనికి ఈ డ్యాష్ క్యామ్స్ చెక్ చెబుతున్నాయి.

డ్యాష్ క్యామ్స్ వల్ల ఉపయోగాలు ఎన్నో...

ఇటీవల కాలంలో వాహన చోదకులు వినియోగిస్తున్న డ్యాష్ క్యామ్స్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఏదైనా ఉదంతం జరిగినప్పుడు ఆద్యంతం ఏమి జరిగిందో ఈ వీడియో రుజువులను అందిస్తుంది. తప్పు ఎవరిది అనేది నిర్ధారించడంలో, బీమా క్లెయిమ్‌లను పొందడానికి ఉపయోగపడుతుంది. వాహనాలను యజమానులకు అప్పగించినప్పుడు వారి ప్రవర్తన తదితరాలను ఎప్పటికప్పుడు యజమానికి తెలిసేలా చేస్తుంది. పార్కింగ్ మోడ్‌లోనూ పనిచేసే కెమెరాల వల్ల హిట్-అండ్-రన్ కేసుల్లో కీలక సాక్ష్యాలు లభిస్తాయి. కొత్త డ్రైవర్లు వారి నైపుణ్యాలను మెరుగుపరచడంలోనూ వీటిలో నమోదైన ఫీడ్ కీలకపాత్ర పోషిస్తుంది. కొన్ని బీమా కంపెనీలు డాష్ క్యామ్‌లు ఉన్న వాహనాలకు ప్రీమియంల్లో డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నాయి.

పార్కింగ్ మోడ్‌లో పని చేసేవీ వాడాలి

ఈ డ్యాష్ క్యామ్ వాహనం డ్యాష్ బోర్డ్ లేదా విండ్‌షీల్డ్ పైన, రియర్ వ్యూ మిర్రర్ పక్కన/కింద ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. వీటిలో ప్రధానంగా రెండు రకాలు ఉన్నట్లు కోఠికి చెందిన కార్ డెకార్స్ నిపుణులు సయ్యద్ ముస్తాక్ చెప్తున్నారు. కొన్ని కేవలం ఇంజన్ ఆన్‌లో ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. వీటి వల్ల వాహనం పార్క్ చేసి ఉన్నప్పుడు చోటు చేసుకునే ఉదంతాల్లో ఉపయోగం ఉండదు. ఈ నేపథ్యంలోనే బ్యాటరీ ఆధారంగా వాహనం పార్కింగ్ చేసి ఉన్నప్పుడూ పని చేసేవి బిగించుకోవాలని సూచిస్తున్నారు. నిర్దీత స్టోరేజ్ కెపాసిటీ, మంచి క్వాలిటీ ఉన్న వీడియోను అందించే వాటికే మొగ్గు చూపాలని స్పష్టం చేస్తున్నారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

నల్లకుంట: ఓయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వృత్తి నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆఫీస్ ఆటోమేషన్, టాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి డాక్టర్ బి.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా పేజ్ మేకింగ్, ఫొటో షాప్, కోరల్ డ్రా, గ్రాఫిక్ డిజైనింగ్,' సి' లాంగ్వేజ్, పైతాన్, పేపర్ మేకింగ్, హెర్బల్ ప్రొడక్ట్స్, ఫ్యాషన్ జ్యూవెలరీ, టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, స్పోకెన్ ఇంగ్లీషు తదితర కోర్సుల్లో కూడా శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 99512 10441/97010 98541 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

నగరంలో నేడు..

- శ్రీ విజయ నాట్యనికేతన్ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 33వ వార్షికోత్సవ వేడుకలు లక్డీకాపూల్‌లోని రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు జరుగుతాయి.
- సాలార్ జంగ్ మ్యూజియం, శిఖాస్ సంయుక్తాధ్వర్యంలో పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం వెస్ట్ బ్లాక్‌లో సాయంత్రం 4 గంటలకు ఆర్ట్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో స్కూల్ రేడియో వర్క్‌షాప్ జరుగుతుంది.
- నల్సార్ యూనివర్శిటీలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లా అండ్ జస్టిస్ ఇన్ ఇండియా అంశంపై సదస్సు జరుగుతుంది.

తొమ్మిదోసారి...

- జలమండలి ఈడీ పదవీ కాలం మరోసారి పొడిగింపు
- పదవీ విరమణ చేశాక.. కీలక పోస్టులో 8 ఏళ్లుగా ఒకే అధికారి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సత్యనారాయణ పదవీ కాలం మరో ఏడాది పొడిగించారు. పదవీ విరమణ చేసినా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆయన పదవీ కాలం..తొమ్మిదో సంవత్సరం కూడా ప్రభుత్వ పొడిగించింది. 2016లో ఈడీగా పదవీ విరమణ చేసిన సత్యనారాయణ..పొడిగింపు మీద ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగుతూ వస్తున్నారు. జూలై నెలాఖరుతో పదవీ కాలపరిమితి ముగియగా ,తాజాగా మరో ఏడాది పొడిగిస్తూ మున్సిపల్ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పదవీ విరమణ చేసి విధుల్లో కొనసాగుతున్న ఉన్నతాధికారులందర్నీ ఇంటికి పంపించగా, జలమండలిలో మాత్రం సీన్ మారలేదు. ఈడీ పదవీ కాలాన్ని పొడిగించడం విస్మయానికి గురిచేస్తోంది. జూన్ నెలలోనే అప్పటి జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఈడీ పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగింపు కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికి మొన్నటి వరకు ఫైల్ పెండింగ్‌లో ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటలో ఉన్న సమయంలో దస్త్రంపై సంతకమై..పొడిగింపు ఆదేశాలు వెలువడటం పలు అనుమానాలకు తావిస్తోంది. పదవీకాలం పొడిగింపుపై జలమండలి అధికారులు, ఇంజనీర్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వాస్తవంగా జలమండలి ఎండీ, ఈడీ పోస్టుల్లో ఐఏఎస్ అధికారులను నియమించాల్సి ఉంటుంది. కానీ. ఇంజనీర్-ఇన్-చీఫ్ స్థాయి అధికారి కొనసాగడం పలు విమర్శలకు తావిస్తోంది.

నాలాల్లో దోమల వ్యాప్తిని అరికట్టాలి: ఆమ్రపాలి

లక్డీకాపూల్: నగరంలో వరద నీటి కాలువల్లో నీరు నేరుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి ఆదేశించారు. నాలాల్లో నీటి నిలువ వల్ల దోమల బ్రీడింగ్‌కు అవకాశం ఉందన్నారు. అలాంటి సందర్భంల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పూడిక తీత చేపట్టాలని అధికారులకు సూచించారు. శుక్రవారం జోనల్, అడిషనల్ కమిషనర్లతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్టార్మ్ వాటర్ డ్రైన్, మూసీ నదిలో వరద నీరు నేరుగా వెళ్లలేక పోవడం మూలంగా నిల్వ ఉండిపోతున్నాయన్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని చెప్పారు. సీఆర్ఎంపీ ద్వారా చేపట్టిన బీటీ రోడ్ల నిర్వహణకు సంబంధించి త్వరలో అగ్రిమెంట్ పూర్తవుతున్నందున..ఇంకా మిగిలిన పనులను సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ముఖ్యంగా ఫుట్ పాత్, సెంట్రల్ మీడియన్, కర్బ్ లైన్, లైన్ మార్కింగ్ పనులను అన్ని జోనలలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

జోయాలుక్కాస్‌లో డైమండ్ జ్యువెలరీ షో



డైమండ్ జ్యువెలరీ షోను ప్రారంభిస్తున్న సీఎండీ జోయ్ అలుక్కాస్ తదితరులు

చందానగర్: కొండాపూర్‌లోని జోయాలుక్కాస్ షోరూంలో డైమండ్ జ్యువెలరీ షో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం డైమండ్ జ్యువెలరీ ప్రదర్శన తమ పనితనానికి, నిబద్ధతకు నిరూపణంగా నిలిచిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని డైమండ్ కలెక్షన్స్ తమ షోరూంలో లభిస్తున్నాయన్నారు. అన్‌కట్, ప్రెషస్ జ్యువెలరీ డైమండ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ప్రజలందరు కోరుకునే కలెక్షన్లు సరసమైన ధరలకు, నాణ్యమైన బంగారం, డైమండ్స్ అందిస్తున్నామన్నారు. రూ.లక్ష..అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యువెలరీ కొనుగోలుతో ఉచితంగా 1 గ్రాము గోల్డ్ కాయిన్ అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ ఈ నెల 9 నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు ఉందన్నారు.

త్వరలో ఆర్టీసీ బాండ్ల డబ్బులు చెల్లిస్తాం: మంత్రి పొన్నం



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో ఆర్టీసీ కార్మికులకు బాండ్ల డబ్బులు రూ.200 కోట్లు చెల్లిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం టీజీఎస్‌ఆర్టీసీ ఎస్ డబ్ల్యూయూ(ఐఎన్టీయూసీ) ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ సయ్యద్ మహమూద్ ఆధ్వర్యంలో కార్మికుల బృందం మంత్రిని కలిసి రావాల్సిన బాండ్ డబ్బులు, ప్రభుత్వంలో విలీనం తదితర సమస్యలను వివరించారు. రుణ మాఫీ కార్యక్రమం పూర్తి కాగానే బాండ్ల డబ్బులు, మహాలక్ష్మి నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీచ్చారు. ఆర్టీసీ విలీన ప్రక్రియకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అడిషనల్ గ్రాంట్స్ అతి త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు. గుర్తింపు ఎన్నికలపై ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన బృందంలో యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ గౌడిశాల అబ్రహం, రాష్ట్ర నాయకులు జక్కుల మల్లేశం, కల్పనా, జయ. సంజీవలు ఉన్నారు.

అగ్నిప్రమాద కారకాలపై సమాచారం ఇవ్వండి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నివాస గృహాల్లో తరచూ జరుగుతున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో నివారణ చర్యలకు హైడ్రా సిద్ధమైంది. హైడ్రా పరిధిలోని ఇళ్ల మధ్య ప్రమాదకర వస్తువుల్ని అనధికారికంగా, అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిస్తే హైడ్రా టోల్ ఫ్రీ నెంబర్ 18005990099కు గానీ లేదా 040-29560509, 040-29560596, 040-29565758, 040-29560593 లాండ్‌లైన్ నెంబర్లకు గానీ, వాట్సాప్ నెంబర్ 9000113667కు గానీ సమాచార మందించాల్సిందిగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ భవనంలోనైనా ప్రమాదకర కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా సమాచారం అందించాల్సిందిగా పేర్కొన్నారు. కమిషనర్‌ను వ్యక్తిగతంగా కలిసి ఫిర్యాదు చేయాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 7207923085 నెంబర్‌కు మెసేజ్ మాత్రం చేసి అపాయింట్‌మెంట్ పొందాలని సూచించారు. అపాయింట్‌మెంట్ కోసం కాల్ చేయవద్దని తెలిపారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం



సాక్షి, సిటీబ్యూరో: పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేసే విధంగా ప్రోత్సహించేందుకు 'హర్ ఘర్ తిరంగ 3.0' కింద పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయాన్ని ప్రారంభించినట్లు తెలంగాణ పోస్టల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్.శరత్‌కుమార్ వెల్లడించారు. పోస్టాఫీసులతోపాటు ఆన్‌లైన్ ద్వారా కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఐదు ఫ్లాగ్‌ల వరకు కొనుగోలు చేయవచ్చని, బుక్ చేసిన ఫ్లాగ్‌లను అదనపు చార్జీలు లేకుండా ఆయా చిరునామాలకు పంపడం జరుగుతుందన్నారు.

మ్యూజియంలో నేటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు మ్యూజియం పరిపాలన అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సాలార్జంగ్ మ్యూజియం, శిఖాస్, కళావీర, సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

వీధులు స్వచ్ఛంగా.. పార్కులు పచ్చగా...

• ఖైరతాబాద్ డివిజన్‌లో ముమ్మరంగా స్వచ్ఛదనం..పచ్చదనం • ఆఖరి రోజున పార్కుల్లో మొక్కలు నాటిన కాలనీవాసులు
• వీధుల్లో చెత్త తొలగింపు • కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 మిథిలానగర్‌లో..

బంజారాహిల్స్: వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలు, భవన నిర్మాణ సామాగ్రిని తొలగించి..పార్కులు, ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు పకడ్బందీ ప్రణాళికతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆఖరు రోజైన శుక్రవారం కాలనీవాసులు, బస్తీవాసులు, ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పెద్ద ఎత్తున పార్కుల్లో మొక్కలు నాటారు.

◆ బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద అధికారులు వాకర్లకు మొక్కలు పంపిణీ చేశారు. ఉద్యాన, అటవీశాఖలు సంయుక్తంగా జీహెచ్ఎంసీతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టాయి.

◆ ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్, నవనిర్మాణ్‌నగర్‌లలో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, సర్కిల్-18 ఏఎంసీ సంజయ్‌సింగ్‌లు పాల్గొని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు.

◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు.

◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని మిథిలానగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జీహెచ్ఎంసీ యూబీడీ అధికారి బాలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు.

◆ శ్రీనగర్‌కాలనీలోని పార్కులో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ సాయిప్రసాద్, సుబ్బారెడ్డి, శ్రీమన్నారాయణ, శంకర్‌రెడ్డి తదితరులు మొక్కలు నాటారు.

◆ శుక్రవారం ఒక్కరోజే ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని పార్కులు, ఖాళీ స్థలాల్లో జీహెచ్ఎంసీ, హార్టికల్చర్, కార్పొరేటర్లు, నేతలు, అధికారులు కలిసి వేర్వేరు చోట్ల 2,000లకు పైగా మొక్కలు నాటారు.

◆ ఐదు రోజుల్లో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో పది వేలకు పైగా మొక్కలు నాటారు. ఇదిలా ఉండగా వీధుల్లో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై గత కొన్నాళ్లుగా పేరుకుపోయిన చెత్తా చెదారం, చెట్ల కొమ్మలు, వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రతిరోజూ కేటాయించిన లారీల్లో 25 ట్రిప్పుల చొప్పున చెత్తను తొలగించారు. ఐదు రోజుల్లో సుమారుగా 150 లారీల చెత్తను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.


కేబీఆర్ పార్కు వద్ద వాకర్లకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు


ఫిలింనగర్ పార్కులో..


శ్రీనగర్‌కాలనీ పార్కులో..

అక్రమ నిర్మాణాలపై 'హైడ్రా' కమిషనర్ తనిఖీలు


నందగిరి లేవుట్‌లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నందగిరి లేఅవుట్ ప్రాంతాన్ని శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. మూడు రోజుల క్రితం నందగిరి లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను కూల్చివేశారు. ఇదిలా ఉండగా స్థానికుల ఫిర్యాదు మేరకు మరోమారు ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్ స్థలాల విషయంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీ ఏర్పాటు కంటే ముందు నుంచి ఇక్కడ నివసిస్తున్న తమకు పట్టాలు ఇవ్వాలని పక్కనే ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు కోరారు. వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీనిచ్చారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వెంకటేశ్వరకాలనీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. పచ్చదనం, స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాక్‌వేలో మొక్కలు నాటారు.వాకర్లకు, సందర్శకులకు మొక్కలు పంపిణీ చేశారు. త్వరలోనే డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు.

హెల్త్ హబ్‌గా తెలంగాణ


ఏషియన్ ఈఎన్‌టీ సెంటర్ ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

పంజగుట్ట: భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రధాన ఆరోగ్య గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని వివేకానంద ఆసుపత్రిలో ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని టెక్నాలజీ, వైద్య సేవలను పరిశీలించారు. ఏషియన్ ఈఎన్‌టీ కేర్ సెంటర్, వివేకానంద క్లీనిక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిలో చెవి, ముక్కు, గొంతు సమస్యలన్నింటికీ చికిత్స అందిస్తారని ఏషియన్ ఈఎన్‌టీ సెంటర్ వ్యవస్థాపక చైర్మన్, చీఫ్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ చావా ఆంజనేయులు తెలిపారు. ఈఎన్‌టీ, కార్డియాలజీ, రిహాబిలిటేషన్ అన్ని విభాగాల డాక్టర్లతో పాటు డయాగ్నస్టిక్స్, ఎమర్జెన్సీ సేవలు, ఎండోస్కోపిక్, నావిగేషన్, లేజర్ శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ నటుడు మురళీమోహన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, టీపీసీసీ ప్రధానకార్యదర్శి విజయారెడ్డి, టీవీ నటుడు కార్తీక్, వివేకానంద ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ గీత పాల్గొన్నారు.

శ్రమదానం..సన్మానం..

రహమత్‌నగర్: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో చివరి రోజైన శుక్రవారం రహమత్‌నగర్, బోరబండ డివిజ న్ లలో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసీయుద్దీన్ జీహెచ్ఎంసీ, పోలీసులు అధికారులకు సన్మానించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.హెచ్ఎఫ్‌నగర్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన శ్రమదాన కార్యక్రమంలో సీఎన్ రెడ్డి పాల్గొన్నారు. బోరబండ డివిజన్‌లో కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ పాఠశాలల్లో మొక్కలను నాటారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

రహమత్‌నగర్(బోరబండ): సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను బోరబండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ భూపాల్‌గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండ సైట్ 3 సందునగర్‌కు చెందిన శాంతి తమ్మప్ప, ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్‌కు చెందిన నెదురుమల్లి సాయికుమార్ చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 5న ఎస్పీఆర్‌హిల్స్ ఆరోగ్యనగర్ క్రాస్ రోడ్డు వద్ద బైక్‌పై వెళుతున్న వ్యక్తి అడ్డుకుని అతడి సెల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు వారిని అరెస్టు చేసి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఐ వివరించారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో వసూళ్లు

బంజారాహిల్స్: టాస్క్‌ఫోర్స్ పోలీసులమని, మీ పాన్ డబ్బాలో గుట్కా అమ్ముతున్నారని, తనిఖీలు చేయడానికి వచ్చామని బెదిరించి ఓ పాన్‌డబ్బా యజమాని నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని అన్నపూర్ణ స్టూడియో గేటు నెంబర్-1 వద్ద మోడెం శ్రీకాంత్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అతడి వద్దకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని, గుట్కా అమ్ముతున్నట్లు సమాచారం ఉందని, తనిఖీలు చేయాలని బెదిరించారు. అందులో ఒకరు తన పేరు బదుల్లా అని, కానిస్టేబుల్ అని చెప్పగా మరో వ్యక్తి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ నర్సారెడ్డిగా పరిచయం చేసుకున్నారు. రూ.5 వేలు ఇస్తే కేసు నమోదు చేయకుండా వదిలేస్తామని చెప్పారు. నకిలీ ఐడీ కార్డులు కూడా చూపించారు. వీరి కదలికలపై అనుమానం వచ్చిన శ్రీకాంత్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని వెంకటగిరి స్రవంతినగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు దాడి చేసి ఇద్దరు సెక్స్ వర్కర్లతో పాటు ముగ్గురు విటులు, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..రమేష్‌రెడ్డి అనే యువకుడు కొంతకాలంగా స్రవంతినగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని వివిధ దేశాల నుంచి యువతులను రప్పిస్తూ వ్యభిచార గృహం నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడులు చేసి కో ఆర్గనైజర్ చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు విటులకు నోటీసులు జారీ చేశారు. ఇద్దరు సెక్స్ వర్కర్లను హోంకు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు రమేష్ రెడ్డి కోసం గాలిస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు


నాగార్జున నగర్‌లో..



బంజారాహిల్స్: నాగుల పంచమి సందర్భంగా నాగదేవతా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పుట్టల వద్ద పాలు పోసేందుకు మహిళలు బారులు తీరారు. ఖైరతాబాద్ డివిజన్‌లోని ఏడుగుళ్లతో పాటు జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం, జూబ్లీహిల్స్ చెక్ పోస్టులోని నాగదేవతా గణపతి సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం, ఫిలింనగర్ దైవ సన్నిధానం, నందినగర్ పుట్ట, నాగార్జున నగర్ నాగదేవతా ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్టులోని నాగదేవతా సహిత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రమేష్, ఎల్లయ్య, చుక్కయ్య వెంకట్, రాము, గంగాధర శర్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి ఆవరణలోని నాగదేవతా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో గరుడ పంచమి సందర్భంగా గరుత్మంతుడికి పంచామృత అభిషేకం చేశారు.

శిథిల దేవతా పటాలకు ఉద్వాసన పూజ


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

పంజగుట్ట: ఇళ్లల్లో ఉన్న శిథిలమైన దేవుని విగ్రహాలు, ఫొటోలు, చిరిగిపోయిన శ్లోకాల పుస్తకాలు, పూజా సామాన్లను తమకు అప్పగిస్తే ఈ నెల 11న వాటికి పురోహితులద్వారా ఉద్వాసన పూజ చేయించి వాటిని రీసైకిల్, రీ యూజ్, రిడ్యూస్ చేస్తామని ఆర్య వైశ్య కమ్యూనిటీ ఇంటర్‌నేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కోర్ కమిటీ సభ్యులు కిరణ్, ప్రతినిధులు తులసీ సరాఫ్, స్వాతి పజ్జూరి మాట్లాడుతూ .. శిథిలమైన దేవుని విగ్రహాలు, పాత విగ్రహాలు, దేవుని ప్రతిమలు, భిన్నమైన విగ్రహాలు ఫొటోలను చెత్తలో, మురికి కాలువల్లో వేస్తుంటామని దానివల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందన్నారు. దీనిని నివారించేందుకు ఈ నెల 11న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఉప్పల్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కొత్తపేట, గణపతి దేవాలయం గాయత్రి పురం కొత్తపేట, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం రామంతాపూర్, మహంకాళి ఆలయం బాలాజీ ఎన్‌క్లేవ్ బీరప్ప గడ్డ ఉప్పల్, శ్రీ రామాలయం దయానంద్ నగర్ కాలనీ, మలక్‌పేట, హనుమాన్, సాయిబాబా దేవాలయం ఆలుగడ్డబావి, మెట్టుగూడ, కోదండ రామాలయం చింతల్, సెవెన్ టెంపుల్స్ శివాజీ నగర్, సనత్‌నగర్ మొత్తం 9 ప్రాంతాల్లో సేకరించనున్నట్లు తెలిపారు. రావడానికి వీలు కాలేనివారు ర్యాపిడో లాంటి ఆన్‌లైన్ సర్వీస్‌లో కూడా పంపవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 9989441335 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తమిళనాడులోనూ వెల్‌నెస్ సెంటర్

నిమ్స్‌ను సందర్శించిన తమిళనాడు హెల్త్ సెక్రటరీ


నిమ్స్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన తమిళనాడు హెల్త్ సెక్రటరీ సుప్రియ

లక్డీకాపూల్: తమిళనాడు రాష్ట్రంలోనూ నిమ్స్ తరహాలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి సుప్రియ సాహు అన్నారు. శుక్రవారం ఆమె నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)ను సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన ఆమె రోగులకు అందుతున్న వైద్య సేవలను నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్పను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని మెట్టు రంగారెడ్డి స్పెషల్ రూమ్స్‌ను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. టెలి డయాలసిస్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత కిడ్నీ రోగులకు నిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో అందుతున్న సేవలను నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గంగాధర్ వివరించారు. అనంతరం ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్ ద్వారా సివిల్ సర్వెంట్లకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట తమిళనాడు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్. వి. కర్ణన్, నిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి ప్రొ. రామ్ మూర్తి, నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంత్ వీర్‌లతో పాటు పలువురు సీనియర్ వైద్యులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలపై అవగాహన



ఖైరతాబాద్: జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆఫీస్ (ఎన్ఎస్ఎస్‌హెచ్‌ఓ), ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ మహిళలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్, యువకుల కోసం శుక్రవారం ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీతో కలిసి మాతా రమాబాయి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్‌హెచ్‌ఓ హెడ్ సురేష్ ఎన్ఎస్ఎస్‌హెచ్‌ఓ మంత్రిత్వ శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల్లో వ్యవస్థాపక సంస్కృతి సృష్టించేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. డీఐసీ జనరల్ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఎంఎస్ఎంఈల ప్రయోజనాలకోసం పథకాల ద్వారా పాల్గొనే ఎస్సీ, ఎస్టీ మహిళలను ప్రోత్సహించాలన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రతినిధి నాయుడు ఆన్‌లైన్ ద్వారా ముద్ర రుణాలు, సిజిటిఎంఎస్ఎంఈ, ఎస్‌సిఎల్‌సిఎస్ఎస్ పథకాలపై వివరించారు. నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆఫీస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉందని, ఇప్పటికే నాగకర్నూల్ జిల్లా నుంచి ప్రారంభించినట్లు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షులు జి.మురళీధర్‌రావు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పి.యాదగిరి, సెక్రటరి ఆర్.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ నల్లపోచమ్మ అమ్మవారికి నటుడు సుమన్ ప్రత్యేక పూజలు

లక్డీకాపూల్ : నిమ్స్ ప్రాంగణంలోని నల్లపోచమ్మ ఆలయాన్ని దర్శించిన నటుడు సుమన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన ఆయన నిమ్స్ సిబ్బంది విజ్ఞప్తి మేరకు అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో ఆయన కుడి చేతికి గాయమైంది. దీంతో గత కొద్ది రోజులుగా సుమన్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. తనకు మెరుగైన వైద్య సేవలు అందించిన నిమ్స్ వైద్యులు, సిబ్బందిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన ప్రాంగణంలోని నల్లపోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిమ్స్ పీఆర్ఓ సత్యాగౌడ్, నిమ్స్ సీసీఎస్ విభాగం ఉద్యోగిని పద్మ తదితరులు పాల్గొన్నారు.


నిమ్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న నటుడు సుమన్

అక్రమ నిర్మాణాలపై కొరడా

మూడు రోజుల్లో రెండు నిర్మాణాల కూల్చివేత



రహమత్‌నగర్(బోరబండ): బోరబండ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తూ సత్వర చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల వ్యవధిలోనే రెండు నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల బోరబండ బస్ స్టాప్ వద్ద ఓ వ్యక్తి అక్రమంగా నిర్మించిన షెడ్డును ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తాజాగా గురువారం బోరబండ సైట్3 వీకర్స్ సెక్షన్ కాలనీ పెద్దమ్మ గుడినగర్ ఉర్దూ మీడియం స్కూల్ వెనకాల ఉన్న ఇందిరమ్మ గృహాల సముదాయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అదనపు అంతస్తు నిర్మిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది దానిని కూల్చివేశారు. కాగా సదరు వ్యక్తి సచివాలయంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ మరో వైపు నాయకుడిగా చెలామణి అవుతూ, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నాడని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మండల తహసీల్దార్ నయిముద్దీన్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదులు అందిన వెంటనే తమ సిబ్బంది స్పందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. బోరబండ డివిజన్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజ్‌లో వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుస్సేన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, అడిషనల్ కమిషనర్ (సీహెచ్‌ఓ) సునంద, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా నేటితరం విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవనీత, వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్స్) వెంకటరమణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై అధ్యయనం జరగాలి

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి


సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

బంజారాహిల్స్: ఆదివాసీల సమస్యలపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, వర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'ఆదివాసీ జీవనోపాధి పద్ధతులు: సాధికారత సాధనలో సమస్యలు, వ్యూహాలు' అంశంపై నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ లింబాద్రి ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. ఆదివాసీల సమస్యల అధ్యయనం, పరిష్కార మార్గాల అన్వేషణ కోసం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు కీలక పరిణామంగా అభివర్ణించారు. ఈ సదస్సులలో వక్తలు వెల్లడించిన అనేక అంశాలను క్రోడీకరించి నివేదిక రూపొందించాలని నిర్వాహకులకు సూచించారు. ట్రైబల్ ప్రాంతాల్లో సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటి పరిష్కారం కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగాలని సూచించారు. పరిశోధకులు పరిష్కార మార్గాలను సూచించాలని, ఈ అంశాలను ప్రభుత్వం పరిశీలించి ఆదివాసీ ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై సమగ్రమైన చర్చ జరగాలనే ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. దేశంలోని పలు విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు హాజరై పరిశోధనా పత్రాలను సమర్పించారని వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సుధారాణి, సామాజిక శాస్త్రల విభాగం డీన్ వడ్డాణం శ్రీనివాస్, సదస్సు డైరెక్టర్ గుంటి రవీందర్, కో-డైరెక్టర్ లక్ష్మిలతో పాటు అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంఘాల నేతల డిమాండ్

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కుల జనగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అధ్యక్షతన 'కామారెడ్డి డిక్లరేషన్ – స్థానిక సంస్థల్లో 42 శాతం వాటా, బీసీ రిజర్వేషన్ కోసం బీసీలందరం యుద్ధానికి సిద్ధమౌదాం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ఐ.తిరుమలి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ .. రాహుల్‌గాంధీ దేశంలో కుల గణన జరపాలని, బీసీ రిజర్వేషన్లు పెంచాలని పార్లమెంట్‌లో పోరాటం చేస్తుండగా ఆయన స్ఫూర్తితో పనిచేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల విషయంలో మిన్నకుండటం దారుణమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బీసీ యువతకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, పూలే విదేశీ విద్యానిధి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టులు, మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, బీసీ గురుకులాల్లో, హాస్టల్స్‌లో డైట్ చార్జీలు పెంచాలని, ఎమ్‌సెట్ ద్వారా క్వాలిఫై అయిన ప్రతి బీసీ విద్యార్థి పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు వెంటనే ప్రభుత్వం బీసీ మేధావులు, ఉద్యమకారులతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బత్తుల సిద్దేశ్వర్లు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, పాలడుగు శ్రీనివాస్, సాంబశివ గౌడ్, సోగరాబేగం, శ్రీహరి, మహేష్ గౌడ్, బొంగు ప్రసాద్, బెల్లం మాధవి తదితరులు పాల్గొన్నారు.





ఒక తరం వెనక్కి వెళ్లి మన మూలాలను వెతుక్కుంటే రంగస్థలంతో ముడిపడి ఉన్న సమాజం సగర్వంగా కనిపిస్తుంది. నాటకం, నాటక రంగం స్ఫూర్తితోనే ప్రస్తుతం మనం చూస్తున్న పాన్ ఇండియన్ సినిమాలు పుట్టుకొచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే రంగస్థలానికి టెక్నాలజీ తోడైన పరిణామక్రమమే సినిమా. ఈ నాటక రంగం మన మూలాలను తిరిగి తీసుకువచ్చేందుకు ఉవ్విల్లూరుతోంది. మోడ్రన్‌గా థియేటర్ ఆర్ట్ అని పిలుచుకునే రంగస్థలానికి, నాటకానికి ఆదరణ పెరుగుతోంది. ఈ పరిణామంలో 'క్రియేటివ్ థియేటర్' పేరుతో ఒక కళా సంస్థను స్థాపించి పదేళ్లుగా నాటకానికి పూర్వవైభవం కోసం కృషి చేస్తున్నాడు యువ కళాకారుడు అజయ్ మంకెనపల్లి.

– సాక్షి, సిటీబ్యూరో

థియేటర్ ఆర్ట్

రంగస్థలానికి, నాటకాలకు పూర్వ వైభవం



న గరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్ ఆర్ట్ ఔత్సాహికులకు శిక్షణ అందించడంతో పాటు రంగస్థలం వేదికగా అద్భుతమైన నాటకాలకు ప్రాణం పోస్తూ కళా మూలాలతో ప్రయాణం చేస్తున్నారు. థియేటర్ ఆర్ట్‌ను నేటి తరం యువతకు, సినిమాకు వారధిగా మారుస్తున్న అజయ్ ప్రయత్నం గురించి ఆయన మాటల్లోనే..

కళతోనే ప్రయాణం..

కళ ఏదైనా సరే.., వాస్తవ రూపాన్ని ప్రదర్శించినప్పుడు మాత్రమే భావోద్వాగాన్ని సృష్టిస్తుంది. ఈ కారణంతోనే లైవ్ యాక్టింగ్ (థియేటర్ ఆర్ట్) స్వచ్ఛమైన అనుభూతులను అందిస్తుంది. ఈ సాంత్వన, సంతృప్తి కోసమే 'క్రియేటివ్ థియేటర్' ప్రారంభించి శిక్షణ అందిస్తున్నాను. 3 నెలల పాటు కొనసాగే ఈ కోర్సులో వర్క్‌షాప్స్, లైవ్ యాక్టింగ్ సెషన్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి బ్యాచ్‌తో రవీంద్ర భారతి, రంగభూమి, తెలుగు యూనివర్సిటీ వంటి కళా వేదికలపైన నాటక ప్రదర్శన చేయిస్తున్నాను. ఇలా ఇప్పటి వరకు 2 వేల మందికి పైగా థియేటర్ ఆర్ట్‌లో ప్రావీణ్యాన్ని అందించగలిగాను. ఇందులో భాగంగా ప్రముఖ యువ తెలుగు రచయిత మెర్సీ మార్గరేట్ రచనల ఆధారంగా నాటకీకరణ చేసిన అసమర్థుడు, కో అహం వంటి నాటకాలతో పాటు ఆల్ఫా, విరాట, త్రిపుర శపథం వంటి ఎన్నో నాటకాలు ప్రేక్షకుల నుంచి మన్ననలు పొందాయి. ముఖ్యంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాసిన కథను నాటకంగా ప్రదర్శించిన 'గొల్ల రామవ్వ' నాటకానికి రఘుబాబు నేషనల్ థియేటర్ ఆర్ట్ అవార్డుతో పాటు పలు అవార్డులను అందుకున్నాం. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, విజయవాడ, ఖమ్మం వంటి పలు ప్రాంతాల్లో 60 వరకు ప్రదర్శనలు చేశాం. తెలంగాణలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వేసవి శిక్షణలో భాగంగా ఇప్పటి వరకు 1800 మందికి పైగా భాగస్వాములయ్యారు.

భావోద్వేగాలను ప్రదర్శిస్తున్నాం..

అడ్వెంచరస్, జానపదాలు, టైం ట్రావెల్, సోషియో ఫాంటసీ, నవలలు, కథలు, షేక్స్పియర్ వంటి ప్రముఖుల రచనల నుంచి నాటకాలకు నాటకీకరణ చేసి దర్శకత్వం వహిస్తా. రంగస్థలం కమర్షియల్‌గా వృద్ధిలోకి రావాల్సిన అవసరముంది. ఈ ప్రయాణంలో రచయితలు, వాయిద్యకారులు, మేకప్ ఆర్టిస్టులు, లైటింగ్, క్యాస్టింగ్ ఇలా ఎంతోమంది కృషి ఉంటుంది. మా విద్యార్థులు 60 మంది వరకు సినిమాల్లో అవకాశాలు పొందారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల్లోని ఎమ్‌పీఏ కోర్సులకు కూడా ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. 3 నెలల కోర్సులో భాగంగా నాతో పాటు ఈ యూనివర్సిటీల థియేటర్ ఆర్ట్స్ నిపుణులను ఆహ్వానించి శిక్షణ అందిస్తాను. ఐటీ మొదలు టీచింగ్, పోలీసు, మార్కెటింగ్ ఉద్యోగుల నుంచి ఫుడ్ డెలివరీ బాయ్స్ వరకు ఈ ఆర్ట్ కోసం ఆసక్తి చూపిస్తున్నారు.



భాషా సాంస్కృతిక శాఖ ప్రోత్సాహం

మా ప్రయత్నానికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అందిస్తున్న సహకారం ఎనలేనిది. ఈ శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర కళల ప్రశస్తిని విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా థియేటర్ ఆర్ట్‌కు సైతం ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. శిక్షణ కోసం లలిత కళాతోరణం వేదికగా సహకారం అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మా సంస్థకు సరిపడా స్థలం అందిస్తే మరింత మందికి శిక్షణ ఇవ్వగలం.


అజయ్ మంకెనపల్లి



వెజ్ మెమరి ఫుల్..

- హైదరాబాద్ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనం
- యాంటీ ఆక్సిడెంట్లు పెరిగినట్టు గుర్తింపు
- యూరోపియన్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్‌లో ప్రచురణ

శాకాహారంతో శారీరక, మానసిక ఆరోగ్యం

సాక్షి, సిటీబ్యూరో: శాకాహారంతో ఎన్నో లాభాలు ఉన్నాయన్న విషయం తెలిసిందే.. అయితే మానసిక ఆరోగ్యానికి కూడా ఎన్నో లాభాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పరిశోధకులు తేల్చిచెప్పారు. శాకాహారంతో మెదడు పనితీరు మెరుగు పడుతుందని, డిప్రెషన్ తగ్గుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని గుర్తించారు. వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి మంచన నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది. ఈ అధ్యయనం వివరాలు యురోపియన్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 40 ఏళ్లు దాటిన 304 మందిపై 6 నెలల పాటు వర్సిటీ పరిశోధకులు పరిశోధనలు చేశారు. శాకాహారులు, మాంసాహారులు మధ్య మానసిక, జ్ఞాపకశక్తి అంశాలలో ఉన్న తేడాలను పరిశోధించారు. శాకాహారం తిన్నవారిలో ప్రొటీన్, కాల్షియం, ఫోలేట్, విటమిన్ సీ ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. కాకపోతే వీరిలో విటమిన్ బీ-12 స్థాయి చాలా తక్కువగా ఉందని గుర్తించారు. ఇక, మాంసాహారం తిన్నవారిలో కార్బొహైడ్రేట్స్, సోడియం, రైబోఫ్లావిన్, ఇనుము, విటమిన్ బీ ఎక్కువగా ఉన్నట్లు గమనించారు.



విరివిగా యాంటీ ఆక్సిడెంట్లు..

శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషించే యాంటీ ఆక్సిడెంట్లు.. మాంసాహారం తినేవారితో పోలిస్తే శాకాహారం తినేవారిలో విరివిగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీని కారణంగా మానసిక ఒత్తిడి భారీగా తగ్గిందని, వీరిలో కొత్త విషయాలు నేర్చుకునే సామర్థ్యం పెరిగిందని పరిశోధకులు తెలిపారు. మెదడు పనితీరులో కీలక పాత్ర పోషించే ప్రొటీన్లు అధికంగా తీసుకోవడంతో మానసిక ఆరోగ్యం కూడా చాలా మెరుగుపడిందని వెల్లడించారు.

లాభాలు ఎన్నో



శాకాహారం తీసుకోవడం వల్ల మానసికపరమైన లాభాలతో పాటు కొత్త విషయాలు నేర్చుకోవడం, జ్ఞాపకశక్తి పెరగడం వంటి లాభాలు చేకూరుతాయి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులను మన ఆహారంలో భాగం చేస్తే డిప్రెషన్, యాంగ్జయిటీ దరిచేరవని చెప్పొచ్చు. – డాక్టర్ వరలక్ష్మి మంచన, అసిస్టెంట్ ప్రొఫెసర్, హైదరాబాద్ వర్సిటీ

హావం.. భావం..

నృత్యోత్సాహం



గన్‌ఫౌండ్రీ: దీపాంజలి కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యగురువు దీపికారెడ్డి శిష్యులు సంయు, ఖుషిల కూచిపూడి నాట్య రంగప్రవేశం రవీంద్రభారతిలో కన్నుల పండువగా శుక్రవారం జరిగింది. పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లతామా ఫౌండేషన్ ట్రస్టీ మాధవిలత మాట్లాడుతూ.. విదేశాల్లో సైతం మన సంస్కృతి, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. సినీ నటుడు తనికెళ్ల భరణి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫెస్టివిల్..

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల భవిష్యత్తు ఆకాంక్షలకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ మంథన్ స్కూల్ పాఠశాల ఆవరణలో గ్లోబల్ యూనివర్సిటీ ఫెస్టివల్‌ను శుక్రవారం నిర్వహించారు. భారత్, యూఎస్, యూకే, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు చెందిన వందకుపైగా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యాయి. ఉన్నత విద్య కోసం ఏ స్ట్రీమ్‌ను ఎంచుకోవాలి? ఏ కళాశాలలు సరిపోతాయన్న విషయంలో చాలా స్పష్టమైన విజన్ ఏర్పడిందని పలువురు విద్యార్థులు తెలిపారు. మంథన్ కాలేజ్, కెరీర్ కౌన్సెలర్ ఫైరీనా సిద్ధిఖీ మాట్లాడుతూ తల్లిదండ్రులకు తమ పిల్లల ఉన్నత విద్య విషయంపై తగిన నిర్ణయం తీసుకునేందుకు ఈ ఫెస్టివల్ అవకాశం ఇస్తుందన్నారు. మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ పాల్గొన్నారు.





జర్మన్ చిత్రం.. వైవిధ్యభరితం

సాక్షి, సిటీబ్యూరో: కరోలిన్ లింక్ దర్శకత్వం వహించిన వెన్ హిట్లర్ స్టోల్ పింక్ రాబిట్ చిత్రాన్ని ఈనెల 20న బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో ప్రదర్శిస్తున్నామని గోతె జంత్రమ్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ నూరియా వాహ్నవతి తెలిపారు. హృదయానికి హత్తుకునే కుటుంబ కథ నేపథ్యంలో సాగే ఈ జర్మన్ చిత్రం.. స్విట్జర్లాండ్, పారిస్, లండన్‌ల మీదుగా ఓ యువతి సాగించిన వైవిధ్యభరిత ప్రయాణాన్ని కళ్లకు కడుతుందని తెలిపారు. ప్రదర్శన రాత్రి 7గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

హే బాబూ.. ఓ గోలీ సోడా కొట్టవోయ్..
ఈ మాట విని ఎన్నేళ్లవుతుందో కదా..! ఒకప్పుడు ప్రతి ఊర్లో.. ప్రతి వీధిలో బండిపై గోలీ సోడా అమ్ముతుండేవారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు అలా గోలీ సోడా ఒకటి కడుపులో పడిందంటే ఎంతో హాయిగా ఉండేది. కాలక్రమేణా గోలీ సోడా స్థానంలోకి శీతల పానీయాలు వచ్చి చేరాయి. మళ్లీ ఇప్పుడు పాత రోజులు గుర్తు చేసేందుకు గోలీ సోడాలు మార్కెట్లోకి వచ్చేశాయి. అప్పట్లో వీటి టేస్ట్ చూసిన వారు.. ఆ టేస్ట్ తెలుసుకొని నేటి యువత వాహ్.. అంటున్నారు. గోలీ సోడా తాగితే చాలు ఫొటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు హైదరాబాద్ యువత. - సాక్షి, సిటీబ్యూరో

గోలీ సోడా మస్త్.. మజా..



- నగరంలో గోలీ సోడాకు పెరుగుతున్న క్రేజ్
- డిఫరెంట్ ఫ్లేవర్స్‌లో కలర్‌ఫుల్‌గా ..
- సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న యూత్
- బిర్యానీ తిన్నామంటే గోలీ సోడా పడాల్సిందే..

ఒకప్పుడు తోపుడు బండ్లపై నిమ్మకాయ సోడా, సాదా సోడాలు అమ్ముతుండే వారు. ఇప్పుడు మాత్రం డిఫరెంట్ ఫ్లేవర్లలో అందుబాటులోకి వచ్చాయి. అలా హైదరాబాదీ బిర్యానీ తిన్నామంటే.. ఓ గోలీ సోడా పడాల్సిందే.. అన్నట్టు ట్రెండ్ సెట్ చేస్తున్నారు సిటీ యూత్. డిఫరెంట్ ఫ్లేవర్స్‌తోనే కాకుండా క్రేజీ కలర్స్‌లో దొరుకుతున్నాయి. పెద్ద పెద్ద మాల్స్, రెస్టారెంట్లలో గోలీసోడాల సీసాలను ఇప్పుడు అమ్ముతున్నారు. బ్లూబెర్రీ, వర్జిన్ మొజిటో, లెమనేడ్, నింబూమసాలా, యాపిల్ మొజిటో, ఆరెంజ్, రోజ్‌ఎసెన్స్ ఇలా వేర్వేరు ఫ్లేవర్స్‌లో కంపెనీలు తయారు చేస్తున్నాయి. లెమన్ ట్రీ, పర్పుల్ హేజ్, బెడ్ ఆఫ్ రోజెస్‌ం అంటూ పాపులర్ ఇంగ్లిష్ పాటల పేర్లు పెట్టి మరీ యువతను ఆకర్షిస్తున్నారు. దుకాణాలతో పాటు కొన్ని హోటళ్లు, క్లబ్బులూ కాలేజీలకు కూడా ఈ సోడాలను సరఫరా చేస్తున్నారు. దాంతో అందరి దృష్టి మళ్లీ.. సోడావైపు మళ్లింది.

ఆ టేస్టే వేరు..

గోలీ సోడా సీసా స్టైల్, కలర్, గోలీ కొడుతుంటే వచ్చే శబ్దం.. అందులోని సోడా అన్నీ ప్రత్యేకమే.. చిన్నప్పుడు ఊర్లలో ఒకటి, రెండు రూపాయలకు దొరికే సోడా తాగేందుకు ఎంతో ఎదురు చూసేవాళ్లం. సోడా తాగిన తర్వాత వచ్చే అనుభూతి వేరేలా ఉండేది. ఇప్పుడు కూడా ఎక్కడైనా సోడా బాటిల్ కన్పిస్తే వేరే కూల్‌డ్రింక్స్ ఉన్నా కూడా గోలీ సోడా తాగుతుంటే వచ్చే మజానే వేరు. – సాయికిరణ్ మెగావత్, హిమాయత్‌నగర్



ఆ శబ్దం వింటే.. అదో ఆనందం..

పిల్లలకు గోలీ సోడా సరదా ఓ పట్టాన తీరేది కాదు. రబ్బరు కార్కుతో సోడా కొట్టగానే గోలీ లోపలికి వెళ్లినప్పుడు వచ్చే ఆ శబ్దానికి కళ్లనిండా ఆశ్చర్యమే. ఆ శబ్దం వింటే మనసుకు అదో తృప్తి. గోలీసోడాలో ఉండేది కార్బొనేటెడ్ నీళ్లే. మొదటగా 1767లో జోసెఫ్ ప్రిస్ట్‌లే అనే శాస్త్రవేత్త, కార్బన్‌డయాక్సైడ్‌ను నీటిలోకి పంపి, స్నేహితులకిస్తే, ఆ రుచి నచ్చడంతో అందులో పండ్ల ఫ్లేవర్లూ, చెక్కెరలూ కలిపి సాఫ్ట్‌డ్రింక్స్ తయారు చేయడం ప్రారంభించారు. అందుకే సోడా కూడా ఓ సాఫ్ట్ డ్రింకే.. మొదట్లో సోడా నీళ్లని సాదా బాటిల్స్‌లోనే నింపేవారు. అయితే మూత బిగించేటప్పుడూ తీసేటప్పుడూ గ్యాస్ పోయేది. అలా వెళ్లిపోకుండా ఉండేందుకు ఇప్పుడు మనం చూస్తున్న కాడ్‌నెక్ బాటిల్‌ను రూపొందించారు. 1872లో హిరమ్ కాడ్ అనే బ్రిటిష్ ఇంజినీర్ దీన్ని తయారు చేశాడు. ఈ బాటిల్ మందంగా ఉంటుంది.



ఫొటో.. ఆకట్టుకునేలా..

మాదాపూర్: ఫొటోగ్రఫీ ద్వారా ప్రత్యేకమైన జాతుల అస్తిత్వాన్ని చూపించడం గొప్ప విషయమని పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి అనసూయ(సీతక్క) తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ట్రైబలోగ్రఫీ చిత్రప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ నా చిన్నతనంలో..., అడవిలో తిరిగినప్పుడు.. కరోనా సమయంలో.. చూసిన సన్నివేశాలు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. మరిన్ని చిత్రాలు తీయాలని సతీష్‌ను కోరారు. ప్రదర్శన 14వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.






వావ్.. అనాల్సిందే..

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రెండు వేర్వేరు ప్రదర్శనలు శుక్రవారం నిర్వహించారు. కళాకారుడు శ్రీనివాస బాబు అంగార వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. అన్‌డిసిఫర్డ్ చిత్రప్రదర్శనను కళాకారిణి అంజుపోద్దార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన 18వ తేదీ వరకు కొనసాగుతుంది.



తూరీగ చిత్రప్రదర్శన..

ఐదుగురు మహిళా కళాకారులు వేసిన చిత్రాల ప్రదర్శనను హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి. రమణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రదర్శన 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఎనిమిది కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా

- సుమారు రూ.24,657 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం
- తెలంగాణ, ఏపీ సహా 7 రాష్ట్రాల్లోని 14 జిల్లాల అనుసంధానం
- వివరాలు వెల్లడించిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంలో భాగంగా ఎనిమిది నూతన రైల్వేలైన్ ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సుమారు రూ.24,657 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఎనిమిది ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్ కేబినెట్ సమావేశానంతరం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులన్నీ 2030–31 కల్లా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

- ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని 14 జిల్లాల పరిధిలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుంది. అందులో భాగంగానే కొత్తగా 64 రైల్వేస్టేషన్లు నిర్మిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం, మల్కన్‌గిరితోపాటు ఆరు ఆకాంక్ష జిల్లాల్లోని 510 గ్రామాలతోపాటు దాదాపు 40 లక్షల మంది జనాభాకు రైల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది.
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సంబంధించి మల్కన్‌గిరి–పాండురంగాపురం (భద్రాచలం మీదుగా) 173.61 కి.మీ పొడవున నూతన రైల్వేలైన్ నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టులో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాతోపాటు ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి. ప్రముఖ పుణ్య క్షేత్రమైన భద్రాచలాన్ని ప్రధాన రైల్వేలైన్‌తో అనుసంధానించేందుకు ఇది ఉపయోగపడనుంది. వీటితోపాటు తొలిసారిగా యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన అజంతా గుహలను రైల్వే నెట్‌వర్క్‌కు అనుసంధానిస్తారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇలా...

మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు గత ఏడాది ఫైనల్ లొకేషన్స్ సర్వే మంజూరైంది. ఆ వెంటనే సర్వే పనులు పూర్తి చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ మార్గాన్ని నిర్మించేందుకు సిద్ధపడింది. ఈ కొత్త రైల్వేలైన్ వల్ల భద్రాద్రి కొత్తగూడెంలోని రైలు అనుసంధానం లేని కొత్త ప్రాంతాలకు రైల్వే వసతి ఏర్పడుతుంది. సరుకు రవాణా ప్రధాన లక్ష్యంగానే ఇది నిర్మిస్తున్నప్పటికీ ప్రయాణికుల రైలు కూడా దీని మీదుగా నడపనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందుకు దాదాపు రూ. 3,592 కోట్లు ఖర్చు చేయబోతోంది. జునాగఢ్ నుంచి మల్కన్‌గిరి, మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు... ఈ రెండు లైన్లు కలిపి చూస్తే అయ్యే వ్యయం రూ.7,383 కోట్లు. ఈ ప్రాజెక్టు కోసం 1697 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. సెంట్రల్ సౌత్ ఇండియాలోని పవర్ ప్లాంట్లకు మహానది కోల్డ్‌ఫీల్డ్‌కు ఇది దగ్గర దారి కాబోతోంది. బస్తర్ రీజియన్‌కు మధ్య 124 కిలోమీటర్ల దూరాభారాన్ని కూడా ఇది తగ్గించనుంది.



బెంచ్ దిగి వృద్ధురాలి వద్దే విచారణ

- నడవలేని స్థితిలో ఆటోలో కోర్టుకు వచ్చిన వృద్ధురాలు
- ఆమె పరిస్థితిని చూసి చలించిన న్యాయమూర్తి



ఆటోలో వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న న్యాయమూర్తి

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మొదటిశ్రేణి అదనపు న్యాయమూర్తి కేవీఎస్ హరీశ్‌బాబు శుక్రవారం బెంచ్ దిగివచ్చి...ఓ కేసులో ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. నాంపల్లి మండలానికి చెందిన వృద్ధురాలు మెగావత్ సోని 2015లో తనపై దాడి ఘటనలో నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటినుంచి కేసు కోర్టులో విచారణ జరుగుతోంది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా...నడవలేనిస్థితిలో ఉన్న సోని ఆటోలో దేవరకొండ కోర్టుకు వచ్చింది. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి స్వయంగా వృద్ధురాలి వద్దకు వచ్చి విచారణ చేపట్టి ఇద్దరి మధ్య రాజీకుదిర్చి సమస్యను పరిష్కరించారు.

24 నుంచి చిరుధాన్యాలపై ఆరోగ్య కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: రైతునేస్తం ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్, కర్షక సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఖాదర్ వలీ, సరళా ఖాదర్‌లతో 24, 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో సిరిధాన్యాలతో జీవన సిరిపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. శంషాబాద్ సమీపంలో స్వర్ణభారత్ ట్రస్ట్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుందని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 97053 83666, 70939 73999 ఫోన్ నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని సూచించారు. చిరుధాన్యాల భోజనం, వసతి సదుపాయం ఉంటుందని తెలిపారు.

వందేభారత్ రాకపోకల్లో మార్పు



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్– విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (208 33/20834) రాక పోకల్లో మార్పులు చోటుచేసుకోనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీ ఆర్వో శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం ఆదివారం మినహా మిగతా 6 రోజులు వందేభారత్ రాకపోకలు సాగిస్తుండటం తెలిసిందే. డిసెంబర్ 10వ తేదీ నుంచి ఆదివారానికి బదులు మంగళవారం మినహా మిగతా 6 రోజులు ఈ రైలు నడవ నుంది. ఈ మేరకు డిసెంబర్ నుంచి వందే భారత్‌కు ప్రతి ఆదివారం బదులు మంగళవా రం సెలవు ఉంటుందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సెట్విన్ కేంద్రాల విస్తరణ

మంత్రులు ఉత్తమ్, దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర. చిత్రంలో మంత్రి ఉత్తమ్, సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి

యాకుత్‌పురా (హైదరాబాద్): సెట్విన్ సంస్థ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు తమవంతు సహకారం అందిస్తామని పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖమంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్‌గా ఎస్.గిరిధర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉత్తమ్, దామోదర ముఖ్య అతిథులుగా హాజరై గిరిధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు, వికారాబాద్, జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో త్వరలో కొత్త సెట్విన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీఐఐసీ సంస్థ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవకృష్ణ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మత్తు' చిత్తుకు ద్విముఖ వ్యూహం



- డ్రగ్స్, గంజాయి సప్లై చైన్ కట్టడి..
- యువతలో అవగాహనకు చర్యలు చేపడుతున్నాం
- పబ్బులు, క్లబ్బుల్లోనూ నిఘా పెంచాం
- సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొంటున్నాం.. మహిళా, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- చట్టాన్ని అతిక్రమిస్తే పోలీసు సిబ్బందిపైనా చర్యలు.. గత నెల రోజులుగా పదవీ బాధ్యతలు ఎంతో సంతృప్తినిచ్చాయి

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: యువత భవిష్యత్తును చిత్తు చేసే 'మత్తు'మహమ్మారి కట్టడికి ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఒకవైపు డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల ముఠాల సప్లై చైన్ కట్టడి మరోవైపు మత్తు పదార్థాల వైపు యువత వెళ్లకుండా అవగాహన పెంచే వ్యూహంతో పనిచేస్తున్నామన్నారు. మత్తుదందాలో ఎంతటివారున్నా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పౌరుల కష్టార్జితాన్ని దోచుకొనే సైబర్ ముఠాలను సమర్థంగా ఎదుర్కొంటున్నామని.. గత ఆరు నెలల్లోనే రూ. 150 కోట్లను బాధితులకు రీఫండ్ చేయించగలిగామని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో రాజీ లేదని, మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టామ న్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐదో డీజీపీగా జూలై 10న బాధ్యతలు స్వీకరించిన జితేందర్ శనివారంతో పదవీబాధ్యతలు చేపట్టి నెల రోజులు పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన విజన్‌ను ఆవిష్కరించారు.

ప్రశ్న: పోలీస్ బాస్‌గా మీ నెల రోజుల పనితీరు ఎంతమేర సంతృప్తినిచ్చింది?

జవాబు: డీజీపీగా ఈ నెల రోజుల పనితీరు ఎంతో సంతృప్తినిచ్చింది. అసెంబ్లీ సమావేశాలు సజావుగా పూర్తి చేశాం. భారీ నేరాలేవీ జరగకుండా కట్టడి చేశాం. పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో ఓ రోజంతా సమావేశమై రాష్ట్రంలో పోలీసింగ్ తీరుతెన్నులు, దృష్టిపెట్టాల్సిన అంశాలు, మత్తుపదార్థాల రవాణా, సైబర్ నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత ఇవ్వగలిగాం. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఫలితాలు మెరుగయ్యాయి. ప్రజలకు అత్యవసర సేవలందించే డయల్ 100 సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టా. డయల్ 100 రెస్పాన్స్ టైం గతంలో కంటే సరాసరిన 5నిమిషాలు తగ్గింది.

ప్రశ్న: మీ ప్రధాన ఫోకస్ ఏ అంశాలపై ఉండనుంది?

జవాబు: శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలను ఆర్థికంగా గుల్ల చేస్తున్న సైబర్ నేరాల కట్టడిపై, యువతను పెడదోవ పట్టించే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు ముఠాల అణచివేతపై ప్రధానంగా దృష్టి పెడుతున్నా. అదే సమయంలో మహిళలు, చిన్నారుల భద్రతలో రాజీ ఉండదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు.

ప్రశ్న: రాష్ట్రవ్యాప్తంగా హత్యలు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేసేందుకు మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: రాష్ట్రంలో గతంతో పోలిస్తే నేరాల సంఖ్యలో చెప్పదగ్గ స్థాయిలో పెరగలేదు. హత్యలు, అత్యాచారాలు పెరిగాయని కొన్ని రకాల దుష్ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ విషయాలపై గణాంకాలతో సహా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం అసెంబ్లీలో ఇటీవలే స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణలో ఎంతో కఠినంగా ఉన్నాం. విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాం.

ప్రశ్న: డ్రగ్స్, గంజాయిని ఎంత మేర కట్టడి చేశామనుకుంటున్నారు?

జవాబు: మత్తు పదార్థాలపై ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. పూర్తిస్వేచ్ఛ ఉండటంతో డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలోకి గంజాయి రవాణా కాకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో తనిఖీలు పెంచాం. ఫలితంగా పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతోంది. గతానికి భిన్నంగా పబ్బులు, క్లబ్బుల్లోనూ జాగిలాలతో తనిఖీలు చేస్తున్నాం. కేసుల నమోదు పెరిగింది. డ్రంక్ అండ్ డ్రైవ్ మాదిరిగానే గంజాయి కట్టడికి గంజాయి తాగిన వాళ్లను గుర్తించే కిట్లను హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ వంటి కమిషనరేట్లతో పాటు అన్ని జిల్లాలకు పంపాం.

ప్రశ్న: డ్రగ్స్ కేసుల్లో శిక్షలు అంతంతమాత్రమేనన్న విమర్శలపై ఏమంటారు?

జవాబు: కొన్ని సాంకేతిక కారణాలతో గతంలో ఎన్‌డీపీఎస్ చట్టాల కింద కేసుల్లో శిక్షలు తక్కువగానే ఉండేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. టీజీ యాంటీనార్కోటిక్స్ బ్యూరోతో కలిసి దాదాపు 18 వేల మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. పక్కాగా కేసుల నమోదు, దర్యాప్తుతో శిక్షలు పెరిగాయి. ఈ నెల రోజుల్లో నాలుగు ఎన్‌డీపీఎస్ కేసుల్లో శిక్షలు పడ్డాయి. ఇందులో రెండు కేసుల్లో దోషులకు పదేళ్ల చొప్పున జైలు శిక్ష ఖరారైంది. కొందరు విదేశీయులు అక్రమంగా ఇక్కడే ఉంటూ ఇక్కడ డ్రగ్స్ దందాలో దిగుతున్నారు. అలాంటి వారిపై దృష్టిపెట్టాం. డ్రగ్స్ కేసుల్లో దొరికిన వారిని స్వదేశాలకు పంపుతున్నాం. గత నెల రోజుల్లో ముగ్గురు విదేశీయులను వెనక్కి పంపాం.

ప్రశ్న: దొంగతనం కేసులో ఇటీవల ఓ దళిత మహిళను పోలీసులు కొట్టడం వంటి ఘటనల్లో ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: చట్టాన్ని అతిక్రమిస్తే పోలీసు సిబ్బందిపైనా కఠినంగానే ఉంటాం. ఇందులో ఏ మినహాయింపు ఉండదు. క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సిందే. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో సిబ్బందిని ఎప్పటికప్పుడు సెన్సిటైజ్ చేస్తూనే ఉంటాం.

ప్రశ్న: మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

జవాబు: కేవలం మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడంతోనే మార్పు రాదు. దీనిపై తల్లిదండ్రులు సైతం ఆలోచించాలి. తమ పిల్లలే ప్రమాదాల బారిన పడతారన్న విషయాన్ని వారు గుర్తిస్తేనే దీనికి సరైన పరిష్కారం దొరుకుతుంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాం.



ప్రశ్న: అతిపెద్ద ముప్పుగా మారిన సైబర్ నేరాలను ఎలా ఎదుర్కొంటున్నారు?

జవాబు: సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేకంగా బ్యూరో ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేర ముఠాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. గత ఆరు నెలల్లో సైబర్ బాధితులకు రూ. 150 కోట్లు రీఫండ్ చేయించడం గొప్ప ఏచీవ్‌మెంట్. ఒకవైపు సైబర్ కేసుల సత్వర దర్యాప్తు మరోవైపు మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం.

ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బంజారాహిల్స్(హైదరాబాద్): ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ బడ్జెట్‌లో ఎస్టీల సంక్షేమానికి రూ.17 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కొమురంభీం ఆదివాసీ భవనంలో రాష్ట్ర ప్రభు త్వం, గిరిజన సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు మంత్రి సీతక్క హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు, నృత్యాలతో కళాకారులు మంత్రి కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యా ర్థులను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆదివాసీ, గిరిజనులకు జరిగిన అన్యాయాలను, గిరిజన సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను వివరించారు. ఐటీడీఏ పరిధిలో అమలులో ఉన్న జీఓ నంబర్–3ని గత ప్రభుత్వం రద్దు చేసిన కారణంగా స్థానిక గిరిజనులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినా, కోర్టు కేసుల్లో అది నలిగిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి, మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ పూజారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారి



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు. చిత్రంలో నరేందర్

ఖలీల్‌వాడి: నిజామా బాద్ కార్పొరేషన్ రెవె న్యూ అధికారి నరేందర్ ఇంటిపై ఏసీబీ అధికా రులు దాడులు చేశారు. బస్వాగార్డెన్ సమీపంలోని అశోక టవర్స్ లోని నరేందర్ ఫ్లాట్‌లో గురువారం ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టా రు. నిందితుడి వద్ద ఆదాయానికి మించిన ఆస్తులున్నట్టు ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు తాము తనిఖీలు చేపట్టినట్టు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా నరేందర్ కుటుంబానికి చెందిన రూ.6.7 కోట్లకుపైగా విలువగల ఆస్తులు, నగదును గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాల కట్టడిలో యువత ముందుండాలి

సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్‌లో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల కట్టడిలో యువత ముందుండాలని డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, యువత వారి ఆలోచన విధానాన్ని విస్తృతపర్చుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతోకలిసి టీజీ సైబర్ సెక్యూరిటీ 'ది గ్రేట్ యాప్‌సెక్ హ్యాకథాన్ 2024' నిర్వహిస్తోంది. శుక్రవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన ఈ హ్యాకథాన్ ప్రారంభ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత గోప్యత, సామాజిక భద్రత విషయంలో సైబర్ భద్రత అత్యంత ప్రధానంగా మారిందని డీజీపీ అభిప్రాయపడ్డారు.

- టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ ఈ హ్యాకథాన్‌లో 20కి పైగా దేశాల నుంచి 10 వేల మంది పాల్గొంటున్నారని చెప్పారు. ఈనెల 22న ఈ హ్యాకథాన్ ఫలితాలు వెల్లడిస్తామని, తెలంగాణలో మొదటి ఐదుగురు, జాతీయస్థాయిలో తొలి ఐదుగురు, అంతర్జాతీయ స్థాయిలో తొలి ఐదుగురిని విజేతలుగా ప్రకటిస్తామన్నారు. వీరికి తెలంగాణ సైబర్‌సెక్యూరిటీ బ్యూరోతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు.
- ఐటీ ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రెటరీ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ గతేడాది సైబర్ క్రైమ్ కారణంగా రూ. 7,500 కోట్లు కోల్పోగా, ఆ సొమ్మును టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కాపాడారని చెప్పారు. దీనికి సంబంధించి రీఫండ్ ఆర్డర్లను బాధితులకు ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీలు దేవేందర్‌సింగ్, హర్షవర్ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు అక్రమంగా వస్తే చర్యలు తీసుకుంటాం

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తాజా పరిణామాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు డీజీపీ జితేందర్ స్పందించారు. హైదరాబాద్‌లో ఉంటున్న బంగ్లా దేశీయులపై నిఘా ఉంచామన్నారు. హైదరాబాద్‌కు అక్రమంగా వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల ప్రకారమే నడుచుకుంటామన్నారు.

ప్రాణాలు తీస్తున్న వీధికుక్కలు

- రోజురోజుకూ చిన్నారులపై పెరిగిపోతున్న దాడి ఘటనలు
- ఇబ్రహీంపట్నంలో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి కన్నుమూత
- నార్సింగి పరిధిలో దివ్యాంగ బాలుడిపై వీధి కుక్క దాడి
- వరంగల్ ఎంజీఎంలో శిశువు మృతదేహాన్ని పీక్కుతిన్న శునకం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడుకుతో తల్లి

ఇబ్రహీంపట్నం/ మణికొండ/ ఎంజీఎం (వరంగల్): రాష్ట్రంలో వీధి కుక్కల దాడి ఘటనలు మరింతగా పెరుగుతున్నాయి. అభంశుభం ఎరుగని చిన్నారులపై దాడి చేస్తున్న వీధి కుక్కలు 'విధి'రాత మార్చేస్తున్నాయి. పిల్లలను పొట్టనపెట్టుకుంటున్నాయి. శుక్రవారం ఒక్కరోజే జరిగిన మూడు ఘటనలు భయాందోళన రేపుతున్నాయి. శునకాల దాడిలో గాయపడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందితే.. మరో ఘటనలో దివ్యాంగ బాలుడిపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరోచోట శిశువు మృతదేహాన్ని కుక్క పీక్కుతినడం కలకలం రేపింది.

నాలుగేళ్ల చిన్నారి మృతి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపోల్‌లో గత నెల 12న స్కూల్ బయట వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ నాలుగేళ్ల చిన్నారి క్రియాన్ష్.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ముక్కుపచ్చలారని తమ కుమారుడిని కుక్కలు పొట్టనపెట్టుకున్నాయంటూ తల్లిదండ్రులు ఉడుగుల మాధురి, శివగౌడ్ దంపతులు రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.శుక్రవారం గ్రామంలో నిర్వహించిన బాలుడి అంత్యక్రియలకు ఊరంతా తరలివచ్చింది.

దివ్యాంగ బాలుడిపై దాడి

హైదరాబాద్ శివార్లలోని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని సబితానగర్‌లో ఉంటున్న నర్సింహ, అంజమ్మల కుమారుడు భరత్ (7). అతను దివ్యాంగుడు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తే ఇంట్లోనే ఉంటాడు. శుక్రవారం అలా ఇంటి వద్దే ఉన్న భరత్.. బహిర్భూమికి వెళ్లి, గుడిసెలోకి వచ్చాడు. వెనకాలే వచ్చిన ఓ వీధికుక్క బాలుడిపై దాడి చేసింది. జననాంగంపై కరిచింది. బాలుడి చేతులు పనిచేయక పోవటం, చిన్న గుడిసె కావడంతో తప్పించుకోలేక పోయాడు. గట్టిగా అరుస్తూ, ఏడవటంతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కను తరిమేశారు. నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలుడికి శస్త్రచికిత్స చేయాలని, రూ.40 వేలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని.. తమను ఆదుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. కాగా.. ఈ ఘటనతో స్పందించిన నార్సింగి మున్సిపాలిటీ సిబ్బంది.. శుక్రవారం కాలనీలోని కుక్కలను పట్టుకుని, అక్కడి నుంచి తరలించారు.

ఎంజీఎంలో పసికందు మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క!

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం రద్దీగా ఉండే క్యాజువాలిటీ ప్రాంతం వద్ద ఓ పసికందు మృతదేహాన్ని కుక్క పీక్కుతింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో దీన్ని గమనించిన ఓ కానిస్టేబుల్ కుక్కను తరిమివేసి ఆస్పత్రి అధికారులకు సమాచారమిచ్చారు. అప్పటికే శిశువు ఎవరనేది గుర్తించలేనంతగా కుక్క కొరికేసింది. మృతదేహాన్ని పరిశీలించిన ఫోరెన్సిక్ నిపుణులు.. ఆడ శిశువుగా గుర్తించారు. రెండు, మూడు రోజుల క్రితమే చనిపోయి ఉంటే కుళ్లిన వాసన వస్తుందని, మృతదేహం నుంచి ఎలాంటి దుర్వాసన రాకపోవడంతో శుక్రవారమే చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు.

సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో..

ఆ పసికందు ఎవరు? ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శిశువులదా? బయటినుంచి తీసుకువచ్చిందా? శిశువు బతికి ఉండగా కుక్కల బారిన పడిందా? ఎవరైనా శిశువు చనిపోతే ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిపోయారా? అనే సందేహాలతో కలకలం చెలరేగింది. అక్కడ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో.. పసికందును కుక్క ఎక్కడి నుంచి తీసుకువచ్చిందో తెలుసుకోవడం కష్టంగా మారింది. అయితే.. ఎంజీఎం ఆస్పత్రిలోని నవజాత శిశు కేంద్రంలో శుక్రవారం చిన్నారులెవరూ మృతి చెందలేదని.. పసికందు మృతదేహం ఎంజీఎం ఆస్పత్రికి సంబంధించినది కాదని సూపరింటెండెంట్ మురళి చెప్పారు. శనివారం పాప మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని, వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

ఎక్స్‌పైరీ సెలైన్ ఎక్కించేశారు!

నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఆస్పత్రిలో ఘటన



చికిత్స పొందుతున్న అజారుద్దీన్, కాలం చెల్లిన సెలైన్ బాటిల్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు కాలం చెల్లిన మందులతో చికిత్స చేస్తున్నారు. శుక్రవారం ఓ రోగికి కాలం చెల్లిన సెలైన్ పెట్టడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఎస్.కె.అజారుద్దీన్ జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అతడిని అడ్మిట్ చేసుకుని వైద్యుల సూచన మేరకు అతడికి సెలైన్ పెట్టారు. అక్కడే ఉన్న అజారుద్దీన్ సోదరుడు ఆసిఫ్..సెలైన్ సరిగ్గా ఎక్కడం లేదని దానిని పరిశీలించగా ఎక్స్‌పైరీ డేట్ చూసి షాక్ అయ్యాడు. ఈ ఏడాది మార్చితోనే సెలైన్ కాలపరిమితి ముగిసినట్లు గుర్తించిన వెంటనే అక్కడి వైద్యులు, సిబ్బందిని నిలదీశాడు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న మీడియా ఆస్పత్రి ఆవరణలోని ఓ మెడిసిన్ ట్రాలీలోని మందులను పరిశీలించగా, మూడు వాయిల్స్ కాలం చెల్లినవి కనిపించాయి. అక్కడి నుంచి ఇంజెక్షన్ ఓపీకి వెళ్లి చూడగా అందులో సైతం ఓ వాయిల్ 3 నెలల ముందే గడువు ముగిసినట్లు కనిపించింది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీ మాధవ్‌ను 'సాక్షి' వివరణ కోరగా, విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకుంటామన్నారు. కాగా, ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం రాత్రి డీసీహెచ్ సురేశ్, డీఎంహెచ్‌వో రాజేందర్ సందర్శించారు. కాలంచెల్లిన మందులు వాడటంపై కలెక్టర్ ఆదేశాలతో ఆస్పత్రిని తనిఖీ చేసినట్లు తెలిపారు. అజారుద్దీన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈదుకుంటూ వెళ్లి.. ఇన్సులేటర్ అమర్చి



కోరుట్ల: చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్‌ను మార్చిన విద్యుత్ ఉద్యోగి సాహసమిది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూర్ గ్రామంలో చెరువు మధ్యలో ఉన్న ఓ విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్ దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో ఆ స్తంభం వద్దకు వెళ్లడానికి ఎవరూ సాహసం చేయకపోగా.. విద్యుత్ అన్‌మాన్ ఉద్యోగి దువ్వాక జగన్ ముందుకొచ్చారు. చెరువు మధ్య భాగం వరకు ఆయన ఈదుకుంటూ వెళ్లి స్తంభంపైకి ఎక్కి కొత్త ఇన్సులేటర్ అమర్చారు. దీంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. జగన్ సాహసాన్ని విద్యుత్ అధికారులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

పలు సంస్థలకు 125 ఎకరాల ప్రభుత్వ భూములు

- నల్లగొండలో పారిశ్రామిక పార్కు కోసం టీజీఐఐసీకి 61 ఎకరాలు
- ఖమ్మంలో 34 ఎకరాలు మెడికల్ కాలేజీకి.. 13 ఎకరాలు స్వామి నారాయణ గురుకుల పాఠశాలకు..
- జూబ్లీహిల్స్ రోడ్ నం.78లో క్రికెటర్ సిరాజ్‌కు ఉచితంగా 600 గజాలు కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అవసరాల నిమిత్తం 125 ఎకరాల ప్రభుత్వ భూములను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర భూమి నిర్వహణ అథారిటీ ఆమోదం మేరకు భూముల కేటాయింపు చేసినట్లు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో ఇండస్ట్రియల్ పార్కులు, ఖమ్మం జిల్లాలో వైద్య కళాశాల, గురుకుల పాఠశాల, పలుచోట్ల ఎస్ఐబీ విభాగం కార్యాలయాలు, నివాస క్వార్టర్ల నిర్మాణం, కామారెడ్డిలో ట్రాఫిక్ శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం ఈ భూములను సర్కార్ కేటాయించింది. టీజీఐఐసీ, స్వామి నారాయణ గురుకుల పాఠశాల, ఎస్ఐబీకి ఇచ్చిన భూములను మార్కెట్ విలువ ధర ప్రకారం కేటాయించగా పలు ప్రభుత్వ సంస్థలకు ఇచ్చిన భూములతోపాటు అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సిరాజ్‌కు ఉచితంగా కేటాయించింది.

ఏ సంస్థకు ఎంత భూమి అంటే..

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ)కు 61.18 ఎకరాలను కేటాయించింది. ఇందుకోసం ఎకరానికి రూ.6.4 లక్షల చొప్పున మొత్తం రూ. 3.93 కోట్లను ప్రభుత్వానికి టీజీఐఐసీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్థలంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కానుంది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురంలో 6.23 ఎకరాలను కూడా ఈ సంస్థకు పారిశ్రామిక పార్కు కోసం ఇచ్చింది. ఈ స్థలం కోసం ఎకరం రూ. 20 లక్షల చొప్పున మార్కెట్ ధరను రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఐఐసీ చెల్లించనుంది. మరోవైపు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లితోపాటు రఘునాథపాలెం మండల కేంద్రంలో మొత్తం 35.06 ఎకరాలను ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కోసం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు కేటాయించింది. అలాగే రఘునాథపాలెం మండల కేంద్రంలో 13.10 ఎకరాల భూమిని స్వామి నారాయణ గురుకుల అంతర్జాతీయ స్కూల్ ఏర్పాటు కోసం కేటాయించినట్లు ప్రభుత్వం తెలిపింది. అక్కడ ఎకరం మార్కెట్ విలువ సుమారు రూ. కోటి ఉన్నప్పటికీ రూ. 11.25 లక్షలకే ఆ సంస్థకు అప్పగించాలన్న ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రతిపాదన మేరకు ఆ భూమిని కేటాయించింది. ఇందుకుగాను ఈ పాఠశాలలోని 10 శాతం సీట్లను జిల్లా కలెక్టర్ విచక్షణ కోసం (ఉచిత విద్య కోసం) రిజర్వు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉచిత కేటాయింపులు ఇలా..

➤ నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌కు 6 ఎకరాలు. ➤ కామారెడ్డి జిల్లా క్యాసంపల్లిలో ట్రాఫిక్ శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం హోంశాఖకు 3 ఎకరాలు. ➤ అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నం.78 (షేక్‌పేట మండలం)లోని ప్రశాసన్‌నగర్‌లో 600 గజాల ఖాళీ స్థలం.

‘నాగోబా’కు పోటెత్తిన భక్తజనం



నాగోబా దర్శనం కోసం క్యూలో భక్తులు


ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్ర వెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చారు. గంటల తరబడి బారులుతీరి నాగోబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జొన్నగట్క ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ నాగోబా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

తనువంతా తేళ్లు..

తేళ్ల పంచమిరోజు భక్తుల సందడి



నారాయణపేట: దేశమంతటా శుక్రవారం నాగుల పంచమి జరుపుకొంటే.. నారాయణ పేట జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలోని కందుకూరులో మాత్రం తేళ్ల పంచమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా గుర్మిట్కల్ తాలూకా కందుకూరు గ్రామ సమీపంలోని కొండమవ్వ (మహేశ్వరి) అమ్మవారి సన్నిధిలో భక్తులు కొండమవ్వను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా నాగుల పంచమి రోజే తేళ్ల పంచమి జరుపుకోవడం ఇక్కడి ప్రత్యేకత. అమ్మవారి మహిమ వల్లే తేళ్లు తమకు హాని చేయవని భక్తుల విశ్వాసం. కొండపై ఆలయ పరిసరాల్లోని ఏ చిన్న రాయిని తొలగించినా.. వాటి కింద తేళ్లు కనిపించాయి. తేళ్లను చేతితో తాకినా.. పట్టుకున్నా.. శరీరంపై పాకించినా అవి కుట్టకపోవడం అమ్మవారి దివ్యానుగ్రహమని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా తేళ్లను తమ ముఖం, మెడ, నాలుకపై వేసుకుంటూ సందడి చేశారు.



గర్భిణి ధర్మాబాయిని వాగు దాటిస్తున్న మహిళ





ధర్మాబాయిని ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

'దారి'లేక.. ఆస్పత్రికి చేరలేక

- వాగు ఒడ్డునే ప్రసవించిన ఆదివాసీ మహిళ.. పుట్టిన గంటకే బిడ్డ కన్నుమూత.. మరో రెండు ఘటనల్లో యువకుడు, వృద్ధురాలు..

ఆసిఫాబాద్ రూరల్/నెన్నెల, వేములవాడ రూరల్: 'దారీ'తెన్నూ లేని పల్లెలు.. వాగులు దాటి వైద్యం అందుకోలేక గాల్లో కలుస్తున్న ప్రాణాలు.. శుక్రవారం ఒక్కరోజే వేర్వేరుచోట్ల రోడ్డు సరిగా లేక, అంబులెన్స్‌ల రాకకు వాగులు అడ్డొచ్చిన క్రమంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆదివాసీ దినోత్సవం నాడే ఓ ఆదివాసీ మహిళకు పుట్టెడు గర్భశోకం మిగిలింది. కడుపులో ఇద్దరు బిడ్డలను మోస్తూ పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళ్తూ.. వాగు ఒడ్డునే బిడ్డను ప్రసవించింది. పుట్టిన గంటకే బిడ్డ కన్నుమూసింది. కడుపులోని మరో బిడ్డతో ఆ మహిళ చికిత్స పొందుతోంది. ఈ దారుణం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకోగా, మరో రెండు ఘటనల్లో ఓ యువకుడు, వృద్ధురాలు సైతం సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే..

రెండు ప్రాణాలు మోస్తూ..

ఆసిఫాబాద్ మండలం బండగూడకు చెందిన ఆత్రం కొండు, ఆత్రం ధర్మాబాయి దంపతులు రైతులు. వీరికి రెండేళ్ల పాప ఉండగా.. ప్రస్తుతం ధర్మాబాయి ఏడు నెలల గర్భిణి. శుక్రవారం మధ్యాహ్నం నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారమిచ్చారు. గ్రామానికి వెళ్లే దారిలో వాగు అడ్డుగా ఉండడంతో 108 వాహనం వాగు ఒడ్డు వరకే వచ్చింది. స్థానికులు గర్భిణిని గ్రామం నుంచి కిలోమీటరున్నర దూరం నడిపించి వాగు దాటించారు. ఆ సమయంలో ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉండటంతో భయాందోళనకు గురైన ధర్మాబాయికి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఈ క్రమంలోనే వాగు ఒడ్డున ఆడశిశువుకు జన్మనిచ్చింది. కడుపులో మరో శిశువు ఉన్నట్లు గుర్తించిన 108 సిబ్బంది తల్లీబిడ్డను ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే పుట్టిన శిశువు మృతి చెందింది. కడుపులోని మరో శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వారిని అదే వాహనంలో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శస్త్రచికిత్స చేసి ఆ బిడ్డను కాపాడారు. పుట్టిన శిశువు బరువు 800 గ్రాములే ఉండటంతో ఎస్ఎన్‌సీలో ఉంచి, చికిత్స అందిస్తున్నట్లు ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భీష్మ తెలిపారు. కాగా గతేడాది వర్షాకాలంలో ఈ వాగు దాటుతున్న సమయంలో వరదలో కొట్టుకుపోయి ఓ యువతి మృత్యువాత పడింది.

అంబులెన్స్ వచ్చే దారిలేక..

మూర్ఛవ్యాధితో బాధపడుతున్న మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోణంపేటకు చెందిన జింజిరి జశ్వంత్ (17) పొలం పనులు ముగించుకుని ఇంటికొస్తూ ఒక్కసారిగా అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. 108 అంబులెన్స్ వచ్చినా.. బురద కారణంగా గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలోనే నిలిచిపోయింది. వాహనం నిలిపిన చోటికి యువకుడిని తీసుకురావాలని అంబులెన్స్ సిబ్బంది సూచించారు. గ్రామస్తుల సహకారంతో జశ్వంత్‌ను ఎడ్లబండిలో తీసుకెళ్లారు. అంబులెన్స్‌లోకి ఎక్కించిన యువకుడిని సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందాడని చెప్పారు. రోడ్డు సరిగా ఉండుంటే జశ్వంత్ ప్రాణాలు దక్కేవని బంధువులు విలపించారు.

సకాలంలో వైద్యం అందక..



వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన ఐత లచ్చవ్వ (65) ఆస్తమాతో బాధపడుతోంది. ఆరోగ్యం క్షీణించడంతో ఆమె భర్త నారాయణ 108కు సమాచారమిచ్చాడు. నక్క వాగుపై వంతెన పూర్తికాకపోవడంతో వాగుకు అవతలి వైపే అంబులెన్స్ ఆగిపోయింది. లచ్చవ్వను గ్రామస్తులు ఇంటి నుంచి వాగుకు ఇటువైపు గడ్డ వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి స్ట్రెచర్‌పై దాదాపు 400 మీటర్ల దూరాన ఉన్న అంబులెన్స్ వరకు మోసుకొచ్చారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ.. పరిస్థితి విషమించి లచ్చవ్వ మృతి చెందింది.

చంద్రబాబు, లోకేశ్‌లే ముద్దాయిలు

అలా చేయకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతలు చేయి దాటిపోయే ప్రమాదం

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు టీడీపీ నేతలంతా రెడ్‌బుక్ అమలు చేస్తున్నారు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు

> సీతారామాపురంలో సుబ్బరాయుడు హత్యను చూస్తే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని స్పష్టంగా అర్థమవుతోంది. లా అండ్ ఆర్డర్ ఎలా ఉండకూడదో అన్నదానికి చరిత్రలో ఈ ఘటన ఓ ఉదాహరణగా నిలిచిపోతుంది. పోలీసుల సమక్షంలోనే హత్య జరిగింది. హత్య జరుగుతుందనే విషయం ఎస్ఐ, సీఐ, డీఎస్పీలకు చెప్పినా అదనపు బలగాలు పంపలేదు. హత్యను ఎస్ఐ, కానిస్టేబుళ్లు నివారించలేకపోయారు. పథకం ప్రకారం పోలీసులు, రాజకీయ నేతలు కలిసి ఇలాంటి ఘటనలతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. మండలానికి ఇద్దరిని చంపండని స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చెప్పాడు. అయినా అతనిపై కేసులు లేవు. చంపిన వారితో పాటు వారి వెనుక ఉన్న వారిని కూడా కేసుల్లో చేర్చాలి. చంపిన వారికి మద్దతు ఇచ్చిన నారా లోకేశ్, చంద్రబాబు నాయుడులను కూడా ముద్దాయిలుగా చేస్తేనే లా అండ్ ఆర్డర్ బతుకుతుంది.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్



సుబ్బరాయుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు: రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికార పార్టీ నేతలు ఎవరికివారు రెడ్ బుక్ అమలు చేస్తూ స్వైర విహారం చేస్తున్నారని.. హత్యలు, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజలు చైతన్యవంతులై వీటిని అరికట్టకపోతే ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని, శాంతిభద్రతలు మరింతగా అదుపు తప్పకముందే అందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో టీడీపీ ప్రభుత్వం చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులతో అరగంటకుపైగా మాట్లాడి ఓదార్చారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో మండల నాయకులు, గ్రామ స్థాయిలో గ్రామ నాయకులు వారి వారి రెడ్‌బుక్‌లు తెరిచి ఊళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను నిస్తేజులుగా చేసి, వారి సమక్షంలోనే లా అండ్ ఆర్డర్‌ను నాశనం చేసిన పరిస్థితి సీతారామాపురంలో సుబ్బరాయుడి హత్య, ఆ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని చూస్తే స్పష్టమవుతోందన్నారు. 'సుబ్బరా యుడు కుటుంబం ఎన్నికల సమయంలో బూత్‌లో ఏజెంట్లుగా కూర్చున్నారు. వీరితో పాటు మరో మూడు కుటుంబాల వారు ఏజెంట్లుగా కూర్చున్నారు. దీంతో పెద్దిరెడ్డి, పల్లం శేఖర్, నారపురెడ్డి వీరందరిని చంపాలనే దారుణ రాజకీయాలు చూస్తే ఆశ్చర్య మనిపిస్తోంది. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏమైంది? సుబ్బరాయుడిని హత్య చేసేందుకు బయట నుంచి వచ్చిన వారితో పాటు 35–40 మంది రాడ్లు, రాళ్లు, కత్తులు, కర్రలు పట్టుకుని స్వైర విహారం చేసేందుకు ఏకమయ్యారు. ఇది చూసి నారపురెడ్డి 9.30 గంటలకు ఎస్ఐకి ఫోన్ చేశాడు. 'గ్రామంలో వాతావరణం సరిగా లేదు. బయట నుంచి వ్యక్తులు వచ్చారు. రాడ్లు, తుపాకులు, కత్తులు కన్పిస్తున్నాయి. ఏదో జరగబోతోంది. పోలీసులు త్వరగా రావాలి' అని చెప్పాడు. కొద్దిసేపటికి ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. ఎస్ఐ గ్రామంలోని పరిస్థితులన్నీ చూశారు. సీఐ, డీఎస్పీలకు ఫోన్ చేశారు. అయినా బందోబస్తు పంపలేదు. ఎస్ఐ, కానిస్టేబుళ్ల ముందు టీడీపీ నేతల స్వైర విహారం కన్పిస్తున్నా ఆపే ప్రయత్నం చేయలేదు. కత్తులు, కట్టెలు కన్పిస్తున్నా ఎస్ఐ, కానిస్టేబుళ్ల ప్రేక్షక పాత్ర పోషించారు. అదనపు బలగాలు రాలేదు' అని నిప్పులు చెరిగారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నించకూడదనే..

ఎన్నికల వేళ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రజలకు మంచి చేసి.. వారి మనసులో స్థానం సంపాదించుకోవాలనే ఆలోచనే ప్రభుత్వంలో కన్పించడం లేదు. రెండు నెలలుగా రాష్ట్రంలో అరాచకం, మారణహోమం సృష్టించే పాలన నడుస్తోంది. ఎన్నికలప్పుడు చంద్రబాబునాయుడు ఏం మాటలు చెప్పారో, ప్రజలను ఎలా మోసం చేస్తూ ఓట్లు వేయించుకున్నారో అందరికీ తెలుసు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో, ప్రశ్నించకూడదనే ఆలోచనతో భయానక వాతావరణాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సృష్టిస్తున్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు, ఆయన పార్టీ అభ్యర్థులు క్యాంపెయిన్ చేస్తూ చిన్న పిల్లలు కన్పిస్తే చాలు 'నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు నీకు రూ.15 వేలు' అని చెప్పి ప్రలోభ పెట్టారు. అక్క చెల్లెమ్మలు కన్పిస్తే 'ప్రతి అక్క చెల్లెమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు సంతోషమేనా?' అని అడిగారు. నిరుద్యోగి కన్పిస్తే 'రూ.3 వేల నిరుద్యోగ భృతి సంతోషమా?' అని.. రైతులు కన్పిస్తే 'మీకు రూ.20 వేలు సంతోషమా?' అని అడిగారు. ఇలాంటి ఆలోచనలు, మాటలతో ఇంటింటికీ టీడీపీ శ్రేణులను పంపించి చంద్రబాబు ప్రచారం చేయించారు. ఎన్నికల తర్వాత చిన్న పిల్లలను మోసం చేశారు. అదే జగనన్న ఉండి ఉంటే ఇప్పటికే రూ.15 వేలు అమ్మ ఒడి అంది ఉండేది. తల్లికి వందనం అని చెప్పి పిల్లలందరినీ మోసం చేయడమే కాకుండా తల్లికి పంగనామం పెట్టారు. వ్యవసాయ సీజన్ మొదలైంది. రైతులు ముమ్మరంగా వ్యవసాయం చేస్తున్నారు. జగన్ ఉండి ఉంటే ఈ పాటికే రైతు భరోసా సొమ్ము అందేది. ఆ సొమ్మూ పోయింది. చంద్రబాబు ఇస్తామన్న రూ.20 వేలు పోయింది. 18 ఏళ్లు నిండిన ప్రతి అక్కచెల్లెమ్మకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తానని చెప్పి అడ్డగోలుగా మోసం చేశాడు. జగనే ఉండి ఉంటే ఈ పథకాలు రావడంతో పాటు చదువుకుంటున్న పిల్లలకు విద్యా దీవెన, వసతి దీవెన కింద ఫీజులు కూడా కట్టేవాడు. ఇవి కూడా ఇవ్వకుండా, పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ కింద డబ్బులు జమ చేయకుండా చంద్రబాబు మోసం చేశాడు. ఇలా రైతులు, చిన్న పిల్లలు, అక్క చెల్లెమ్మలు అందరినీ మోసం చేశారు. ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదు.. రోడ్డుపైకి రాకూడదు.. నిలదీయకూడదు.. అని రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారు.



విశాఖలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

అంబేడ్కర్ విగ్రహంపై దాడి.. సర్కారు పనే

ఇవాళో రేపో విగ్రహాన్నీ ప్రభుత్వం కూల్చేస్తుంది

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి.. విగ్రహానికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కరిస్టులు, ప్రజాస్వామిక వాదులు, వైఎస్సార్‌సీపీ నేతల ఆందోళన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి రియల్టీ



ఈ ఏడాది నెల వారీగా గృహాల విక్రయాలు

నెల	యూనిట్లు	విలువ (రూ.కోట్లలో)
జనవరి	5,444	3,293
ఫిబ్రవరి	7,135	4,362
మార్చి	6,870	4,275
ఏప్రిల్	6,696	4,310
మే	6,061	3,759
జూన్	7,056	4,314
జూలై	7,124	4,266

హైదరాబాద్‌లో రూ.28,578 కోట్ల విలువైన 46,386 యూనిట్ల అమ్మకం

సేల్స్ హై!

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రియల్టీ రంగం సరికొత్త శిఖరాలను అధిరోహించింది. జనవరి–జూన్ (హెచ్1) మధ్యకాలంలో రికార్డు స్థాయిలో 46,386 గృహాలు విక్రయమయ్యాయి. వీటి విలువ రూ.28,578 కోట్లు. గతేడాది హెచ్1తో పోలిస్తే విక్రయాల్లో 17 శాతం, విలువల్లో 40 శాతం ఎక్కువ. రూ.కోటి, అంతకంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ ప్రాపర్టీకే డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023 హెచ్1లో రూ.1,828 కోట్లు విలువ చేసే 3,567 లగ్జరీ యూనిట్లు విక్రయం కాగా.. 2024 హెచ్1 నాటికి రూ.4,188 కోట్ల విలువైన 6,783 ప్రాపర్టీలకు పెరిగాయి. ఏడాది కాలంలో లగ్జరీ యూనిట్ల విక్రయాల్లో 90 శాతం, ప్రాపర్టీల విలువల్లో 129 శాతం వృద్ధి రేటు నమోదయిందని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది.

- నగరంలో గత నెలలో రూ.4,266 కోట్లు విలువ చేసే 7,124 యూనిట్లు అమ్ముడుపోయాయి. ఇందులో 13 శాతం ప్రాపర్టీలు లగ్జరీ ప్రాపర్టీలే. రూ.50 లక్షల లోపు ధర ఉన్న మధ్యస్థాయి గృహాల వాటా 61 శాతంగా ఉంది. రూ.2,600 కోట్లు విలువ చేసే 3,854 మిడ్‌సైజ్ యూనిట్లు విక్రయమయ్యాయి. రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్న 1,216 గృహాలు సేలయ్యాయి. వీటి విలువ రూ. రూ.1,101 కోట్లు. ఇక, రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ ప్రాపర్టీలు 487 యూనిట్లు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.564 కోట్లు.
- 14 శాతం గృహాలు 2 వేల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైనవి. గతేడాది జూలైలో ఈ యూనిట్ల వాటా 11 శాతమే. గతనెల్లో 1,000–2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న ప్రాపర్టీ వాటా 69 శాతంగా ఉంది.

వెస్ట్‌లో హాట్ కేక్..

కోకాపేట, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని ప్రాపర్టీలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడవుతున్నాయి. జూలైలో జరిగిన టాప్–5 లావాదేవీల్లో కోకాపేట, రాయదుర్గంలో మూడు, బంజారాహిల్స్‌లో రెండు ప్రాపర్టీలున్నాయి. బంజారాహిల్స్‌లో రూ.7.47 కోట్లు, రూ.5.37 కోట్ల మార్కెట్ వ్యాల్యూ ఉన్న రెండు ప్రాపర్టీలు, కోకాపేటలో రూ.6.01 కోట్లు, రాయదుర్గంలో రూ.4.35 కోట్ల విలువైన యూనిట్లు సేలయ్యాయి.

కొంపల్లిలో క్రెడాయ్ ప్రాపర్టీ షో

సాక్షి, హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) రెండో ప్రాపర్టీ షో కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. బాలానగర్, కొంపల్లి, శామీర్‌పేట్, మేడ్చల్, అల్వాల్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఓపెన్ ప్లాట్లు సమస్త సమాచారాన్ని స్టాళ్లలో ప్రదర్శనలో పెట్టారు. ఈనెల 11 వరకు ప్రాపర్టీ షో అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ చురుకైన విధానాలు, నిర్ణయాలు నగరం సమగ్ర వృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ–కామర్స్ గిడ్డంగులు, మెడికల్ డివైజెస్ పార్క్, జీనోమ్ వ్యాలీకి ఉత్తర హైదరాబాద్ నిలయంగా ఉందని తెలిపారు. ఎస్ఆర్‌డీపీ కింద కొత్త రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో, ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ల విస్తరణలతో మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుందని, నగర వారసత్వ సంపదను కాపాడుతూ సుస్థిరమైన అభివృద్ధి సాధించేలా మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ప్రకటించడం హర్షించదగ్గ పరిణామం అని కొనియాడారు.





నీళ్ల కోసం తండ్లాడే పరిస్థితి రావొద్దు: నిరంజన్‌రెడ్డి

పాలమూరు పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి: ఆర్‌ఎస్పీ

సాక్షి, హైదరాబాద్: అనేక రిజర్వాయర్లు వెలవెలబోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రోజూ 30 టీఎంసీల బంగారంలాంటి నీళ్లను బంగాళాఖాతంలోకి వదిలేస్తున్నారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, చేతులెత్తి దండం పెడుతున్నానన్నారు. పుష్కలంగా నీళ్లున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు నీళ్ల కోసం తండ్లాడే పరిస్థితి రావొద్దని కోరారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎత్తిపోతల పథకం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల అని, 60 టీఎంసీల నీళ్లను 90 రోజుల్లో తెచ్చుకునేలా కేసీఆర్ ఈ పథకం రూపొందించారని గుర్తుచేశారు.

'సుంకిశాల' నష్టాన్ని కాంట్రాక్టరే భరిస్తాడు

రిటైనింగ్ వాల్ కూలడం దురదృష్టకరం

- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఈ పరిస్థితికి కారణం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మంత్రి తుమ్మల, మండలి చైర్మన్ గుత్తాలతో కలిసి సుంకిశాల పంప్‌హౌస్ పరిశీలన


సుంకిశాల పంప్‌హౌస్ వద్ద శాసనమండలి చైర్మన్ గుత్తా, మంత్రులు ఉత్తమ్, తుమ్మల తదితరులు

సాక్షి, హైదరాబాద్/పెద్దవూర: జంటనగరాలకు తాగునీరు అందించేందుకు సుంకిశాల వద్ద చేపడుతున్న ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన సంఘటన చిన్నదని, నష్టం తక్కువైనా చాలా దురదృష్టకరమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. పనులు పూర్తి కావడానికి రెండు నెలలు ఆలస్యమవుతుందని, ఎంతటి నష్టమైనా కాంట్రాక్టరే భరిస్తాడని, ప్రభుత్వానికి ఏమీ నష్టం లేదని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టును కాంట్రాక్టర్ పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. నీట మునిగిన సుంకిశాల పంప్‌హౌస్‌ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. సుంకిశాల ప్రాజెక్టుకు ఈ పరిస్థితి రావడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. సుంకిశాల ప్రాజెక్టును డిజైన్ చేసింది, కాంట్రాక్ట్ ఇచ్చింది. నిర్మాణం చేపట్టింది బీఆర్‌ఎస్ పార్టీనే అని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఎందుకు మొత్తుకుంటున్నారో అర్థం కావడం లేదని, ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ఈ పనులను ప్రారంభించటంలో మతలబు ఏమిటో వారే చెప్పాలన్నారు. శ్రీశైలం సొరంగం పనులు పూర్తి చేసి ఉంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందేదని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి తీరుతామని చెప్పారు.

సీఎంపై ఆరోపణలు సరికావు : గుత్తా

సుంకిశాల ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యుడని రాజకీయ ఆరోపణలు కేటీఆర్ చేయడం సరికాదని, ప్రస్తుతం మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి దగ్గర ఉన్నంత మాత్రాన ఈ ఘటనకు సీఎం బాధ్యుడని అంటే ఎలా అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సుంకిశాల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022లోనే ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో, ఎవరి కోసం చేపట్టాల్సి వచ్చిందో కేసీఆర్, కేటీఆర్‌లలో ఎవరి మానసపుత్రికనో వారికే తెలియాలన్నారు.

గ్రావిటీ ద్వారా తాగునీరు అందిస్తాం : తుమ్మల

ప్రభుత్వంపై ఎత్తిపోతల భారం లేకుండా మిగిలిపోయిన 9.5 కిలోమీటర్ల ఎస్‌ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేసి నల్లగొండజిల్లాకు సాగునీటితో పాటు జంట నగరాలకు గ్రావిటీ ద్వారా తాగునీరు ఇవ్వటానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. వరద ఉధృతిని ఏజెన్సీ ఊహించకపోవడం, త్వరగా పూర్తి చేయాలన్న తపనో, త్వరగా నీరు ఇవ్వాలన్న తాపత్రయమో దురదృష్టవశాత్తు ఈ సంఘటన జరిగిందని భావిస్తున్నట్టు తెలిపారు. ఎప్పుడైతే మీడియా దృష్టికి వచ్చిందో వెంటనే ప్రభుత్వం స్పందించి కమిటీ వేసిందన్నారు. రిపోర్టు రాగానే ఏంచర్యలు తీసుకోవాలి.. బాధ్యులు ఎవరనేది తప్పకుండా ప్రభుత్వం నిర్ణయిస్తుందని తెలిపారు. సుంకిశాలను సందర్శించిన వారిలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇంజనీర్ల బృందం కూడా ఉంది.

పునర్నిర్మాణ వ్యయం రూ.20 కోట్లపైనే

రిటైనింగ్ వాల్ నిర్మాణ ఖర్చు భరించేందుకు కాంట్రాక్టర్ సంస్థ అంగీకరించినట్టు తెలిసింది. అయితే ఈ పనులకు సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నాగార్జున సాగర్ జలాశయంలో నీటిమట్టం తగ్గిన తర్వాతనే దెబ్బతిన్న భాగాన్ని తిరిగి నిర్మించే అవకాశాలున్నాయి. సుంకిశాల 'ఘటన'. రిటైనింగ్ వాల్ కూలిన వ్యవహారంలో గోప్యత ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. పనుల నాణ్యతపై కూడా ఆరా తీస్తోంది.


అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్


ఆమ్‌జెన్ ప్రతినిధులతో కలిసి ఒప్పంద పత్రాలు చూపుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్ రంజన్ తదితరులు

'ఫ్యూచర్ స్టేట్'గా తెలంగాణ

నినాదాన్ని ఖరారు చేస్తున్నామన్న సీఎం ● 'ఏఐ యూనికార్న్' కంపెనీల సీఈవోలతో భేటీ

'ఆమ్‌జెన్' రీసెర్చ్ సెంటర్‌తో 3 వేల ఉద్యోగాలు ● 'ఐటీ సర్వ్ అలయెన్స్' సమావేశంలో పాల్గొన్న రేవంత్, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం, నినాదం ఉన్నట్లుగానే తెలంగాణ రాష్ట్రానికి 'ఫ్యూచర్ స్టేట్' అనే నినాదాన్ని ఖరారు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. న్యూయార్క్‌కు 'అవుటాఫ్ మెనీ..వన్', టెక్సాస్‌కు 'లోన్ స్టార్ స్టేట్', కాలిఫోర్నియా కు 'యురేకా' అనే ట్యాగ్‌లైన్ ఉందని.. అదే రీతి లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ ఇకపై 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం కాలిఫోర్నియాలో 'ఏఐ యూనికార్న్' కంపెనీల సీఈఓలతో భేటీ అయ్యింది. భారతీయ కాన్సుల్ జనరల్ నిర్వహించిన 'ఏఐ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం'లో వారినుద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కంపెనీల ప్రతినిధులు తెలంగాణను సందర్శించి భవిష్యత్తును ఆవిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐ యూనికార్న్ వ్యవస్థాపకులు హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలు పరిశీలించాలని కోరారు.

హైదరాబాద్‌లో 'ఆమ్‌జెన్' రీసెర్చ్ సెంటర్

అమెరికాలో అతిపెద్ద బయో టెక్నాలజీ కంపెనీ 'ఆమ్‌జెన్' తెలంగాణలో కార్యకలాపాల విస్తరణలో భాగంగా నూతన 'రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం'ను ప్రారంభించనుంది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఏర్పాటవుతున్న ఈ సెంటర్ ద్వారా 3 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరలో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'ఆమ్‌జెన్' ఆర్ అండ్ డీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, సంస్థ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ ఛటోపాధ్యాయ భేటీ అయ్యారు. ఆమ్‌జెన్ కార్యకలాపాల విస్తరణకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడంపై రేవంత్, శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి రూపాయి భవిష్యత్తుకు పెట్టుబడి: సీఎం

ప్రతి రూపాయి భవిష్యత్తుకు పెట్టుబడి: సీఎం తెలంగాణలో పెట్టుబడుల ద్వారా హైదరాబాద్ అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని ఐటీ సేవల కంపెనీలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఐటీ సంస్థల అసోసియేషన్ 'ఐటీ సర్వ్ అలయెన్స్' సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం పాల్గొన్నారు. 'చారిత్రక నగరం హైదరాబాద్‌తో పాటు సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీ ఏర్పాటవుతోంది. ఇక్కడ పెట్టుబడిగా పెట్టే ప్రతి రూపాయి మీ భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది..' అని రేవంత్ చెప్పారు.

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు సహకరించండి: శ్రీధర్‌బాబు

ఏఐ, టెక్నాలజీ సెంటర్‌గా, ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన భవిష్యత్తు నగరంగా హైదరాబాద్ మారుతోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. వచ్చే పదేళ్లలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చడంలో అందరూ కలిసి రావాలన్నారు. కాగా ఈ ఏడాది చివరలో వేగాస్‌లో జరిగే 'ఐటీ సర్వ్ అలయెన్స్' వార్షికోత్సవానికి రావాల్సిందిగా సీఎం రేవంత్‌ను అలయెన్స్ ప్రతినిధులు ఆహ్వానించారు.

అడోబ్ సిస్టమ్స్ సీఈఓతో భేటీ


అడోబ్ సిస్టమ్స్ సీఈఓ శంతను నారాయణ్‌తో రేవంత్, శ్రీధర్‌బాబుల బృందం భేటీ అయింది. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 'హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ' నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలపై శంతను ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పాలు పంచుకునేందుకు అంగీకరించారు.

రూ.3,350 కోట్లతో గ్రీన్ డేటా సెంటర్

హైదరాబాద్‌లో అత్యాధునిక ఏఐ ఆధారిత గ్రీన్ డేటా సెంటర్‌ను రూ.3,357 కోట్ల (400 మిలియన్ యూఎస్ డాలర్లు) పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నట్లు ఆరమ్ ఈక్విటీ పార్ట్నర్స్ సంస్థ ప్రకటించింది. కాలిఫోర్నియా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో భేటీ అనంతరం ఆరమ్ ఈక్విటీ ఈ ప్రకటన చేసింది. గత ఏడాది 50 మిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడతామని ప్రకటించిన కంపెనీ.. తాజాగా 100 మెగావాట్ల ఆధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను 400 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పెట్టుబడి హైదరాబాద్‌లో అనేక ఉద్యోగాల కల్పనకు దోహద పడుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. భారత్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించేందుకు తమ పెట్టుబడి ఉపయోగపడుతుందని ఆరమ్ సీఈవో వెంకట్ బుస్సా ప్రకటించారు. ఈ–సేవ, ఈ–విద్య, ఈ– చెల్లింపులు వంటి సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు.

న్యాయవిచారణ జరిపించాలి

- కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టి చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ వైఫల్యం వల్లే ప్రజాధనం నీటిపాలు
- త్వరలో రిటైర్డ్ ఇంజనీర్లు, పార్టీ నేతలతో సుంకిశాలకు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం..పర్యవేక్షణ లోపంతోనే రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయి సుంకిశాల పంప్‌హౌస్ నీట మునిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆగస్టు 2న ఘటన జరిగినా అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయకుండా..రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను తొక్కిపెట్టిందన్నారు. సీఎంకు సమాచారం లేదంటే ఆయనకు పాలనపై పట్టు లేనట్టేనని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి తెలంగాణభవన్‌లో శుక్రవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పంప్‌హౌస్ నీట మునిగిన సమాచారం తెలియనంత మొద్దునిద్రలో ప్రభుత్వం ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారుల ఒత్తిడితో హడావుడిగా గేట్లు, మోటార్లు బిగించడంతో ఈ ఘటన జరిగిందని చెప్పారు. మున్సిపల్ మంత్రిత్వ శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే ఈ ఘటన జరిగిందని, సీఎం పదవికి ఆయన అనర్హుడు అని విమర్శించారు. 'చిత్తశుద్ధి ఉంటే కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టి కఠినచర్యలు తీసుకోవాలి. సుంకిశాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి. త్వరలో రిటైర్డ్ ఇంజనీర్లు, పార్టీ నాయకులతో కలసి సుంకిశాలను సందర్శించి ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం' అని కేటీఆర్ ప్రకటించారు.

వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

'గతంలో మేడిగడ్డ కుంగుబాటు ఘటన జరిగిన వెంటనే కాంట్రాక్టు సంస్థ ఎల్‌అండ్‌టీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ సుంకిశాల రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయిన ఘటనపై తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు మంత్రులు బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మా మీద బట్టకాల్చి మీద వేస్తే సహించేది లేదు. ప్రాజెక్టు డిజైన్ కాదు.. భట్టి ఆలోచన విధానమే లోపభూయిష్టంగా ఉంది. గతంలో మేడిగడ్డపై హడావుడి చేసిన ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) ఎందుకు రాలేదు. దీనిపై బీజేపీ నాయకులు, కేంద్ర సంస్థలు ఎందుకు స్పందించడం లేదు. పంప్‌హౌస్ మునకతో కోట్లాది రూపాయల సంపద నీటి పాలైంది. హైదరాబాద్ మహానగర ప్రజలకు తీరని నష్టం వాటిల్లింది. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని కాంగ్రెస్ బురదచల్లే ప్రయత్నాలు చేస్తోంది' అని కేటీఆర్ విమర్శించారు.

సాగర్‌కు పెరిగిన వరద



నాగార్జునసాగర్/దోమలపెంట: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు వచ్చే వరద పెరుగుతోంది. దీంతో శుక్రవారం 26 గేట్లలో 8 గేట్లు 10 అడుగులు, 18 గేట్లు 5అడుగుల మేర ఎత్తి దిగువకు 2,57,560 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా 28,988 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది.

- శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు 10 గేట్లను 14 అడుగుల మేర ఎత్తి 3,50,110 క్యూసెక్కుల నీరు, విద్యుదుత్పత్తి ద్వారా 63,556 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు వదులుతున్నారు. ఇదే సమయంలో జూరాల వద్ద 39 గేట్లు, విద్యుదుత్పత్తి, సుంకేశుల నుంచి కలిపి మొత్తం 3,29,576 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది.

సుంకిశాల, కాళేశ్వరం కట్టింది వారే

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా: సుంకిశాల పంప్‌హౌస్‌తోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు కూడా బీఆర్‌ఎస్ హయాంలోనే కట్టారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ ఇందులో సుంకిశాల కూలితే.. కాళేశ్వరం ప్రాజెక్టుకు పగుళ్లు వచ్చాయని, సుంకిశాల ఘటనపై విచారణ చేయిస్తామన్నారు. ఇక మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లను అక్కడ కట్టడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ముందే చెప్పినా వినకపోవడంతో ఎదురైన ఫలితం అందరం చూస్తున్నామని చెప్పారు. ఇంజనీర్లు చెప్పినట్టు కాకుండా కేసీఆర్ సొంత నిర్ణయాలు తీసుకోవడంతోనే కాళేశ్వరం కుంగుబాటుకు కారణమని భట్టి తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల లోపాలు, అవినీతిని ఎప్పుడు బయటపెట్టాలని చూస్తున్న తమకు సుంకిశాల ఘటన దాచిపెట్టాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళలు, గిడ్డంగుల సంస్థల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్త, కర్మ, క్రియ కేటీఆరే

కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్


మల్లు రవి


బలరాం

సాక్షి, న్యూఢిల్లీ: సుంకిశాల ప్రాజెక్టు కర్త, కర్మ, క్రియ మాజీ మంత్రి కేటీఆరే అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. బీఆర్‌ఎస్ హయాంలోనే టెండర్లు, పనులు, నిర్మాణ వ్యయం పెంపు జరిగాయని తెలిపింది. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు చేరి సుంకిశాల గోడ కూలిందని, నాసిరకంగా ప్రాజెక్టులు కట్టడం వల్ల రాష్ట్రానికి భారీ నష్టం జరిగిందన్నారు. సుంకిశాలలో జరిగిన నష్టాన్ని పనులు చేసిన కాంట్రాక్టర్‌తోనే భర్తీ చేయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కట్టిన ఏ ప్రాజెక్టూ సరిగాలేదని, డబ్బుల కోసమే తప్ప.. ప్రజలకు ఉపయోగపడే ఒక్క ప్రాజెక్టూ కట్టలేదని ఆరోపించారు. సుంకిశాల విషయంలో కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుకు మాజీ సీఎం కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పొంతనలేని సాక్ష్యాలతో జీవిత ఖైదా?

- ట్రయల్ కోర్టు తీర్పును తప్పుబట్టిన హైకోర్టు
- నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ ఉత్తర్వులు
- పదేళ్ల తర్వాత విడుదల కానున్న ఆటోడ్రైవర్ రాజు

సాక్షి, హైదరాబాద్: మహిళ హత్య కేసులో నిందితుడికి మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను శుక్రవారం హైకోర్టు రద్దు చేసింది. నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ.. అతనిపై ఎలాంటి ఇతర కేసులు లేకుంటే వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. పోలీసులు సమర్పించిన నిందితుడి వాంగ్మూలం ఆధారంగా శిక్ష విధించడం చెల్లదని, సాక్ష్యాధారాలు ముఖ్యమని ట్రయల్ కోర్టుకు సూచించింది. సాక్ష్యాధారాలు పొంతన లేకుండా ఉన్నాయని పేర్కొంటూ, సందేహాలతో (బెనిఫిట్ ఆఫ్ డౌట్) జీవిత ఖైదు విధించడాన్ని తప్పుపట్టింది. తీర్పు ప్రకారం జరిమానా వసూలు చేసి ఉంటే నిందితుడికి తిరిగి ఇచ్చేయాలని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో మహబూబ్ నగర్ జిల్లా కోడూరుకు చెందిన ఆటో డ్రైవర్ వడ్డే రాజు పదేళ్ల తర్వాత జైలు నుంచి విడుదల కానున్నాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

మహిళ మృతి కేసులో జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ జిల్లా అప్పాయ్‌పల్లి సరిహద్దులో శాంతమ్మ అనే మహిళ మృతదేహాన్ని 2014, ఏప్రిల్ 28న పోలీసులు కనుగొన్నారు. పుర్రెకు బలమైన గాయం కావడంతో ఆమె మృతి చెందినట్లు పోస్టుమార్టం చేసిన వైద్యుడు పేర్కొన్నారు. జూన్ 25న వడ్డే రాజును పట్టుకున్న పోలీసులు అతన్నుంచి మృతురాలి కాలిపట్టీలు, నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి మోటార్ సైకిల్‌ను కూడా సీజ్ చేశారు. తాను పలువురు మహిళలను హత్య చేసినట్లుగా రాజు అంగీకరించాడని పేర్కొంటూ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ వాదనను ట్రయల్ కోర్టు ఆమోదిస్తూ.. రాజుకు ఐపీసీ సెక్షన్ 302 కింద జీవిత ఖైదు విధిస్తూ 2015, మే 11న తీర్పునిచ్చింది. దీంతో పాటు సెక్షన్ 379 కింద రెండేళ్లు, సెక్షన్ 201 కింద మూడేళ్ల శిక్షతో పాటు రూ.5000 జరిమానా విధించింది.

సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం: హైకోర్టు

ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ 2015లో రాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది పులిమామిడి శశిధర్‌రెడ్డి (లీగల్ ఎయిడ్), మరోవైపు ఏపీపీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ట్రయల్ కోర్టు తీరును తప్పుబట్టింది. 'తన తల్లి మృతదేహాన్ని ఎప్పుడు కనుగొన్నాడో కుమారుడు సరిగా చెప్పడం లేదు. హైదరాబాద్‌లో ఉన్న తనకు 2014, మే 7న తల్లి చనిపోయినట్లు తెలిసిందని చెప్పాడు. అలాంటప్పుడు ఏప్రిల్ 28న మృతదేహాన్ని గుర్తించినట్లు చెప్పడం పొంతన లేకుండా ఉంది. అలాగే శవ పంచనామా సందర్భంగా కాలిపట్టీలు, ఇతర వస్తువులను గుర్తించామని చెప్పిన పోలీసులు.. తర్వాత రాజును అదుపులోకి తీసుకున్నప్పుడు స్వాధీనం చేసుకున్నామని చెప్పడంలో వ్యత్యాసం కనిపిస్తోంది. పోలీసులు సమర్పించిన నిందితుడి వాంగ్మూలం ఆధారంగా ట్రయల్ కోర్టు శిక్ష విధించరాదు. సాక్ష్యాధారాలు కూడా కీలకం. శరద్ బిర్ధీచంద్ సర్దా వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు పేర్కొన్న ఉత్తర్వులకు ట్రయల్ కోర్టు తీర్పు వ్యతిరేకంగా ఉంది. ఈ నేపథ్యంలో నిందితుడికి విధించిన యావజ్జీవ శిక్షతో పాటు ఇతర శిక్షలను రద్దు చేస్తున్నాం.. ' అని ధర్మాసనం పేర్కొంది.

నా కొడుకు బతికే ఉన్నాడా?!

ఆటో డ్రైవర్ రాజు తల్లి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దోస్తుల తో బయటకు వెళ్తున్నానని తల్లికి చెప్పి వెళ్లిన కొడుకు తిరిగి రాలేదు. పదేళ్లు గడిచిపోయాయి. అప్పట్నుంచీ జైల్లో ఉన్న కొడుకు తాజాగా హైకోర్టు తీర్పుతో విడుదలకానున్నాడని తెలిసినా నమ్మలేని అమాయకత్వం ఆ తల్లిది. వివరించి చెప్పేసరికి 'నా కొడుకు బతికే ఉన్నాడా? ఇంటికి వస్తాడా?' అంటూ సంభ్రమాశ్చర్యానికి లోనయ్యింది. ఆ కొడుకే మహిళ హత్య కేసులో జైలుకు వెళ్లిన మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజు. రాజు తల్లిదండ్రులు వడ్డె సత్తెమ్మ, అనంతయ్య రాళ్ల కొడుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. మొత్తం ఏడుగురు సంతానంలో రాజు నాలుగోవాడు. కాగా 2014లో జరిగిన ఓ మహిళ హత్య కేసులో జైలుకెళ్లాడు. అయితే పూర్తిగా నిరక్షరాస్యులు, అమాయకులైన రాజు కుటుంబీకులకు ఆ విషయం తెలియదు. దోస్తులతో బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. ఇన్నాళ్లూ రాజు ఏమయ్యాడన్నది తమకు తెలియదని సత్తెమ్మ, రాజు సోదరులు చెబుతున్నారు. కాగా రాజు బతికే ఉన్నాడని, జైలు నుంచి విడుదలై వస్తున్నాడని చెప్పడంతో సత్తెమ్మ ముఖంలో సంతోషం ఉప్పొంగింది. నిజంగా నా కొడుకు ఇంటికి వస్తడా? అంటూ అమాయకంగా ప్రశ్నించింది.

ముగిసిన 'స్వచ్ఛదనం, పచ్చదనం'

- పరిశుభ్రతపై అవగాహనకు ఐదు రోజుల పాటు నిర్వహణ
- 12,454 గ్రామపంచాయతీల్లో డాగ్ సర్వే
- విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు: మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో స్పెషల్ అధికారుల పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం తదితరాలపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశలో చర్యలు చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా.. మొక్కలు నాటడంతోపాటు, రహదారులను శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పూడికలు తీయడం, దోమల నివారణ, కుక్కల బెడద నివారణ తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. కుక్కల బెడద పెరుగుతున్న నేపథ్యంలో 12,454 గ్రామపంచాయతీల్లో 'డాగ్'సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్టెరిలైజేషన్ కోసం దాదాపు మూడున్నర లక్షల కుక్కలను గుర్తించారు. దాదాపుగా అన్ని గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి, జ్వరాల వ్యాప్తి ఏమైనా ఉందా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్లు, అసిస్టెంట్ కలెక్టర్లు, జిల్లా సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్డీఓ, డీపీఓ, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులంతా కలిపి మొత్తం 3,117 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలు, అధికారులు, సిబ్బందికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యంగా పనిచేస్తే అనుకున్న ఫలితాలు సాధిస్తామనడానికి ఈ స్పెషల్ డ్రైవ్ నిదర్శనమన్నారు.

అపోహ - వాస్తవం

సొరకాయ జలుబు చేస్తుందని చాలామంది తినరు. కాని అది వట్టి అపోహ మాత్రమే. ఇది జలుబుతో పాటు, కఫాన్ని కూడా తగ్గిస్తుంది.

- సొరకాయలో వంటికి చలువ చేసే గుణం ఉంది.
- కడుపులో మంటని, అతి దాహాన్ని సొరకాయ తగ్గిస్తుంది.
- అరికాళ్ళు పగిలినచోట సొరకాయ గుజ్జును రాసి మృదువుగా మర్దన చేస్తే ఉపశమనం కలుగుతుంది.
- సొరకాయ దగ్గు రాకుండా, కఫం లేకుండా చేస్తుంది.



బరువు తగ్గించే సూపర్ జ్యూస్



పెరిగిన బరువును తగ్గించుకోవడం కోసం నానా పాట్లు పడుతుంటారు. అయితే ఇప్పుడు చెప్పబోయే సూపర్ జ్యూస్‌ను తీసుకుంటే బరువు తగ్గడమే కాదు బాడీ మొత్తం డిటాక్స్ కూడా అవుతుంది. మరి ఇంకెందుకు ఆలస్యం... ఆ జ్యూస్ ఏంటీ..? దాన్ని ఎలా ప్రిపేర్ చేసుకోవాలి..? వంటి విషయాలపై ఓ లుక్కేసేయండి.

ముందుగా ఒక క్యారెట్, ఒక కీర దోసలను తీసుకోవాలి. వాటికి చెక్కు తీసి శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అలాగే ఒక పియర్ పండును కూడా తీసుకుని ముక్కలుగా తరుక్కోవాలి. ఇప్పుడు బ్లెండర్ తీసుకుని అందులో కట్ చేసి పెట్టుకున్న క్యారెట్ ముక్కలు, కీరదోస ముక్కలు, పియర్ పండు ముక్కలు, గింజ తొలగించిన మూడు ఖర్జూరాలు, చిటికెడు పింక్ సాల్ట్, చిటికెడు దాల్చిన చెక్క పొడి, ఒకటిన్నర గ్లాసుల నీళ్ళు పోసుకుని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.

అంతే! రుచికరమైన, ఆరోగ్యకరమైన క్యారెట్-కీర-పియర్ జ్యూస్ సిద్ధమైనట్లే. ఈ జ్యూస్‌ను ప్రతిరోజు ఉదయాన్నే తీసుకోవడం వల్ల అందులో ఉండే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్స్, ఇతర పోషకాలు శరీరంలోని వ్యర్థాలను తొలగించి బాడీని డిటాక్స్ చేస్తాయి. అలాగే అధిక కొవ్వును కరిగించి బరువు తగ్గేలా చేస్తాయి. అతి ఆకలి సమస్యను దూరం చేస్తాయి. కాబట్టి, ఎవరైతే బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నారో.. వారు తప్పకుండా ఈ జ్యూస్‌ను తీసుకునేందుకు ప్రయత్నించండి.

మొటిమలకు మస్టర్డ్ ఆయిల్



మొటిమలను తగ్గించుకోవాలంటే.. కొబ్బరి నూనెలో ఆవాలు వేయించి చల్లారిన తర్వాత ఆ నూనెను వడగట్టి రాత్రి నిద్ర పోవడానికి ముందు ఈ నూనెను ముఖానికి పట్టించి ఉదయాన్నే కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఆవాల నుంచి తీసిన నూనెలో విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తుంది. ఇది జుట్టు బాగా పెరగడానికి దోహదం చేస్తుంది. అంతే కాదు, చుండ్రు నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. కానీ ఆవాలను మోతాదుకు మించి ఒకేసారిగా ఎక్కువగా వాడితే టాక్సిక్ కారణంగా ఇబ్బందులు తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రుచికి ఘాటు... ఆరోగ్యానికి భేష



మనం వంటింట్లో ఉపయోగించే మసాలా దినుసుల్లో మిరియాలు ఒకటి. వీటిని జలుబు, దగ్గు, కఫంతో పాటు ఇతరత్రా అనారోగ్య సమస్యలను తగ్గించడంలో వాడుతూ ఉంటాం. మిరియాల వల్ల అనేక ఉపయోగాలు ఉంటాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఆహారంలో మిరియాలను విరివిగా వాడటం వల్ల అనేక వ్యాధుల బారినుంచి తప్పించుకోవచ్చు. మనం తిన్న ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేసి, గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో మిరియాలు ఎంతో సహాయపడతాయి. జీర్ణాశయంలో అనేక రకాల యాసిడ్ లు, ఎంజైమ్స్ ఉత్పత్తి అవుతాయి. ఇవి ఆహారం జీర్ణం అవ్వడంలో సహాయపడతాయి. అజీర్తి సమస్య ఉన్న వారు మిరియాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఈ యాసిడ్ లు, ఎంజైమ్స్ అధికంగా ఉత్పత్తి అవుతాయి. దీంతో ఆహారం త్వరగా జీర్ణం అయ్యి అజీర్తి సమస్య తగ్గుతుంది.

ఎలా తీసుకోవాలంటే..?

మిరియాలను హెర్బల్ టీ, నీళ్లు, పాలు, కషాయాలలో వేసి మరిగించుకొని తాగవచ్చు. మిరియాల పొడిని సలాడ్స్, మొలకెత్తిన విత్తనాలపై వేసుకొని తినవచ్చు ● చిటికెడు రాతి ఉప్పు, మిరియాల పొడి మిశ్రమాన్ని చిగుళ్లకు రాసుకుని, గోరువెచ్చని నీటి తో పుక్కిలిస్తే చిగుళ్లవాపు, రక్తం రావడం వంటివి తగ్గుతాయి ● రోజూ రెండు మిరియాలు నోట్లో వేసుకుంటే శరీరంలోని మెటబాలిజం క్రమబద్ధం అవుతుంది ● టీలో చిటికెడు మిరియాల పొడి వేసుకుని తాగితే మంచి ఫలితం ఉంటుంది ● మిరియాలు తరచు తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్, చర్మ, పెద్దపేగు క్యాన్సర్ల ముప్పు కూడా తగ్గుతుంది.



● బాడీ షేమింగ్

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా...

**బెంగళూరులోని కావేరీ నగర్‌లోని టెక్స్‌టైల్ ఔట్‌లెట్‌లో పనిచేస్తున్న సుమ, ఆమె స్నేహితురాలు నయన స్కూటీ మీద వెళుతున్నారు. వారిని కొంతదూరంగా ఫాలో అవుతున్న బైకర్ అడ్డగించి, 'ఇంకాస్త ఒళ్లు పెంచు బాగుంటావు' అంటూ బాడీ షేమింగ్‌కు పాల్పడ్డాడు. అతడిని అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఫొటోతీసి, పోలీస్ కేస్ పెట్టారు ఆ మహిళలు.
తమ చర్యల ద్వారా కించపరిచేవారిని ధైర్యంగా ఎదుర్కోవడమే సరైన సమాధానం.**

బ్యాంక్‌లో పని చేసే శివానీ సహోద్యోగుల నుంచి బాడీషేమింగ్ కు గురై ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఇటీవల బుల్లితెర నటి, కొరియోగ్రాఫ్ జ్యోతిరాజ్‌పైనా 'లావుగా ఉన్నావంటూ' చేసిన బాడీ షేమింగ్ కామెంట్స్‌కు హర్ట్ అయ్యి స్పెషల్ వీడియోను పోస్ట్ చేశారు. 'చాలా లావుగా ఉన్నావు, ఈ డ్రెస్సులు నీకు సరిపోవు, సన్నగా అవ్వాలి' అని, సన్నగా ఉన్నవారిని 'ఇంకా కొంచెం తినాలి' అని ఎవరైనా చెప్పడం బాడీ షేమింగ్‌కి ముందస్తు రూపాలు. ఎదుటి వ్యక్తులు ఎప్పుడూ మీ శరీరం గురించి ఏదో ఒక మాట చెప్పడానికి సిద్ధంగా ఉంటారు. అందరినీ మెప్పించలేం అనే విషయాన్ని మొదట గుర్తుంచుకోవాలి. అధిగమించడానికి ఏం చేయాలో కూడా తెలుసుకోవాలి.

మౌనంగా ఉండకూడదు



మన దేహం మనకు వరం. దానిని అంగీకరించాలి. మనకున్న ప్రతిభ గురించి ఆలోచించాలే తప్ప ఇతరత్రా లోపాన్ని చూసుకొని కుంగిపోకూడదు. ఎమోషనల్‌గా ఒక ట్రిగ్గరింగ్ పాయింట్ అనుకోవాలి. కామెంట్ చేసినవారిని ధైర్యంగా ఎదుర్కోవాలి. మన కాన్ఫిడెన్స్ అర్థమైతే మరొకరు కామెంట్ చేయడానికి వెనుకంజ వేస్తారు. బాడీషేమింగ్ చేసేవారిలో మానసిక ఎదుగుదల సరిగా లేదని అర్థం చేసుకోవాలి.

- ప్రొ. పి. జ్యోతిరాజ
సైకాలజిస్ట్, లైఫ్‌స్కిల్స్ ట్రెయినర్

మానసిక అనారోగ్యం

బాడీషేమింగ్ అనేది ఒక వ్యక్తి శరీరం గురించి ప్రతికూలంగా మాట్లాడే చర్య. వ్యక్తి శరీరం, వయసు, జుట్టు, బట్టలు.. ఇతర ఆకర్షణలకు సంబంధించినవి కావచ్చు. బాడీషేమింగ్ వల్ల తిండి పట్ల వ్యతిరేకత, డిప్రెషన్, యాంగ్జయిటీ, ఆత్మగౌరవం లోపించడం, తమ శరీరాన్ని తామే ద్వేషించే మానసిక ఆరోగ్య సమస్యలకూ దారితీస్తుంది. రచయిత్రి సబ్రినా స్ట్రింగ్స్ తన పుస్తకం 'ఫియరింగ్ ది బ్లాక్ బాడీ: ది రేషియల్ ఆరిజిన్స్ ఆఫ్ ఫ్యాట్ ఫోబియా'లో వలసవాదం, జాతి కారణంగా ఫ్యాట్ ఫోబియా ఏర్పడిందని వివరించారు.

అవాంఛిత రోమాలు

గతంలో పదవ తరగతిలో 98.5 శాతం మార్కులు సాధించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాచీ నిగమ్ అనే అమ్మాయి అవాంఛిత రోమాల కారణంగా సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. ప్రాచీ నిగమ్ 'నా మార్కులే ముఖ్యం. నా ముఖంపై ఉన్న వెంట్రుకలు కాదు' అని ఘాటైన సమాధానం ఇచ్చింది. 'పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే నేను సోషల్ మీడియాలో ట్రోల్ అయ్యేదానిని కాదు' అని కూడా బాధాకరంగా చెప్పింది. ఎంతో మంది తమ కామెంట్స్ ద్వారా ప్రాచీని సమర్థించారు.

సానుకూల లక్షణం

వ్యతిరేక ఆలోచనను వదిలేసి ముందు సానుకూల లక్షణాన్ని కనుగొనే అవకాశంగా కూడా దీనిని ఉపయోగించవచ్చు. ఎవరైనా మీ పట్ల వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు అందుకు ప్రతిగా 'నేను మీ చిరునవ్వును ఇష్టపడుతున్నాను' అని వారిలోని మంచి లక్షణాలను అభినందించండి. అంటే సమస్యను సానుకూలంగా మార్చడానికి ఇది ఒక మార్గం అన్నమాట.

అవమానించకండి...

ఇతరులను ఎగతాళి చేయడం, శరీరం గురించి అవమానకరంగా మాట్లాడటం మామూలే అనుకోవచ్చు. కానీ, అలాంటి పదాలను, చర్యలను అంగీకరించడం, సహించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే శరీరంలోని కలిగే రకరకాల మార్పులను ఎవరూ కోరుకోరు. వాటివల్లే సమస్యలు వస్తున్నాయనే విషయం స్పష్టంగా తెలిసినప్పుడు శరీర ఆకృతి గురించి, వెంట్రుకలు, పరిమాణాన్ని ఎత్తి చూపుతుంటే సంకోచించకుండా ముందే అడ్డుకట్టవేయాలి.

సున్నితంగా చెప్పండి..

మీ పట్ల మీరు గౌరవం, శ్రద్ధ పెంపొందించడానికి ఇదొక మంచి మార్గంగా సాధన చేయవచ్చు. మీ మీద మీకు నమ్మకం లేకపోతే ఏ చికిత్స వల్లా మీకు ప్రయోజనం ఉండదు. మీ స్నేహితులు లేదా ప్రపంచం ఏమనుకుంటుందో అనే దాని గురించి చింతించకండి. ఎవరైనా శరీరం గురించి, దుస్తులు లేదా వయస్సు లేదా పరిమాణం గురించి వ్యాఖ్యానిస్తే భరించకుండా 'మీరు చూపును సరిచేసుకోమం'టూ సున్నితంగా తెలియజేయండి.

సినిమా



హీరో సూర్యకు గాయం

హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య, జ్యోతిక, కార్తీక్ సుబ్బరాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఊటీలో జరుగుతోందని కోలీవుడ్ టాక్. అక్కడ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించే సమయంలో సూర్య తలకు గాయం అయిందనే వార్తలు వచ్చాయి. దీంతో సూర్యకు ఏమైందోనని ఆయన అభిమానులు కంగారుపడ్డారు. అయితే అది చిన్న గాయమేనని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సూర్య అన్న బాగానే ఉన్నారని ఈ చిత్రం సహ-నిర్మాతల్లో ఒకరైన రాజశేఖర్ పాండియన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. దీంతో సూర్య అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

స్టైలిష్ యాక్షన్


● అజిత్

అజిత్ కుమార్ హీరోగా నటిస్తున్న ద్విభాషా చిత్రం (తెలుగు, తమిళ్) 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ''స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న మూవీ ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ కీలకమైన షెడ్యూల్‌లో అజిత్‌తో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. 2025 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఎన్టీఆర్‌నీల్ ఆరంభం


● ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఎలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. శుక్రవారం 'ఎన్టీఆర్‌నీల్' సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు ఎన్టీఆర్. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ''ప్రేక్షకుల అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రంతో ప్రేక్షకులు ఓ సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పొందుతారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఇక ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభం అవుతుందని, 1969 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, కెమెరా: భువన్ గౌడ.

తల్లి మనసు ప్రారంభం


● అనంత కిశోర్, శ్రీనివాస్, సాత్విక్, సాహిత్య, ముత్యాల సుబ్బయ్య

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మాతగా అడుగు పెట్టారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏషియన్ గ్రూప్ ఎమ్‌డీ భరత్ నారంగ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత పోకూరి బాబురావు క్లాప్ కొట్టారు. నటుడు బ్రహ్మానందం, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు పాల్గొని, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ– ''తల్లి మనసు' టైటిల్‌ని బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి కథో అర్థం అవుతుంది. మా అబ్బాయి అభిరుచి వల్లే ఈ బ్యానర్ ఆరంభించాం'' అన్నారు. ''ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది'' అని చెప్పారు వి. శ్రీనివాస్ (సిప్పీ). ''నవంబర్ లేదా డిసెంబర్‌లో ఈ చిత్రం విడుదల చేస్తాం'' అని ముత్యాల అనంత కిశోర్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కోటి, కెమెరా: ఎన్. సుధాకర్ రెడ్డి.

ఆ ఈలలు అమితానందాన్నిచ్చాయి - భాగ్యశ్రీ బోర్సే



''నటి అవ్వాలనుకున్నప్పుడు భవిష్యత్ ఎలా ఉంటుందా అనిపించింది. దీనికి తోడు కొందరు కెరీర్‌లో వేగంగా ముందుకు వెళ్తుంటారు. వారిలా అవకాశాలు నాకు ఎప్పుడు వస్తాయా? అనే ఆలోచన కూడా ఉండేది. అయితే 'మిస్టర్ బచ్చన్' ట్రైలర్ లాంచ్ వేడుకలో నేను వేదికపైకి రాగానే ప్రేక్షకులు చేసిన హంగామా, ఈలలు చూసి నాకు అమితానందం కలిగింది. ఆ సమయంలో నాకు కన్నీళ్లొచ్చాయి (ఆనందంతో..)'' అన్నారు భాగ్యశ్రీ బోర్సే. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్ల సమావేశంలో భాగ్యశ్రీ బోర్సే చెప్పిన సంగతులు.

● నా స్వస్థలం మహారాష్ట్రలోని ఔరంగాబాద్. మా నాన్నగారి ఉద్యోగ రీత్యా నైజీరియాలోని లాగోస్‌కు షిఫ్ట్ అయ్యాం. నా స్కూలింగ్ అంతా అక్కడే జరిగింది. బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కోసం ముంబై వచ్చాను. గ్రాడ్యుయేషన్‌లో ఉండగానే మోడలింగ్ చేయమని నన్ను చాలామంది ప్రోత్సహించడంతో ట్రై చేద్దామనుకున్నాను. ఈ ఫీల్డ్ నాకు బాగా నచ్చింది. మెల్లిగా కెమెరా భయం కూడా పోయింది. ఆ తర్వాత కొన్ని కమర్షియల్ యాడ్స్ చేశాను ● 'మిస్టర్ బచ్చన్'లో తెలుగు మార్వాడీ అమ్మాయి జిక్కీ పాత్రలో కనిపిస్తాను. కథలో జిక్కీ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంది. మిస్టర్ బచ్చన్ (రవితేజ పాత్ర)ను మోటివేట్ చేసేలా నా రోల్ ఉంటుంది. అయినా మహిళలు లేకుండా ఏ కథ పూర్తి కాదని నా అభిప్రాయం. తెలుగు భాష మీద పట్టు సాధించి, జిక్కీ పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతానని హరీష్ శంకర్‌గారిని అడిగితే ఆయన ప్రోత్సహించారు ● హీరోగా రవితేజగారికి చాలా అనుభవం ఉంది. కానీ ఆయన ఓ కొత్త నటుడిగా సెట్స్‌లో కష్టపడతారు. పీపుల్ మీడియా వంటి ప్రముఖ సంస్థ ద్వారా హీరోయిన్‌గా పరిచయం అవుతుండటం సంతోషంగా ఉంది. నాకు డ్యాన్స్ బ్యాగ్రౌండ్ లేదు. కానీ ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పుల్', 'సితార' పాటలకు మంచి స్పందన లభిస్తుండటం సంతోషాన్నిచ్చింది. ఇక నా నెక్ట్స్ మూవీస్ గురించి త్వరలో చెబుతాను.

ఈసారి తెలుగమ్మాయిని పరిచయం చేస్తున్నాను - వైవీఎస్ చౌదరి


● వైవీఎస్ చౌదరి, వీణా రావు, గీత

''నేను పరిచయం చేసిన ఎంతోమంది హీరోయిన్లు స్టార్స్‌గా వెలిగారు. అయితే ఇందులో చాలా మంది ముంబై నుంచి వచ్చిన వారే. ఈసారి మన తెలుగమ్మాయిని హీరోయిన్‌గా పరిచయం చేయాలని వీణా రావుని ఎంచుకున్నా. ఈ మూవీలో అతిరథ మహారథులు ఇంకెందరో ఉంటారు. అలాగే కొత్త వారికి కూడా అవకాశం ఇస్తున్నాం'' అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. దివంగత హరికృష్ణ కుమారుడు, దివంగత జానకి రామ్ (ఎన్టీఆర్ సోదరుడు) తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి ఇటీవల ఓ సినిమాని ప్రకటించారు. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ సినిమాని నిర్మించనున్నారు. కాగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వీణా రావుని పరిచయం చేశారు వైవీఎస్ చౌదరి. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''మహేశ్‌బాబుగారి బర్త్ డే (ఆగస్టు 9) సందర్భంగా మా సినిమా కార్యక్రమం జరుపుకోవడం హ్యాపీ. ఈ మూవీకి కీరవాణిగారు సంగీతం అందించనుండటం నా అదృష్టం. సాయి మాధవ్ బుర్రా మాటలు, చంద్రబోస్‌గారి పాటలు మహాద్భుతంగా ఉండనున్నాయి'' అన్నారు. ''వైవీఎస్ చౌదరి, కీరవాణి, చంద్రబోస్ వంటి మహామహులతో పనిచేసే అవకాశం ఇచ్చిన గీతగారికి ధన్యవాదాలు'' అని డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా చెప్పారు.

సస్పెన్స్ డీల్


● ధరణి, హను కోట్ల, చందన

హను కోట్ల లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ది డీల్'. అనితా రావు సమర్పణలో పద్మా రమాకాంత రావు, కొల్వి రామకృష్ణ ఈ సినిమాను నిర్మించారు. ధరణి ప్రియ, చందన హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'ది డీల్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ– ''నటన, దర్శకత్వంపై మంచి అవగాహన ఉన్న హను కోట్ల 'ది డీల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడం హ్యాపీ. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''ఓ డిఫరెంట్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను... ఆదరించాలి'' అని తెలిపారు హను కోట్ల. నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్, రచయిత సాయిమాధవ్ బుర్రా, డిజిక్వెస్ట్ ఇండియా లిమిటెడ్ ఎమ్‌డీ కె.బసిరెడ్డి మాట్లాడారు.

నెత్తుటితో రాసిన ప్రేమకథ


● ఎస్ఎస్ సైదులు, భ్రమరాంబిక

ఎస్ఎస్ సైదులు హీరోగా, భ్రమరాంబిక అర్పిత హీరోయిన్‌గా నటించిన ద్విభాషా చిత్రం (తెలుగు, బంజారా) '1980లో రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌కి నిర్మాతలు రామ్ తాళ్లూరి, బెక్కం వేణుగోపాల్, నటులు సోహైల్, ఆటో రామ్‌ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. ''కృష్ణలంక... ఇక్కడ పుట్టే కులాన్ని బట్టి రాతలు రాయబడే ప్రాంతం. బతుకు బాగు కోసం ఎన్నో విప్లవ గేయాలు పాడిన గొంతులు మూగబోయిన ప్రాంతం, ఇది రాధాకృష్ణల ప్రేమకావ్యాన్ని నెత్తురుతో లిఖించబడ్డ ప్రాంతం'' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఎస్ఎస్ సైదులు మాట్లాడుతూ– ''మంచి కథతో తీసిన మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు. ''తనికెళ్లభరణిగారి వాయిస్‌తో మా సినిమాకు ఒక కొత్త ఫీల్ వచ్చింది'' అన్నారు ఇస్మాయిల్. ''1980 కి తగ్గట్లుగా ఈ సినిమాను ఇస్మాయిల్‌గారు తీశారు'' అని పేర్కొన్నారు ఊడుగు సుధాకర్.



ముగింపు వేడుకల్లో భారత బృందానికి పతాకధారిగా హాకీ జట్టు గోల్‌కీపర్ శ్రీజేశ్

పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో పాల్గొనే భారత బృందానికి పురుషుల విభాగం నుంచి హాకీ జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ పతాకధారిగా వ్యవహరిస్తాడు. రజత పతకం నెగ్గిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాను పతాకధారిగా ఎంపిక చేయాలని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) భావించింది. ఈ విషయంపై నీరజ్‌తో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష చర్చించింది. అయితే అంతర్జాతీయ హాకీ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించిన శ్రీజేశ్ ఈ గౌరవానికి అర్హుడని, అతనికే ఈ బాధ్యతలు ఇవ్వాలని నీరజ్ అభిప్రాయపడ్డాడు. దాంతో ఐఓఏ శ్రీజేశ్‌కు అవకాశం ఇచ్చింది. గురువారం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు 2–1తో స్పెయిన్‌పై గెలిచి వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ ఒలింపిక్స్‌లోనూ భారత విజయాల్లో శ్రీజేశ్ కీలకపాత్ర పోషించాడు. ఇంతకుముందే మహిళల విభాగం నుంచి భారత షూటర్ మనూ భాకర్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. ఆదివారంతో పారిస్ ఒలింపిక్స్ ముగియనున్నాయి. ప్రారంభ వేడుకల్లో టీటీ స్టార్ ఆచంట శరత్ కమల్, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

బ్రేక్ డ్యాన్స్‌లో 'ఇండియా' జోరు


ఇండియా సర్జో విన్యాసం



విశ్వక్రీడల్లో తొలిసారి ప్రవేశ పెట్టిన బ్రేక్ డ్యాన్స్ (బ్రేకింగ్) ఈవెంట్‌లో ఇండియా జోరు సాగుతోంది. అదేంటి ఈ విభాగంలో భారత్ నుంచి ఒక్క డాన్సర్ కూడా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేదు కదా అని అనుకుంటున్నారా.. ఇండియా అంటే భారత్ అనుకుంటే మీరు పొరబడినట్లే. నెదర్లాండ్స్‌కు చెందిన 16 ఏళ్ల యువ డాన్సర్ ఇండియా సర్జో... 'పారిస్' క్రీడల్లో తాను పోటీపడుతున్న నాలుగు విభాగాల్లోనూ సెమీ ఫైనల్‌కు చేరింది. సాధారణంగా బ్రేక్‌డ్యాన్స్‌లో పాల్గొనే డాన్సర్లు 'బి' గర్ల్స్, 'బి' బాయ్స్ అని ఆసక్తికర పేర్లు వినియోగిస్తారు. కానీ 16 ఏళ్ల సర్జో మాత్రం తన అసలు పేరుతోనే పోటీల్లో దిగింది. 'బి-గర్ల్' పేరు ఎందుకు పెట్టుకోలేదని చాలా మంది అడుగుతున్నారు. కానీ చిన్నప్పటి నుంచి నాకు అలాంటి ప్రత్యేకమైన పేరు ఎవరూ పెట్టలేదు. అందుకే ఇండియా పేరుతోనే బరిలోకి దిగుతున్నా' అని సర్జో వెల్లడించింది.

ప్రపంచ రికార్డు... పసిడి పతకం

400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా మహిళా అథ్లెట్ సిడ్నీ మెక్లాఫ్లిన్ ఘనత



పారిస్: ఒలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టి 40 ఏళ్లయ్యాయి. అయితే ఇప్పటి వరకు ఈ విభాగంలో ఏ అథ్లెట్ వరుసగా రెండు స్వర్ణాలు సాధించలేదు. కానీ 'పారిస్'లో అమెరికా క్రీడాకారిణి సిడ్నీ మెక్లాఫ్లిన్ లెవ్రోన్ ఈ ఘనత సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం గెలిచిన సిడ్నీ మెక్లాఫ్లిన్ అదే ఫలితాన్ని పారిస్‌లో పునరావృతం చేసింది. ఈసారి ఏకంగా కొత్త ప్రపంచ, ఒలింపిక్ రికార్డులను కూడా సృష్టించింది. శుక్రవారం జరిగిన 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 25 ఏళ్ల సిడ్నీ 50.37 సెకన్లలో పూర్తి చేసి కొత్త ప్రపంచ, ఒలింపిక్ రికార్డులను నెలకొల్పింది. ఈ ఏడాది జూన్ 30న 50.65 సెకన్లతో తానే సాధించిన ప్రపంచ రికార్డును సిడ్నీ తిరగరాసింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సిడ్నీ 51.46 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకం నెగ్గింది. ఈ సమయాన్ని కూడా ఆమె 'పారిస్'లో అధిగమించింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు ఈ విభాగంలో సిడ్నీ మెక్లాఫ్లిన్ ఐదుసార్లు కొత్త ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది.

అమ్మకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు


- 200 మీటర్ల స్ప్రింట్ విజేత లెట్సిల్ టెబోగో
- బోట్స్‌వానా చరిత్రలో తొలి ఒలింపిక్ స్వర్ణం
- నోవా లైల్స్‌కు కాంస్యం





పారిస్: ఒలింపిక్స్ అథ్లెటిక్స్ విభాగంలో ఆసక్తికర ఈవెంట్‌లలో ఒకటైన పురుషుల 200 మీటర్ల పరుగులో కొత్త చాంపియన్ అవతరించాడు. బోట్స్‌వానాకు చెందిన లెట్సిల్ టెబోగో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 21 ఏళ్ల టెబోగో 19.46 సెకన్లలో పరుగు పూర్తి చేశాడు. టోక్యోలో రజతం సాధించిన బెడ్‌నారెక్ (అమెరికా; 19.62 సెకన్లు) ఈసారి కూడా రజతంతో సరి పెట్టుకున్నాడు. 100 మీటర్ల పరుగు విజేత అయిన మరో అమెరికా అథ్లెట్ నోవా లైల్స్‌కు (19.70 సెకన్లు) కాంస్యం దక్కింది. గత ఒలింపిక్స్‌లోనూ లైల్స్‌కు కాంస్యమే లభించింది. కోవిడ్‌తో బాధపడుతూనే బరిలోకి దిగిన లైల్స్ అంచనాలకు తగినట్లుగా రాణించలేకపోయాడు.

ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికాకు పొరుగున బోట్స్‌వానా ఉంది. 26 లక్షల జనాభా కలిగిన ఈ దేశ చరిత్రలో ఇదే తొలి ఒలింపిక్ స్వర్ణ పతకం కావడం విశేషం. గత ఏడాది బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో టెబోగో 100 మీటర్లలో రజతం, 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించాడు. అతని కెరీర్ ఎదుగుదలలో తల్లి ఎలిజబెత్ సెరాతివా పాత్ర ఎంతో ఉంది. అయితే అతను ఒలింపిక్ సన్నాహాల్లో ఉన్న సమయంలో 44 ఏళ్ల వయసులో ఆమె బ్రెస్ట్ క్యాన్సర్‌తో మరణించింది. తన చేతి వేలి గోర్లపై తల్లి పేరు రాసుకొని అతను రేస్‌లో పాల్గొన్నాడు. పరుగు పూర్తి కాగానే జాతీయ పతాకాన్ని ఒంటిపై కప్పుకున్న టెబోగో భుజాలపై తన రెండు షూస్ వేసుకొని భావోద్వేగంతో కన్నీళ్ల పర్యంతమయ్యాడు. అందులో ఒక షూను తీసి అతను కెమెరాకు చూపించాడు. దానిపై అతని తల్లి పేరు, పుట్టిన తేదీ రాసి ఉన్నాయి. ప్రేక్షక సమూహంలో ఉన్న అతని చెల్లెలు కూడా అన్న ప్రదర్శనకు జేజేలు పలికింది. 'నేను ఒలింపిక్ పతకం గెలవాలని ఆమె ఎంతో కోరుకుంది' అని టెబోగో చెప్పాడు. మరోవైపు టెబోగో విజయంతో బోట్స్‌వానా దేశంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ విజయంపై ప్రజలంతా సంబరాలు చేసుకోవాలంటూ దేశాధ్యక్షుడు మాగ్‌వీట్సీ మసీసీ శుక్రవారం 'హాఫ్ డే' సెలవు ప్రకటించడం విశేషం.


రజత పతకంతో నీరజ్ చోప్రా


స్వర్ణంతో అర్షద్ నదీమ్

'నేను పెట్టుకున్న లక్ష్యం సాధిస్తాను. భవిష్యత్తులో జావెలిన్‌ను సుదూరం విసరగలుగుతాననే నమ్మకముంది. అదే పనిగా శ్రమిస్తా. కఠోరంగా సాధన చేస్తా. చివరకు దీన్ని సాధించేదాకా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటా' – నీరజ్

నదీమ్‌కు 10 కోట్ల నజరానా

కరాచీ: దాతల విరాళంతో జావెలిన్‌ను కొనుగోలు చేసి పారిస్‌లో పసిడి పతకం సాధించిన పాకిస్తాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ పంట పండింది. పంజాబ్ ప్రావిన్స్ రాష్ట్రం ముఖ్యమంత్రి మరియం నవాజ్ (మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె) ఒలింపిక్ చాంపియన్‌కు పాకిస్తాన్ కరెన్సీలో రూ. 10 కోట్లు (భారత కరెన్సీలో రూ. 3 కోట్లు) నజరానా ప్రకటించారు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	32	25	20	77
2	అమెరికా	31	39	38	108
3	ఆస్ట్రేలియా	18	16	14	48
4	ఫ్రాన్స్	14	20	22	56
5	బ్రిటన్	14	20	22	56
6	జపాన్	14	8	13	35
7	దక్షిణ కొరియా	13	8	7	28
8	నెదర్లాండ్స్	12	6	9	27
9	ఇటలీ	11	11	11	33
66	భారత్	0	1	5	6

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.



అమన్ కంచు పట్టు

కాంస్య పతకం గెలిచిన భారత రెజ్లర్

57 కేజీల విభాగంలో మూడో స్థానం | ప్లే ఆఫ్ బౌట్‌లో ప్యూర్టోరికో రెజ్లర్‌పై 13-5తో విజయం

కుస్తీ క్రీడలో బీజింగ్ ఒలింపిక్స్ నుంచి మొదలైన భారత 'పట్టు' పారిస్ ఒలింపిక్స్‌లోనూ కొనసాగింది. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ క్రీడాంశంలో భారత్‌కు పతకం లభించింది. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో ఈసారి భారత్ నుంచి అమన్ సెహ్రావత్ రూపంలో ఒక్కడే అర్హత సాధించాడు. ఆ ఒక్కడే పతక వీరుడయ్యాడు. 57 కేజీల విభాగంలో పోటీపడ్డ అమన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో 57 కేజీల విభాగంలోనే భారత్‌కు రజత పతకం అందించిన రవి దహియాను జాతీయ ట్రయల్స్‌లో ఓడించిన అమన్ తనలో ఒలింపిక్ పతకం తెచ్చే సత్తా ఉందని తాజా ప్రదర్శనతో నిరూపించాడు. అమన్ కాంస్యంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో ఆరో పతకం చేరింది.

పారిస్: అంచనాలకు అనుగుణంగా రాణించిన భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో అమన్ 13–5 పాయింట్ల తేడాతో డారియన్ టోయ్ క్రూజ్ (ప్యూర్టోరికో)పై విజయం సాధించాడు. అండర్–23 విభాగంలో ప్రపంచ చాంపియన్ అయిన 21 ఏళ్ల అమన్ భారత్ నుంచి పురుషుల విభాగంలో ఒక్కడే ప్రాతినిధ్యం వహించాడు. డారియన్‌తో జరిగిన కాంస్య పతక బౌట్ ఆరంభంలో హోరాహోరీగా సాగింది. ఒకదశలో 2–3తో వెనుకబడ్డ అమన్ నెమ్మదిగా తన పట్టు ప్రదర్శించాడు. మూడు నిమిషాల నిడివిగల తొలి భాగం ముగిసేసరికి అమన్ 6–3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. రెండో భాగంలోనూ అమన్ నేర్పుతో పోరాడాడు. మొదట్లో రెండు పాయింట్లు కోల్పోయినా... వెంటనే తేరుకొని పొరపాట్లకు తావివ్వకుండా వ్యూహాత్మకంగా ఆడాడు. ఈ క్రమంలో దూకుడు పెంచి డారియన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి వరుసగా 2,2,2,1 పాయింట్లు సాధించి 13–5తో ఆధిక్యంలోకి వెళ్లి విజయంతోపాటు కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు.

7 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం సాధించిన ఏడో భారతీయ రెజ్లర్‌గా అమన్ గుర్తింపు పొందాడు. గతంలో ఖాషాబా జాదవ్ (1952 హెల్సింకి: కాంస్యం), సుశీల్ కుమార్ (2008 బీజింగ్: కాంస్యం... 2012 లండన్: రజతం), యోగేశ్వర్ దత్ (2012 లండన్: కాంస్యం), సాక్షి మలిక్ (2016 రియో: కాంస్యం), రవి దహియా (2020 టోక్యో: రజతం), బజరంగ్ పూనియా (2020 టోక్యో: కాంస్యం) ఈ ఘనత సాధించారు.

అనాథగా వచ్చి అద్భుతం చేసి...

స్ఫూర్తిదాయకం అమన్ ప్రస్థానం





'గెలవడం అనేది నిజంగా అంత సులువే అయితే అందరూ అదే చేసేవాళ్లు'... ఢిల్లీలోని ప్రతిష్టాత్మక రెజ్లింగ్ శిక్షణా కేంద్రం 'ఛత్రశాల్'లో అమన్ సెహ్రావత్ గదిలో అతని మంచం పక్కన చేతి రాతతో రాసుకున్న ఈ క్యాప్షన్ కనిపిస్తుంది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినప్పుడు 'క్వాలిఫైడ్ అథ్లెట్' అంటూ ఇచ్చిన సర్టిఫికెట్ కూడా మరో పక్కన ఉంటుంది. ఒలింపిక్స్ ఐదు రింగులతో పాటు పతకం చిత్రాన్ని కూడా అక్కడ అతను అంటించుకున్నాడు. ఇప్పుడు అక్కడ బొమ్మ మాత్రమే కాదు అసలు ఒలింపిక్ పతకమే వేలాడనుంది! ఈ మెగా ఈవెంట్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన 21 ఏళ్ల అమన్ తన తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. భారత్ తరఫున అన్ని కేటగిరీలు కలిపి పురుషుల విభాగంలో బరిలోకి దిగిన ఒకే ఒక్కడు ఇప్పుడు కాంస్యంతో మెరిశాడు. ఛత్రశాల్ సెంటర్‌లో యువ రెజ్లర్లకు స్ఫూర్తినివ్వడం కోసం దేశానికి కీర్తిని తెచ్చిన రెజ్లర్ల ఫొటోలను పెట్టారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన సుశీల్ కుమార్, బజరంగ్ పూనియా, యోగేశ్వర్ దత్, రవి దహియాలతో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అతి పిన్న వయస్కుడైన అమిత్ దహియా ఫొటో కూడా ఉంటుంది. ప్రతీ రోజూ ప్రాక్టీస్ కోసం అక్కడి నుంచే నడిచే అమన్ తన గురించి కూడా కలకన్నాడు. అతను ఢిల్లీ చేరేసరికి అతని ఫొటో కూడా సిద్ధమైపోతుందేమో!

తల్లిదండ్రులను కోల్పోయి...

హరియాణాలోని బిరోహర్‌కు చెందిన అమన్ తొమ్మిదేళ్ల వయసులో నాన్న ప్రోత్సాహంతో మట్టిలో రెజ్లింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ రజతం గెలిచిన క్షణాన్ని టీవీలో చూసిన అతను ఎప్పటికైనా ఢిల్లీలో ఛత్రశాల్ స్టేడియానికి వెళ్లి గొప్ప రెజ్లర్‌ను అవుతానంటూ నాన్నకు చెప్పేవాడు. దురదృష్టవశాత్తూ ఏడాది తిరిగేలోగా అతని తల్లిదండ్రులు అనూహ్యంగా మరణించారు. దాంతో కొందరు సన్నిహితులు 11 ఏళ్ల వయసులో ఛత్రశాల్ స్టేడియంకు తీసుకొచ్చి చేర్పించారు. అప్పటి నుంచి అతనికి ఆ కేంద్రమే సొంత ఇల్లుగా, అతని లోకమంతా రెజ్లింగ్‌మయంగా మారిపోయింది. ప్రాక్టీస్ తప్ప మరో పని లేకుండా అమన్ గడిపేవాడు. కోచ్ లలిత్ కుమార్ అతడిని తీర్చిదిద్దాడు.

అండర్-23 ప్రపంచ విజేతగా...

18 ఏళ్ల వయసులో తొలిసారి జాతీయ విజేతగా నిలిచిన అనంతరం అమన్ జూనియర్ స్థాయిలో పలు అంతర్జాతీయ పతకాలు గెలుచుకున్నాడు. ఆసియా క్యాడెట్స్, వరల్డ్ క్యాడెట్స్, ఆసియా అండర్–20, ఆసియా అండర్–23 చాంపియన్‌షిప్‌లలో అతను సాధించిన విజయాలు అమన్‌కు గుర్తింపు తెచ్చి పెట్టాయి. అయితే 19 ఏళ్ల వయసులో అండర్–23 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించడంతో అతనిపై అందరి దృష్టి పడింది. భవిష్యత్తులో అద్భుతాలు చేయగల ఆటగాడిగా అందరూ అంచనాకు వచ్చారు. వేర్వేరు గ్రాండ్ ప్రిలు, ఇన్విటేషన్ టోర్నీలలో కూడా వరుస విజయాలు సాధించడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ క్రమంలో సీనియర్ స్థాయిలో సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైంది. అమన్ ఎక్కడా తగ్గకుండా తన ఆటలో మరింత పదును పెంచుకున్నాడు. ఫలితంగా 2022 ఆసియా క్రీడల్లో కాంస్యం, గత ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం అతని ఖాతాలో చేరాయి.

సుశీల్ ఫోన్ కాల్‌తో...

ఆసియా క్రీడల సెమీఫైనల్లో, ఆ తర్వాత ఆసియా క్వాలిఫయిర్స్‌లో బలహీన డిఫెన్స్‌తో అమన్ పరాజయంపాలై కాస్త నిరాశ చెందాడు. ఆ సమయంలో అతనికి తీహార్ జైలు నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అది చిరపరిచితమైన గొంతే. తన కెరీర్ ఆరంభంలో తనను ప్రోత్సహించి నువ్వు గొప్పవాడివి అవుతావని ఆశీర్వదించిన సుశీల్ కుమార్ చేసిన ఫోన్ అది. 'నీ ఆటకు డిఫెన్స్ పనికిరాదు. అలా చేస్తే ఎప్పటికీ గెలవలేవు. ఒక్క సెకను కూడా డిఫెన్స్‌పై దృష్టి పెట్టకుండా ఆరంభం నుంచి అటాక్ చేస్తేనే నీకు సరిపోతుంది. సీనియర్ స్థాయిలో డిఫెన్స్ టెక్నిక్ చూడ్డానికి బాగానే ఉంటుంది కానీ ఫలితాన్ని ఇవ్వదు. నేను కూడా అలాగే చేశాను' అంటూ సుశీల్ చెప్పడం అమన్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆ తర్వాత అతని ఆటలో దూకుడు మరింత పెరిగింది.

గురువునే ఓడించి...

పారిస్ ఒలింపిక్స్ అవకాశం అమన్‌కు అంత సులువుగా రాలేదు. ఛత్రశాల్‌లో తాను ఎంతో అభిమానించే రెజ్లర్ రవి దహియా. అతడిపై ఇష్టం కారణంగా అన్ని చోట్లా అతడినే అనుకరిస్తూ అతని శిష్యుడిగా తనను తాను భావించుకునేవాడు. కానీ గురువుతోనే పోటీ పడాల్సిన స్థితి వస్తే! అమన్‌కు అదే అనుభవం ఎదురైంది. రవి దహియా కేటగిరీ అయిన 57 కేజీల విభాగంలోనే తానూ పోటీ పడుతున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లేందుకు ఒకరికే అవకాశం ఉంది. కామన్వెల్త్ క్రీడల ట్రయల్స్‌లో రవి చేతిలో 0–10తో అమన్ చిత్తుగా ఓడాడు. కానీ ఆ తర్వాత అర్థమైంది తాను గురుభావంతో చూస్తే పని కాదని, ఒక ప్రత్యర్థిగా మాత్రమే చూడాలని. 2024 ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ ట్రయల్స్‌లో చెలరేగి రవిని ఓడించడంలో సఫలమైన అమన్... గురువు స్థానంలోకి వచ్చి కొత్త శకానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత క్వాలిఫయర్స్‌లోనూ చెలరేగి ఒలింపిక్ బెర్త్‌ను సాధించాడు. ఈ క్రమంలో వాంగెలోవ్, ఆండ్రీ యెట్‌సెంకో, చోంగ్ సాంగ్ వంటి సీనియర్లను అతను ఓడించగలిగాడు.

ఘనమైన రికార్డుతో...

ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాత ప్రపంచ రెజ్లింగ్‌కు రాజధాని లాంటి 'డేగిస్తాన్'లో అతను సన్నద్ధమయ్యాడు. ఛత్రశాల్‌లో మినహా అతని కెరీర్‌లో శిక్షణ తీసుకున్న మరో చోటు డేగిస్తాన్ (రష్యాకు సమీపంలో) మాత్రమే. అత్యుత్తమ సౌకర్యాలతో పాటు పలువురు చాంపియన్ ప్లేయర్ల మధ్య సాధన చేయడం, పదునైన స్పేరింగ్ పార్ట్‌నర్‌లు ఉండటంతో అమన్ ప్రాక్టీస్ జోరుగా సాగింది. చివరకు తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు అమన్ ఆగలేదు. ఫిబ్రవరి 2022లో సీనియర్ స్థాయిలో తొలిసారి అంతర్జాతీయ రెజ్లింగ్‌లో బరిలోకి దిగిన అమన్ అప్పటి నుంచి ఈ ఒలింపిక్స్‌కు ముందు వరకు 39 బౌట్‌లలో పాల్గొంటే 31 విజయాలు సాధించాడు. అంటే 79.4 విజయశాతం. ఇదే అతనిపై ఒలింపిక్ పతకం అంచనాలను పెంచింది. ఇప్పుడు తనకంటే ముందు ఒలింపిక్ పతకాలు సాధించిన తనలో స్ఫూర్తిని నింపిన దిగ్గజాల సరసన అతను సగర్వంగా నిలబడ్డాడు.

–సాక్షి క్రీడా విభాగం

సీఏఎస్‌లో ముగిసిన వినేశ్ కేసు వాదనలు

ఒలింపిక్స్ ముగిసేలోపు తీర్పు వచ్చే అవకాశం

పారిస్: భారత స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అనర్హతపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో విచారణ జరిగింది. సీఏఎస్ అడ్‌హక్ కమిటీ ఆర్బిట్రేటర్ డాక్టర్ అనాబెలె బెన్నెట్ ముందు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున సీనియర్ లాయర్లు హరీశ్ సాల్వే, విదూశ్‌పత్ సింఘానియా వాదనలు బలంగా వినిపించారు. ప్రతివాదులైన యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లు ప్రధానంగా నిబంధనల గురించే వివరించింది. దీనిపై తమ వాదనే పైచేయి సాధిస్తుందని, సానుకూల తీర్పు వస్తుందని ఐఓఏ కొండంత ఆశతో ఎదురుచూస్తోంది. మొత్తానికి రెండు రోజులుగా జరుగుతున్న విచారణ శుక్రవారంతో పూర్తయింది. ఆదివారం మెగా ఈవెంట్ ముగియనున్న నేపథ్యంలో నేడో రేపో సీఏఎస్ తీర్పు వెలువడే అవకాశముంది. ఫైనల్స్ రోజు వేయింగ్‌లో 100 గ్రాముల అధిక బరువు వల్ల వినేశ్ అనర్హతకు గురైంది. దీంతో కనీసం ఖాయమనుకున్న రజతం కూడా చేజారింది. దీనిపై సవాలు చేసిన ఫొగాట్ తన సెమీస్ ప్రదర్శన వరకు వేయింగ్‌లో ఏ సమస్యా లేదని కాబట్టి సంయుక్తంగా రజత పతకం బహూకరించాలని సీఏఎస్‌లో అప్పీలు చేసుకుంది.

భారత మహిళల, పురుషుల 4x400 రిలే జట్లు విఫలం


జ్యోతిక శ్రీ

పారిస్: ఒలింపిక్స్‌లో కనీస అంచనాలను అందుకోలేకపోయిన భారత మహిళల, పురుషుల జట్లు 4x400 మీటర్ల రిలే ఈవెంట్లలో నిరాశపరిచి హీట్స్‌లోనే వెనుదిరిగాయి. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ, విత్యా రాంరాజ్, పూవమ్మ రాజు, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత మహిళల జట్టు హీట్స్‌లో పోటీపడ్డ ఎనిమిది జట్లలో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలవడం గమనార్హం. భారత బృందం 3 నిమిషాల 32.51 సెకన్లలో రేసును పూర్తి చేసి చివరి స్థానాన్ని దక్కించుకుంది. ముందుగా విత్యా రేసును ఆరంభించి 53.46 సెకన్ల తర్వాత బ్యాటన్‌ను జ్యోతిక శ్రీకి అందించింది. జ్యోతిక శ్రీ వాయువేగంగా పరుగెత్తి 51.30 సెకన్ల తర్వాత బ్యాటన్‌ను పూవమ్మ రాజుకు అందించింది. పూవమ్మ 54.80 సెకన్ల తర్వాత శుభకు బ్యాటన్ ఇచ్చింది. శుభ 52.95 సెకన్లలో 400 మీటర్లను పూర్తి చేసింది. ఈ నలుగురిలో జ్యోతిక శ్రీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. అనస్, అజ్మల్, అమోజ్, రాజేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు 3 నిమిషాల 00.58 సెకన్లలో గమ్యానికి చేరి నాలుగో స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా భారత బృందం పదో స్థానాన్ని దక్కించుకుంది.

సాక్షి బిజినెస్
శనివారం
10-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
820	251
79,706	24,368

విదేశీ సూచీలు (తొలి సెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,754	▲	95
డోజోన్స్	39,539	▲	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,168	▲	23
డాక్స్	17,723	▲	42
షాంఘై	2,862	▲	8
నికాయ్	35,025	▲	194

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,663	▲	458
బంగారం (99.5 స్వచ్ఛత)	68,384	▲	456
వెండి (కిలో)	80,263	▲	1,383

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.58	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.96	108.52
€	యూరో	ఎస్‌బీఐ	90.63	93.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.43	57.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	56.45
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.12	65.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67

ఓపెన్ ఆఫర్‌కు అల్ట్రాటెక్ రెడీ

- ఐసీఎల్‌లో 26% వాటాపై కన్ను
- షేరుకి రూ. 390 ధరలో కొనుగోలు



న్యూఢిల్లీ: ఇండియా సిమెంట్స్(ఐసీఎల్)లో 26 శాతం వాటా కొనుగోలుకి ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు ముసాయిదాను దాఖలు చేసింది. షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల షేర్లను పబ్లిక్ నుంచి కొనుగోలు చేయనుంది. దీనికి రూ.3,142 కోట్లు వెచ్చించనుంది. ముసాయిదా ప్రకారం ఐసీఎల్ వాటాదారులకు సెప్టెంబర్ 19న ప్రారంభంకానున్న ఓపెన్ ఆఫర్ అక్టోబర్ 3న ముగియనుంది. ఆఫర్ ధర శుక్రవారం ధర రూ. 367తో పోలిస్తే 6.3% అధికం. ఐసీఎల్‌లో ప్రమోటర్ల నుంచి 32.72% వాటాను అల్ట్రాటెక్ సొంతం చేసుకోనున్న సంగతి తెలిసిందే. ఇందుకు రూ. 3,954 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. సెబీ నిబంధనల ప్రకారం ఓపెన్ ఆఫర్ ఇస్తోంది. ఇప్పటికే ఐసీఎల్‌లో ఇన్వెస్టర్‌గా అల్ట్రాటెక్ 23% వాటాను రూ.1,900 కోట్లకు దక్కించుకుంది. వెరసి ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 55.49 శాతానికి చేరనుంది.

కెనరా బ్యాంక్ రుణ రేట్లూ పెరిగాయ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ కూడా రుణ రేట్ల పెంపులో పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా బాటన నడిచింది. అన్ని కాలపరిమితుల రుణ రేటును 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్ఆర్) రుణ రేటు 0.05 శాతం పెరగడంతో దీనికి అనుసంధానమైన అన్ని కాల పరిమితుల రుణరేట్లు పెరగనున్నాయి. కొత్త రేట్లు ఆగస్టు 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. ఆటో, వ్యక్తిగత రుణాలు సహా కన్జూమర్ రుణాలపై ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ రేటు 8.95% నుంచి 9 శాతానికి ఎగసింది.

బ్లూచిప్స్ బూస్ట్!

- సూచీలకు రిలయన్స్, ఇన్ఫీ షేర్ల దన్ను
- సెన్సెక్స్‌కు 820 పాయింట్ల లాభం



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం మేర లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 820 పాయింట్లు పెరిగి 79,706 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 251 పాయింట్లు బలపడి 24,368 వద్ద నిలిచింది. అమెరికాలో ఉపాధి పెరిగినట్లు గణాంకాలు వెల్లడి కావడంతో ఆర్థిక మాంద్య భయాలు తగ్గుముఖం పట్టాయి. చైనాలో ద్రవ్యోల్బణ డేటా వినియోగం పెరుగుతున్నట్లు సూచించాయి. దీంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి. అక్కడి నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ స్టాక్ సూచీలు ఉదయం భారీ లాభంతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో పాటు రిలయన్స్ (2%), ఇన్ఫీ(2%), టీసీఎస్(1.50%)లు రాణించడంతో సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోగలిగాయి.ఆసియాలో చైనా మినహా అన్ని దేశాల సూచీలు 2.50% వరకు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం రాణించాయి.

- మార్కెట్ ర్యాలీతో ఒక్కరోజులో రూ.4.46 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.446 లక్షల కోట్లకు చేరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఒక అకౌంట్‌కు నలుగురు నామినీలు!	ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ. 37,113 కోట్లు



ఓలా.. లాభాల రైడ్

ఫ్లాట్‌గా లిస్టయినా.. 20% జంప్

ముంబై: ఓలా ఎలక్ట్రిక్ షేర్లు లిస్టింగ్ రోజే లాభాల రైడ్ చేశాయి. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర (రూ.76) వద్ద ఫ్లాట్‌గా లిస్టయ్యింది. ఇంట్రాడేలో షేరును కొనేందుకు ఇన్వెస్టర్లు ఎగబడటంతో దూసుకుపోయింది. చివరికి 20% అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ.91.20 వద్ద లాకైంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,218 కోట్లుగా నమోదైంది.



కొత్త కార్ల పండగ!

సార్వత్రిక ఎన్నికలు.. మండుటెండలు.. కుండపోత వర్షాలు.. కార్ల కంపెనీల అమ్మకాలను గత మూడు నాలుగు నెలలూ గట్టిగానే దెబ్బకొట్టాయి. గ్రామీణ డిమాండ్‌తో జూలైలో మాత్రం కాస్త పుంజుకుని ఊరటనిచ్చాయి. నిండు కుండలా కార్ల నిల్వలు పేరుకుపోవడంతో డీలర్లు పండగ సీజన్ కోసం అవురావురుమని ఎదురుచూస్తున్నారు. మరోపక్క, అమ్మకాలు మందగించడంతో.. కార్ల కంపెనీలు గేరు మారుస్తున్నాయి. కొంగొత్త వాహన మోడళ్లను కారు ప్రియుల కోసం రెడీ చేస్తున్నాయి. ఆటోమొబైల్ సంస్థలు సేల్స్ పెంపుతో పండుగ చేసుకోవాలని చూస్తుండగా.. కస్టమర్లకు కూడా కొత్త కార్ల జాతర కనువిందు చేయనుంది. – సాక్షి, బిజినెస్ డెస్క్



పండుగ సీజన్‌కు 20 కొత్త కార్ల క్యూ...

- ఇందులో 12 పూర్తిగా నయా మోడల్స్
- ఎంట్రీకి పలు ఎస్‌యూవీలు రెడీ
- రేసులో టాటా కర్వ్, మహీంద్రా ఐదు డోర్ల థార్

రాబోయే పండుగ సీజన్ కోసం కార్ల కంపెనీలన్నీ 'కొత్త' వ్యూహంతో సిద్ధమవుతున్నాయి. దాదాపు 20 కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు అంచనా. ఇందులో 12 కార్లు పూర్తిగా కొత్తవి కావడం విశేషం. ప్రస్తుతం దేశంలో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్న స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ)పైనే కంపెనీలన్నీ ఎక్కువగా గురిపెట్టాయి. కొత్తగా విడుదలయ్యే వాటిలో 13 ఎస్‌యూవీ మోడల్స్ ఉండటం దీనికి నిదర్శనం. టాటా మోటార్స్, నిస్సాన్, సిట్రాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎంజీ మోటార్స్, కియా, హ్యుందాయ్, ఫోక్స్‌వ్యాగన్‌తో పాటు లగ్జరీ కార్ దిగ్గజాలు మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ తదితర కంపెనీలు వచ్చే మూడు నెలల్లో కొత్త ఎస్‌యూవీలతో మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. ఇక మారుతీ సుజుకీ, మెర్సిడెస్ నయా సెడాన్లతో అలరించనుండగా.. కియా, ఎంజీ మల్టీ పర్పస్ వాహనాలను (ఎంపీవీ) రంగంలోకి దించుతున్నాయి.



ఈవీలు, హైబ్రిడ్‌లు కూడా...

కొత్తగా లైన్ కడుతున్న వాహన మోడల్స్ కస్టమర్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా రకరకాల ఇంజిన్ ఆప్షన్లతో లభించనున్నాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు ఎలక్ట్రిక్ (ఈవీ) హైబ్రిడ్ (సీఎన్‌జీ+పెట్రోల్ వంటివి) ఇంజిన్లు సైతం వీటిలో ఉన్నాయి. ఈవీ విభాగాన్ని శాసిస్తున్న టాటా మోటార్స్ సరికొత్త ఎస్‌యూవీ కూప్ 'కర్వ్'తో పండగ చేసుకోవాలనుకుంటోంది. ఈ మోడల్‌లో పెట్రోల్, డీజిల్ వెర్షన్లతో పాటు ఈవీ వేరియంట్‌ను కూడా తీసుకొస్తోంది. ముందుగా ఈవీ 'కర్వ్'ను ప్రవేశపెట్టడం విశేషం. గత నెలలో నిస్సాన్ ఆవిష్కరించిన ప్రీమియం ఎస్‌యూవీ ఎక్స్-ట్రెయిల్ కూడా పండుగల్లో రోడ్డెక్కనుంది.

సేల్స్ తగ్గినా.. నిల్వల పెంపు..

ఈ ఆర్థిక సంవత్సరం మొదలు (ఏప్రిల్ నుంచి) వాహన అమ్మకాలు మందకొడిగానే సాగుతున్నాయి. ఎన్నికలతో పాటు మండుటెండలు కూడా వాహన విక్రయాలపై ప్రభావం చూపాయి. కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు కుమ్మేయడం కంపెనీల ఆశలపై నీళ్లు చల్లింది. అయితే, గ్రామీణ డిమాండ్ మళ్లీ పుంజుకోవడంతో జూలైలో ప్యాసింజర్ వాహన విక్రయాలు 10% పెరగడం విశేషం. కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేయడం.. పండుగల్లో భారీ డిమాండ్ ఆశలతో వాహన కంపెనీలు భారీగా నిల్వలు పెంచుకున్నాయి. డీలర్ల వద్ద సగటున 25–30 రోజుల నిల్వలు ఉంటాయని, ప్రస్తుతం 60–65 రోజుల నిల్వలు ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వీటి విలువ రూ.73,000 కోట్లుగా అంచనా.

సెప్టెంబర్‌తో షురూ...

దక్షిణాదిన కేరళ 'ఓనమ్'తో పండుగ సేల్స్ మొదలవుతాయి. ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరుపుకునే వినాయక చవితి, దుర్గాపూజ, దసరా, దీపావళి ఇలా వరుసగా అటు జనాలకు ఇటు కంపెనీలకూ పండుగే. మూడు నెలలుగా పేరుకున్న నిల్వలను పండుగల్లో విక్రయించడంతో పాటు కొత్త మోడళ్లతో కస్టమర్లను షోరూమ్‌లకు క్యూ కట్టించాలనేది వాహన సంస్థల వ్యూహం. మహీంద్రా సక్సెస్‌ఫుల్ ఎస్‌యూవీ 'థార్'లో (ప్రస్తుతం మూడు డోర్ల మోడల్ ఉంది) కొత్తగా ఐదు డోర్ల థార్ 'రాక్స్'ను తీసుకొస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున దీన్ని ఆవిష్కరించి.. పండుగ సీజన్లో మార్కెట్లోకి తీసుకొచ్చేలా కంపెనీ సన్నాహాలు చేస్తోంది. 'ఐదు డోర్ల థార్ కోసం మేము ముందుగా ప్లాన్ చేసిన ఉత్పత్తికి మరో 3,000–4,000 అదనంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నాం' అని ఎంఅండ్ఎం సీఈఓ (ఆటో, ట్రాక్టర్ల విభాగం) రాజేష్ జెజూరికర్ క్యూ1 ఆర్థిక ఫలితాల సందర్భంగా వెల్లడించారు.



పండుగ రేసు గుర్రాలు (అంచనా ధర రూ.లలో)..

- టాటా మోటార్స్-కర్వ్ ఈవీ (18-25 లక్షలు), కర్వ్ (రూ.10.5-20 లక్షలు),
- మారుతీ-స్విఫ్ట్ హైబ్రిడ్ (10 లక్షలు), డిజైర్-2024 (7-10 లక్షలు)
- మహీంద్రా-థార్ రాక్స్ (13-23 లక్షలు)
- నిస్సాన్ - ఎక్స్‌ట్రెయిల్ (49 లక్షల నుంచి)
- టయోటా బెల్టా - (9.5-12 లక్షలు)
- మెర్సిడెజ్-బెంజ్ - ఈక్యూఎస్ ఎస్‌యూవీ (2 కోట్లు)
- బీఎండబ్ల్యూ-ఎం3 (1.47 కోట్లు)
- రెనో-కార్డియన్ (10-12 లక్షలు)
- ఎంజీ-క్లౌడ్ ఈవీ (29-30 లక్షలు), గ్లోస్టర్-2024 (40 లక్షలు)
- స్కోడా-కొడియాక్-2024 (40-50 లక్షలు)
- బీవైడీ-సీగల్ ఈవీ (10 లక్షలు)
- కియా-ఈవీ9 (75-82 లక్షలు)
- ఆడి-క్యూ8 ఫేస్‌లిఫ్ట్ (రూ.1.17 కోట్లు)
- సిట్రాన్ - సీ3ఎక్స్ (రూ.11.5 -15 లక్షలు), బసాల్ట్ (రూ.8 లక్షలు)






సాక్షి స్పోర్ట్స్



జూనియర్ హాకీ జట్టు కోచ్‌గా శ్రీజేశ్!

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శనతో వరుసగా రెండో కాంస్య పతకం సాధించిన అనంతరం కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత హాకీ జట్టు గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ త్వరలోనే కొత్త అవతారంలో దర్శనమివ్వనున్నాడు. గోల్ పోస్ట్ ముందు తన అసమాన ప్రతిభతో దేశానికి ఎన్నో మధుర విజయాలు అందించిన శ్రీజేశ్.. ఇకపై జాతీయ జూనియర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'త్వరలోనే శ్రీజేశ్‌ను జూనియర్ (అండర్-21) జట్టు కోచ్‌గా నియమిస్తాం. దీని గురించి అతడితో మాట్లాడాం. యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయడంలో అతడికి మించిన వారు మరొకరు లేరు. దీంతో పాటు శ్రీజేశ్ స్థానాన్ని భర్తీ చేయనున్న గోల్ కీపర్లు సూరజ్ కార్కెరా, క్రిషన్ బహదూర్ పాఠక్‌కు కూడా దిశా నిర్దేశం చేయాల్సి ఉంటుంది' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేర్కొన్నాడు.

చిన్న దేశాలు... పెద్ద విజయాలు

జనాభాతో సంబంధం లేకుండా పతకాల వేటలో ముందంజ
పారిస్ ఒలింపిక్స్‌లో మెరిసిన చిన్న దేశాల క్రీడాకారులు

మహిళల 100 మీటర్ల పరుగులో సెయింట్ లూసియాకు చెందిన అల్‌ఫ్రెడ్ జూలియన్ 10.72 సెకన్లలో లక్ష్యానికి చేరి స్వర్ణం గెలిచింది. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో డొమెనికాకు చెందిన లెఫాండ్ థియా 15.02 మీటర్ల దూరం దూకి పసిడి పతకం కైవసం చేసుకుంది. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా.. సెయింట్ లూసియా జనాభా 1,80,000 కాగా.. డొమెనికా జనాభా 73 వేలు మాత్రమే. కరీబియన్ దీవుల్లోని అతి చిన్న దేశాలు విశ్వక్రీడల్లో సత్తా చాటుతున్నాయనడానికి ఇది నిదర్శనం. ఒలింపిక్స్ చరిత్రలో పసిడి గెలిచిన అతి తక్కువ జనాభా గల దేశంగా డొమినికా రికార్డుల్లోకెక్కింది. ఇవే కాకుండా.. పట్టుమని 10 లక్షల జనాభా కూడా లేని పదికి పైగా దేశాలు ఒలింపిక్స్‌లో చక్కటి ప్రదర్శన కనబరిచాయి. –సాక్షి క్రీడా విభాగం


ఒలింపిక్స్ అథ్లెటిక్స్ చరిత్రలో ఇప్పటి వరకు వందకు పైగా దేశాలు పతకాలు సాధించాయి. వాటిలో జనాభా పరంగా స్వర్ణం గెలిచిన అతిచిన్న దేశంగా డొమెనికా నిలిచింది. విశ్వక్రీడల్లో ఆ దేశానికి ఇదే తొలి పతకం కావడం మరో విశేషం. ఇప్పటి వరకు తమ దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పెద్దగా గుర్తింపు లేకున్నా... ఈ మెడల్ అనంతరం డొమినికాను ప్రపంచ చాంపియన్‌గా అందరూ గుర్తిస్తారని... ఆ దేశానికి తొలి పతకం అందించిన ట్రిపుల్ జంపర్ లెఫాండ్ థియా ఆశాభావం వ్యక్తం చేసింది. భిన్న భౌగోళిక పరిస్థితులు ఉండే డొమెనికాలో... క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యం అంతంత మాత్రమే. అలాంటి చోటు నుంచి 'పారిస్' క్రీడలకు నలుగురు అథ్లెట్లు అర్హత సాధించగా అందులో లెఫాండ్ థియా సాధించిన బంగారు పతకం... ఆ దేశానికి కీర్తి ప్రతిష్టలు కట్టబెట్టింది. 1996 అట్లాంటా ఒలింపిక్స్ నుంచి డొమెనికా విశ్వక్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తుండగా.. 28 ఏళ్ల తర్వాత ఆ దేశానికి మొదటి పతకం దక్కింది. ఈ ఏడాది ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గి ఆశలు రేపిన లెఫాండ్... 'పారిస్' క్రీడల్లోనూ అదే జోరు కొనసాగించింది. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో 15.02 మీటర్ల దూరం లంఘించి పసిడి పతకం కైవసం చేసుకుంది. 'ఇప్పుడు మేం కూడా ప్రపంచ చాంపియన్‌లమే. డొమెనికాకు ఒలింపిక్స్‌లో తొలి పతకం. అది కూడా పసిడి. చాలా గొప్పగా అనిపిస్తోంది. ఈ ఫలితంతో మా దేశంలో క్రీడలకు మరింత ప్రాధాన్యత దక్కుతుందనే నమ్మకం పెరిగింది. మా దేశ జనాభా సుమారు 73 వేలు. దేశానికి తొలి స్వర్ణం అందించడం మాటల్లో చెప్పలేని అనుభూతి. దేశం తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి మహిళా అథ్లెట్‌గా నిలవడం... అందులోనూ పతకం గెలవడం చాలా గర్వంగా ఉంది. చిన్న దేశం అంటే... పరిమిత వనరులు ఉంటాయనుకుంటారు. అయితే సంఖ్య కన్నా నాణ్యత ముఖ్యం అని నా ఉద్దేశం. ఈ విజయాన్ని దేశమంతా ఆస్వాదిస్తుంది. డొమెనికా స్టేడియంలో అథ్లెటిక్స్ కోసం మెరుగైన ట్రాక్ కూడా లేదు. ఇప్పుడు ఈ పతకం వల్ల దేశంలో క్రీడా మౌలిక వసతులు మెరుగు పడతాయని ఆశిస్తున్నా. భవిష్యత్తు తరాలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు నా వంతు కృషి చేస్తా' అని పతకం గెలిచిన అనంతరం లెఫాండ్ వివరించింది.




లెఫాండ్ థియా

జూలియన్ కథే వేరు...

పారిస్ ఒలింపిక్స్ మహిళల 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీటర్లలో రజతం నెగ్గిన సెయింట్ లూసియా అథ్లెట్ జూలియన్ అల్ఫ్రెడ్ కథే వేరు! అమెరికా అథ్లెట్లు షకారీ రిచర్డ్‌సన్, జెఫెర్‌సన్ మెలీస్సాలతో పోటీపడి అగ్రస్థానం దక్కించుకున్న జూలియన్... ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ఈ స్థాయికి చేరింది. ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలని ఊహ తెలిసినప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్న జూలియన్... పారిస్‌లో తన కల సాకారం చేసుకుంది. 'ఇది నాకు, నా దేశానికి ఎంతో విలువైంది. యావత్ దేశం సంబరాలు జరుపుకోవడం ఖాయం. చిన్నప్పుడు కాళ్లకు చెప్పులు లేకుండా పరుగులు తీసే దాన్ని. కనీస వసతులు లేకుండానే ఈ స్థాయికి వచ్చా. ఈ ప్రదర్శన అనంతరం మా దేశంలో స్టేడియం నిర్మాణం జరుగుతుందనుకుంటున్నా. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం పెరుగుతుందని భావిస్తున్నా. దేశానికి అంబాసిడర్ అనే భావన కలుగుతోంది. ప్రపంచంలో చాలా మందికి సెయింట్ లూసియా గురించి తెలిసి ఉండకపోవచ్చు. అదెక్కడ ఉంది అని నన్ను ఎంతో మంది అడిగారు. కాని ఇప్పుడు ఒలింపిక్ చాంపియన్ కాబట్టి... ప్రజలు సెయింట్ లూసియా గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతారు'అని జూలియన్ చెప్పింది. వీరిద్దరే కాదు... 1,25,000 జనాభా ఉన్న గ్రెనెడా అథ్లెట్లు 'పారిస్' క్రీడల్లో రెండు కాంస్యాలు సాధించగా... 2,82,000 జనాభా ఉన్న బార్బడోస్ ఒక పతకం నెగ్గింది. ఇక సుమారు 4 లక్షల జనాభా గల బహామస్ ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ఇప్పటి వరకు 8 స్వర్ణాలు, 2 రజతాలు, 6 కాంస్యాలతో మొత్తం 16 పతకాలు గెలిచింది.



జూలియన్

వివేక్ సాగర్‌కు రూ. కోటి నజరానా

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన



భోపాల్: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత హాకీ జట్టులో కీలక సభ్యుడైన వివేక్ సాగర్ ప్రసాద్‌కు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రకటించారు. 'విశ్వక్రీడల్లో భారత హాకీ జట్టు సభ్యులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. యావత్ దేశాన్ని సంతోషంలో ముంచెత్తారు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోనూ సభ్యుడిగా ఉన్న వివేక్‌కు ఆనాడు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. ఇప్పుడు కోటి రూపాయల నగదు పురస్కారం అందజేస్తున్నాం' అని మోహన్ యాదవ్ తెలిపారు.

అదితి వెనుకంజ



టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకం కోల్పోయిన భారత మహిళా గోల్ఫర్ అదితి అశోక్ 'పారిస్'లో మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. శుక్రవారం మూడో రౌండ్ ముగిశాక అదితి 40వ స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన మరో గోల్ఫర్ దీక్ష డాగర్ 42వ స్థానంలో ఉంది. లిడియా కో (న్యూజిలాండ్), మోర్గానె మాట్రాక్స్ (స్విట్జర్లాండ్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. నేడు చివరిదైన నాలుగో రౌండ్ తర్వాత టాప్-3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.

వినేశ్‌కు రజతం ఇవ్వాలి: సచిన్ టెండూల్కర్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకానికి అర్హురాలేనని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేర్కొన్నాడు. మహిళల 50 కేజీల విభాగంలో వరస విజయాలతో ఫైనల్‌కు చేరిన ఫొగాట్.. వంద గ్రాములు అదనపు బరువు కారణంగా పతకానికి దూరమై రెజ్లింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఈ నేపథ్యంలో సచిన్ సోషల్ మీడియాలో స్పందించాడు. 'ప్రతి ఆటలో నిబంధనలు ఉంటాయి. వాటిని సందర్భానుసారంగా చూడాలి. అవసరమైతే మార్పులు చేయాలి. వినేశ్ చక్కటి ఆటతీరుతో ఫైనల్‌కు చేరింది. తుదిపోరుకు ముందు అదనపు బరువు కారణంగా అనర్హత వేటు పడి రజత పతకానికీ దూరమైంది. దీనికి సరైన కారణం కనిపించడం లేదు. ఇందులో క్రీడా స్ఫూర్తి లోపించినట్లే' అని సచిన్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. డ్రగ్స్ వంటి అనైతిక చర్యలతో అనర్హతకు గురై ఉంటే చివరి స్థానం ఇవ్వడం సబబే అని.. కానీ వినేశ్ న్యాయంగా పోరాడి ఫైనల్‌కు చేరిందని సచిన్ గుర్తు చేసుకున్నాడు. ఫొగాట్ రజత పతకానికి అర్హురాలే అని.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (సీఏఎస్) తీర్పు తర్వాత అయినా వినేశ్‌కు పతకం వస్తుందని ఆశిస్తున్నట్లు సచిన్ 'ఎక్స్'లో పేర్కొన్నాడు.

భారత మహిళల 'ఎ' జట్టుకు రెండో ఓటమి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత మహిళల 'ఎ' జట్టు వరుసగా రెండో టి20లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 8 వికెట్ల తేడాతో భారత 'ఎ' జట్టుపై గెలిచింది. మొదట భారత్ 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ప్రియా పూనియా (29) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ మిన్ను మణి (17 నాటౌట్) ఫర్వాలేదనిపించింది. అనంతరం ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 18.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. తహిలా విల్సన్ (53 నాటౌట్), కెప్టెన్ తహిలా మెక్‌గ్రాత్ (47 నాటౌట్) రాణించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.